MUSINGS

I

'e not to be thrilled by

HALAM'

'మ్యూజింగ్స్'

MUSINGS

లోపాముద్రసహచర

'చలం'

Chalam

13 వ కానుక

అభిసారికా గ్రంథమాల

మచిలీపట్నం.

ఒక రూపాయి.

ఆగస్టు
1943

ముద్రణ:
మినర్వా ప్రెస్



Dedication

లీల గారికి

చలం.



MUSINGS

పది అయినట్టుంది. గంటకొట్టారు. యమలాళ్ళలాగు పరీక్షకి యిద్దరు పెద్ద మనుషులు తయారైనారు. మేంముగ్గురం యీ గదిలో మూడు గంటలసేపు పడివుండాలి. వాళ్ళు పరీక్ష వ్రాస్తారు. నేను కావలి. చుట్టూ చూశాను, ఆ కొత్త గదిచుట్టూ. తలుపులు తెరిచిన క్కైదు. తలుపులోంచి చిన్నదొడ్డి కనపడుతోంది. దొడ్డి గోడ వెనక చెరువు. అవతల గట్టున మర్రిచెట్టు. నా కుర్చీవీపు వీళ్ళవేపు తిప్పి ఆ చెరువువేపు మొహం తిప్పడానికి వీలుంటే కొంత 'కన్సొలేషన్'. ఆరు గజాలదూరంలో కూచున్న ఆ యిద్దరు నిర్భాగ్యులూ కాపీ కొట్టకుండా చూడడంతప్ప యింకేపనీ నేను చెయ్యకూడదని, అధికారి భగవదాజ్ఞ. నేను చదవకండా మాట్లాడకండా ఆజ్ఞాపిస్తారు. ఆలోచించకండా కలలు కనకండానో!

ఆకలికొన్న కుక్కలు ఫలిస్తరాకు మీద పడ్డట్టు వాళ్ళిద్దరూ పరీక్ష కాయితాల మీద పడ్డారు. నా ఆలోచనల్లో నేను పడ్డాను.

ఈ తోటలో యిన్ని వృక్షాలూ, గోరింకలూ యెల్లా పోగైనాయో! గోరింకలు విసుగూ విరామం లేకండా వాగుతో వుంటాయి. ఆ శబ్దాలకి ఏమన్నా అర్థం వుందా లేదా? అది వాటి సంభాషణా? వుత్త ఆనందంవల్ల అర్థం లేకండా పలికే శబ్దాలా? తోక లెత్తుకొని చెట్ల మూసుల కెగబాకే వుడతల్నీ, చెట్టుకొమ్మమీదనించి వటిఘంక కిందికిచూసే గోరువంకల్నీ కనిపెడుతో వుంటే, వీటికేమన్నా కష్టాలూ దుఃఖాలూ వుంటాయా అనిపిస్తుంది. కష్టాలున్నా జ్ఞాపకం వుండవు. ఈ 'మెమొరీ' అనేది మనుషులకి యెన్ని లేనిపోని వేదనల్ని తెచ్చిపెట్టింది!

చెరువులోనించి లేచి గేదెలు మర్రిచెట్టుకింద పోగవుతున్నాయి. ఆ చెట్టు వొంగి ఆ గేదెలకేసి చూస్తున్నట్టేవుంది నాకు. నిజంగా చూట్టంలేదా? నిన్న నేను మాధవధారకి వెళ్ళేప్పుడు కొండ మీదికి నా old horse వెళ్ళలేకపోతే దాని మీదనించి దిగి

[illegible]ంచాను. ఆ సైకిల్ నేను దిగిన తరవాత కీచకీచ మంటోంది దోవపొడుగూనా, చిట్టి శెక్కుతో. అలిసినప్పుడు చేతుల్లో యెత్తుకుంటే కుక్కపిల్ల కుయి కుయి లాడదూ తోక ఆడిస్తో; అట్లా అనిపించింది నాకు. ఏమీ? నాసైకిల్‌కి, పదిహేనేళ్ళ స్నేహం గల నా సైకిల్‌కి నేను గుర్తు వుండకూడదూ? నేను తన శ్రమని గుర్తించి దిగినందుకు కృతజ్ఞతను చూపకూడదూ? మృగాలకు గుర్తుంటాను. చెట్లకి తెలుస్తామేమో! వాస్తువులకి! consciousness కి యెక్కడ నడిగీత గియ్యగలం?

తలుపుదగ్గిర నుంచున్న నాపాదాల దగ్గిర చల్లగా, మెల్లిగా, పచ్చగన్నేరు పువ్వు వాలింది. ఏం చేస్తానో అని curiosity తో నా కేసి చూస్తున్నట్టుంది దాని మొహం. నా బూడ్సుకాలితో తొక్కుతానేమోనని భయం చూపలేదు. ఈ పువ్వుగర్భంలో యెరుపూ పసుపూ కలిపినచోటుని చూసినప్పుడల్లా ఏవో, నాకు తెలీని సంగతులు జ్ఞాపకం వొచ్చి సగం బాధిస్తాయి. సగం సంతోషపెడతాయి. ఈ రంగుకీ నాకూవున్న సంబంధ మేమిటో! బందరులో ... యాతో స్నేహానికి యిట్లాంటి రంగుచీరే కారణం. ఈనాటి కార్యాలకి యేనాటి ఆకర్షణలో ఇట్లా కారణాలవుతాయి. గడిచినదీ, గడవబోయ్యేదీ ఒక్కటే straight line. అందువల్ల నేనేనా భవిష్యత్తును కొందరు చెప్పగలుగుతారు

ఒక్కొక్క angle నించి చూస్తే, సాధారణవిషయాలు అద్భుతంగా వికృతంగా కనబడతాయి. వొంటరిగా కూచోడం అలవాటైనవాడికి, యెప్పుడూ తమ స్వంతపనులలో ఆలోచనల్లో వున్న వారికి తోచని సందేశాలూ సందేహాలూ కనపడతాయి.

రాళ్లవంటి యీ గెడలేమిటి? వీటిలోనించి ఆ జిగటపదార్థాన్ని మనుషులు పిండుకోడమేమిటి సన్న ధారలుగా! వాటిని గడ్డకట్టించడం_దాంటోంచి బిడ్డలాగడం _ ఇదంతా తమాషాగా లేదూ? [illegible] పెరుగుచేసిన మొదటిమనిషి యెవరో! అతను ఆశ్చర్యపడడం, [illegible] చూడాలని. [illegible]గా మారిపోతానని భయపడడం —

పదకొండయింది. ఇంకా రెండుగంటలు. నేను గదిలసంగా ఆలోచిస్తోవుంటే యీ గదిలోనే ఒకడు హైడ్రాలిక్స్ లెక్కలు కడుతున్నాడు. ఇంకొకడు Banking ని గురించి పేజీలు పేజీలు నింపుతున్నాడు. ఒకేచోట కూచున్నాం ముగ్గురం. మా మూడు మెదళ్ళూ మూడు వేరేలోకాల సంచరిస్తున్నాయి. ప్రియుడి హస్తాల్లో అణిగి అతని కళ్ళల్లోకి చూస్తోనేవుంది. ఆలోచనలు రెక్కలు దున్నారో యెవరు చెప్పగలరు? ఎందరు యీర్ష్యగల భర్తలు, స్త్రీల దేహాన్ని చేతుల్లో గదుల్లో బంధించి ఆమె మనసుని యేమాత్రమూ వదిలపరచలేక బాధపడ్డవాళ్ళు? ఈ లోకంలోని యీ నిరంకుశత్వమూ క్రూరత్వమూ, బలవంతమూ చూసి జాలిపడి యే దేవుడో ఎవ్వరూ పాలించలేని బంధించలేని యీ మహాస్వేచ్ఛవరాన్ని ప్రసాదించాడు మనసుకి!

Human consciousness ని తలుచుకుంటే, తక్కిన consciousness తో పోల్చిచూస్తే ఏమనిపిస్తుందంటే - యీ ప్రపంచమనేది ఒక diffused consiousness సముద్రమనీ, అది క్రమేపీ చిక్కనై concentrate అయినకొద్దీ జడపదార్థాల,వృక్షాల, మృగాల, మానవుల, consciousness గా తయారవుతోందనీ తోస్తున్నది. ఒక దానికొకటికి భేదంలేదు. అంతా వొకటే. Different stages. విద్యుచ్ఛక్తి అంతటావుంది. కేంద్రీకరిస్తే దీపం వెలిగింది. అట్లానే యీ consciousness ఇంకా చిక్కనైతే కొత్త యింద్రియాల్ని కల్పించుకుని, కొత్త అనుభవాలతో, time లో space లో దూరంగా happen అయ్యే వాటినికూడా అనుభవిస్తుందేమో! Radio, Television చేసే పనులను మనుష్యుడి మనసే చెయ్యగలదేమో! ఏలోకానో అట్లాంటి జీవులు వుండకూడదా?

మధ్యాహ్నమౌతోంది. గోరింకల గోల అణిగింది. ఏమైనారో ఎక్కడా కనపడవు పిట్టలు. గేదెలన్నీ నీళ్ళల్లో చేరాయి మళ్ళీ. నీళ్ళ మీద మూతులు జాచి పడుకున్న వాటి కళ్ళల్లోకి చూస్తే సంపూర్ణమైన సంతుష్టి కనపడుతుంది. ఈ ఆనందం స్వభావమేమిటి? నలుగురిలో, స్నేహాలలో, ప్రేమలో, ప్రపంచ సంతోషాల ప్రయ

క్షణంలో తనని మైమరచి, తానున్నానని మరిచిపోవడమే అధికమైన ఆనందం అంటాడు బెర్ట్రాండ్ రస్సెల్. కాని నాకట్లా అనిపించదు. అది పుత్తగొడలు నీళ్లల్లో పడుకునే ఆనందం, కుక్కలు ప్రేమతో తోయక్కుంటో గంతులేసే ఆనందమనిపిస్తుంది. ఆనందించేప్పుడు ఆనందిస్తున్నాననే జ్ఞానం కలిగివుండడం అతీతమయిందనుకుంటాను నా అనుభవంవల్ల. కాని యీ 'నేను' అనేది మరవకపోవడంవల్ల చాలా వ్యసనాలుకూడా కలుగుతాయి. అహం develop అయినవాడికి, మృగాల stage లో ఉత్త feelings మీద, ఇంద్రియానుభవాల మీద ఆధారపడేవారికన్న యెక్కువ సందేహాలు, వ్యసనాలు కలుగుతాయి. కాని అది మార్గంలో ఒక stage అనీ, యీ అహాన్ని develop చెయ్యడమే అహాన్ని మించగల stage అందుకోడానికి means అనీ అనుకుంటాను. అహం యీ సర్వంలో కలవకూడదు. ఈ సర్వమూ వొచ్చి నా అహంలో కలవాలి.

శేషాచారి శ్రీహరి డాబామీద రాత్రులు కూచుని అట్లానే తల వాంచి, కళ్లల్లో నిశ్చలానందమయమైన చూపు పెట్టేవాడు. ఆ చెరువు వంక చూస్తే అతనే జ్ఞాపకం వొస్తోంది.

ఏదో పిట్ట కొత్తది వొచ్చి చాలా హాయిగా కూస్తోంది. తన పాటని తాను విని ఆనందిస్తోందా? పిండకిల్లా కథ జ్ఞాపకంవొచ్చింది. ఈ కైదులో మగ్గుతున్న నన్ను చూసి జాలిపడి యీ రూపాన్ని ధరించి మృతులైన నా ఆప్తులెవరో నన్ను సంతోషపెడుతున్నారు. పిచ్చిక నామీద వాలినప్పుడు, పిల్లలు నాకేసి జాలిగా నిదానంగా చూసినప్పుడు నా వాళ్లెవరో నాతో సందేశమివ్వడానికి ప్రయత్నిస్తున్నట్టుంది.

వీళ్లు కుర్చీలమీద కూర్చుని వ్రాయడం, యీ కాయితాలు మీకు ఎవరో పంపడం, వాళ్లు గీసిన గీతలమీద వీళ్ల జీవితాలు ఆధారపడడం?

ఆలోచించడానికి మనకి తీరుబడీ, angle of vision వుండదు కాని, వుంటే అన్నీ miracles, అద్భుతాలుగా కనబడతాయి, ఇంకో కోణం నించి absurd jokes గా తోస్తాయి.

ఈ పక్షి పాట ఎట్లా ప్రాణంతో నింపేలా పరిసరాల్ని! ఈ పర్వతాలు కూడా ఆ పాటకి ప్రతిధ్వనిస్తున్నాయి. ఏనాడో, ఏ ఆరణ్య అరణ్యాల్లోనో, ఏకాంతమైన వృక్ష కొమ్మల్లో, తన శాఖలమీద కూచుని పాటలతో రంజింపచేసిన పక్షుల కులాలు జ్ఞాపకం రావటం లేదు కద యీ పర్వతాలకి? ఒక కవి అన్నమాటలు "వసంత కాలంలో ప్రతిసారీ ప్రతి తలుపూ, కిటికీ, దూలాలూ అన్నీ చిగిర్చాలని ప్రయత్నిస్తాయి" జ్ఞాపకం వొస్తున్నాయి.

ఎవరిది? ఎందుకు నాకీ బాధ? ఏమిటి అట్లా స్ఫురణకి రావాలని మనసులో గిలగిలలాడే విషయం? కొలప్రోగట్టున రొంపిలోంచి చెట్టునీడలోకి నీడలోనించి ఎండలోకి నడుస్తున్న అమ్మాయినీ చూస్తున్నాను నా ఆలోచనల్లో మునిగికూడా. ఆ అమ్మాయి వీపు కనపడ్డది. ముక్కల పావడ, తెల్లని ఆకారం, చక్కని గుండ్రని పచ్చని వొళ్ళు. ఎవరు? ఎవరు? చప్పున జ్ఞాపకం వొచ్చి, నా రక్తం ఝల్లుమని ప్రవహించింది. పైకి లేచిన అల విరిగి బీచి మీద పడుచున్నట్టు.

అవును అట్లానే వుండేది ... ఆ మొదటిసారి నా కళ్ళపడ్డప్పుడు. చిన్నది యింకా పన్నెండేళ్ళు లేవు. అప్పటికే, రెండు మాటలు మాట్లాడగానే "ఇన్నేళ్ళెక్కడ దాక్కున్నావు నాకు కనపడక?" అన్నాను. ఆ మాట నా కెంత స్వాభావికంగా అంత చిన్నప్పుడే చాతనయిందా అని ఆశ్చర్యపడతాను. ఆ నాటినించి ఆరేళ్ళు పెద్దదై, పెళ్ళై, తల్లై నాకందక దూరంగా పోయిందాకా ఎట్లాగో నాదేనని. అంతగాఢంగా ప్రేమించే నా హృదయాన్ని విధి disappoint చెయ్యదని, మా యిద్దరికీ మధ్యనున్న నాటకాన్ని ఆటంకాన్ని ఎట్లాగో తొలిగించి నాకిస్తుందని ఆశించాను. ఈ నాటికీ పోలేదు అట్లాంటి ఆశ. ఎట్లాగో నేను గాఢంగా కోరిన ప్రేమని నాకు విధి ప్రసాదిస్తుందని. ఇన్ని నిరాశలూ, విరహాలూ నాకు విశ్వాసాన్ని వ్యర్థం చేయలేక పోయినాయి..... నా, చిన్న ఆధారంగా పెట్టుకుని, ఎన్ని కలలు, ఎన్ని కన్నీళ్లు అప్పుడే. ఆ హింసే. నా

యవ్వనపు restlessness నా మూర్ఖ రసికత్వం, అది యింకా
బాగా అర్థంగాని రోజుల్లో ఆవేశాలూ అన్నీ అన్నింటితో నూ
పూజించాను, నీ సుందర శిలమూర్తిని. అట్లాంటి అందం, పాలూ
పువ్వులూ తేనె కలిపిన దేహపుకాంతిని, నీ వెన్నెల చెక్కిళ్ళని, నా
రక్తాన్ని ఆగేట్టు చేసే చిరునవ్వుని మళ్ళీ యింతవరకు యెక్కడా
నేను చూడలేదు. ఆడవాళ్ళు, నిన్ను తలుచుకుని నీ అందానికి ముర
వడం, ఆశ్చర్యపడడం చూశాను. అందమైన వాళ్ళకి ప్రసిద్ధికెక్కిన
మా వంశంలో అందమైన దానివి నువ్వు. నువ్వు లేకపోతే పాఠా
లతో పరీక్షలతో టీచర్లతో కంటకమైన నా బాల్యం దుర్భరమై వుం
డును. నువ్వు నా పక్కనవుంటే, నీతో ఆడుకుంటున్నా నన్ను
చూస్తేగాని అంతసేపూ నీ ఆహారంలోంచి మెరుస్తూ కనబడే మెడ
మీదా, చేతులమీదా, నవ్వే నీ పెదవులమీదనే వుండేది దృష్టి.
నీవు ఇంకోవంక తిరిగితే యింకోరితో మాట్లాడితే భరించలేను.
నువ్వు నిద్రపోతున్నప్పుడు, సన్నని దీపం కింద చదుకున్న రాత్రులు,
నిన్ను దగ్గరగా ఆడుకుంటూ గడిపిన గడియలన్నీ తెల్లవారి వెలు
తురు కిటికీలోంచి మీదపడి నన్ను దూరంగా జరిపిందాకా, నీ నవ
కోమలత్వంతో నేను పడ్డ శ్రమ నీకు తెలీదు. నీ అందాన్ని ఏం
చేసుకోవాలో నాకింకా తెలీదు అప్పటికి. కోతికి మెరిసే జరీ
వస్త్రం దొరికినట్టు. నిన్ను పెళ్ళిచేసుకోవాలనివుంది. నీతో చెపితే
నవ్వుతావనీ, ఇంక నాతో మాట్లాడవనీ భయం. 'మూర్ఖుడా, అధ్యం
తరాలు నీకు తెలీవా?' అని అంటావేమోనని సిగ్గు. కాని నా ఆశకు
అంతంలేదు. విధిలో విశ్వాసం అమోఘం. ఎన్నడూ నా వాంఛని
నీకు తెలియనియ్యలేదు. ఎన్నడూ చెప్పను: కాని నీ కళ్ళల్లోని నవ్వుని
చూసినప్పుడు, మన చిన్నతనాన్ని తలుచుకున్నప్పుడు, నీ పెదవుల్లో
జాలిని గుర్తించినప్పుడు, నా కోర్కెలు నా నిరాశలు, నీకు తెలు
సునా అని సందేహపడేవా నీకాడు. ఎప్పుడూ నిన్నెందుకు వొంట
రిగా అక్కాపాత్యవాళ్ళో, నువ్వు మళ్ళీ కదలకుండా, నిన్ను నవ్వి
స్తూ entertain చేస్తూ గంటలకొలది ఎందుకు కూచోపెట్టుకునే
వాణ్ణో ఆ నాడు నీకు తెలుసు స్పష్టంగా నాకూ తెలీదు. ఏమిటి

నా వంక అట్లా చూస్తావని నువ్వడిగితే నాకు మాత్రం ఏం తెలుసు జవాబు? ప్రత్యుత్తరం యింకా బాల్యపు పొరల క్రిందనించి పెనుగులాడుతోంది రూపధారణకోసం.

స్తంభంపక్కన ఆమెని ముద్దుపెట్టుకుంటోవుంటే చూసి, భ్రమపడ్డారు. "నేను పెళ్ళిచేసుకుంటాను." అని అరవబోయి సిగ్గుతో నోరుమూసుకున్నాను. ఆ మాట అంటే ఆకాశం నెత్తిన విరిగిపడుతుందని . తెలుసు. ఇంక. ఆమెని జన్మలో చూడనీరని. మేము తిరిగిన కాలవగట్లు మేము కూచున్న చెట్లనీడలు, సముద్ర తీరాలు, కొండరాళ్లు అన్నీ యింకా మమ్మల్ని జ్ఞాపకముంచుకున్నా రేమో!

పన్నెండయింది. పిట్ట యింకా అట్లానే పాడుతోంది. నా తెల్లచొక్కా చుక్కల పావడా గట్టుకింద రోడ్డులో నా ... ల జీవితపథంలో మాయమైనట్టే మాయమైనాయి. ఆ పిట్ట పాటువింటో ఉంటే మేర్లీ ఓబెరాన్ పొన్న ఫిలింలో పాడిన పాట జ్ఞాపకం వొచ్చింది. ఆమె పాట వింటోవుంటే నాకు స్వర్గంనించి దిగివొచ్చిన పక్షి పాడుతున్నట్టుంది. ఈ ప్రజల్ని ఒక్క నిమిషం దేవవాయువులలో వోలలాడించడానికి. కాని ఆమె సన్నగా పిట్టలాగు దీర్ఘం తీస్తోవుంటే నా బెంచిసోదరుల్లు, కూతలుకూసి వెక్కిరించడం ప్రారంభించారు. ఆ సంగీతం వీళ్ళచెవులకి అలవాటుకానిదే కావొచ్చు. అయినా వాళ్లు కొంచెం నిదానించి ఆలోచించరు. ఆ ఫిల్ము పేరు పడది. దశావతారాలకీ, లవకుశలకీ, అలవాటుపడ్డవాళ్ళకి కూడా వూపిరి తిరక్కుండా అద్భుతంగా act చేస్తోంది ఆమె. ప్రతి చిన్ని పద్ధతీ యెంతో అనుభవంమీద ఆలోచనమీద యిమిడ్చివుంటారు ఆ ఫిల్ముకి. అల్లా ఆ వొక్క పాటనీ యెంతగొప్పది కాకపోతే పాడించివుంటారు! సానుభూతితో విని చూద్దామనే జ్ఞానంలేదు. ఆ సంగీతాన్ని యిష్టపడే వాళ్లున్నారేమో, మన కూతలు కలపడం అన్యాయమేమో అనే సందేహమున్నారాదు. అంతేకాదు ప్రేమకోసం కథానాయిక నిప్పుల్లోంచి నడిచే struggle కనబరుస్తోవుంటే అర్థం గాక [illegible]గా నవ్వుకొంటూ. [illegible]లో [illegible] సంస్కృతి

మహా వ్యాసం సుళ్ళు తిరక్కుండా కొండకేపోగానీ emotion రాక్కుండా ఆ బురిల్లోకి. ఆ heroine కళ్ళల్లో ప్రదర్శించే ప్రేమని పాశ్చాత్యంగా అర్ధంచేసుకుని నీతిదట్టాలుపయోగించి judge చేసే యీ గ్రంథాలలో పేరు వచ్చిపోయింది. ఈ దేశానికి పాతివ్రత్యమే మిగిలింది. art అంతరించింది. పాత పుస్తకాల్లో అంత హృదయమైన భావాలు వుండబట్టీ, పాత దేవాలయాల్లో అంత విశాలమైన కళ కన బడుతో వుండబట్టీ, యింకా యీ దేశంలో యే నలుగురో రసికులు మిగలబట్టీ కాని యీ వాడు యీ దేశం సముద్రంలోకి కుంగిపోలేమా త్రం లోకానికేం నష్టం?

పన్నెండు దాటింది. నీడల్ని మర్రిచెట్టు దగ్గిరగా లాక్కుంది. నీళ్ళు మరీ నీలంగా కనబడుతున్నాయి. చెరువు మీదనించి కిరణాలు కొంచెం యేటవాలుగా మెరుస్తున్నాయి. గేదెలు కళ్ళు మూశాయి తన్మయంలో. రోడ్డుమీద మనుష్య సంచారం లేదు. పాడేపిట్ట యెగిరిపోయింది. గాలి వేపచెట్టు మధ్య కూచుంది. సీతాఫలం కాయ యెండని మదించి తింటోంది. ఇద్దరు పరీక్షార్థులూ, వూరికే బతికేస్తున్నారు. నేను కావిలా యీ ప్రపంచానికి! కవి, Philosopher చలం Dreamer! నీగతి యిట్లా పట్టిందా చివరికి? చంద్రసదనాల విహారిద్దామనీ, అప్సరసలను లాలిద్దామనీ, ఈశ్వరుణ్ణే ప్రశ్నిద్దామనీ వూహ లల్లే నువ్వు గంటకి రూపాయికోసం యీ వెట్టిచాకిరికి వూనావా? మూడుగంటలు నువ్వు వ్రాసిన యీ వ్యాసానికి ప్రతిఫలం పరీక్షల్లో చివాట్లూ!

ఈ కూడేమిటి! యీ బూట్సేమిటో? యీ కుర్చీ యేమిటి? పైగా కలమూ కవిత్వమూనా! చెరువులో గొల్లపిల్లల వలె గేదె వీపు నెక్కి అడకారాదూ? గాలం తీసుకుని నడిరోడ్లో వేసి మర్రివూడల మధ్య పడుకోరాదూ? గోచీపెట్టి కర్ర చేక్కుపెట్టుకుంటూ, మొగే [illegible] చూసి అక్కడో, చీపులుంచిడి తిరగరాదూ? ఆ మాధవధార దగ్గిర [illegible] కాకుండా [illegible] కలిసిపోరాదూ? ఇంతకన్న [illegible] ఎక్కడ [illegible]

మేమిటి? ఐదురూపాయలా? సాయంత్రానికి సినిమాకి డబ్బులా! నీ ఖర్మం!

ఇట్లాంటి యెండాకాలపు మధ్యాహ్నాలే, నేనూ...ణా మా పెట్టెబండి పాకలో విడిచి వుంటే దాంట్లో యెక్కి కూచునేవాళ్ళం. ఏమేమో ప్రియమైన వుద్దేశ్యాలు ఆమెకి తెలియచెయ్యాలని వుండేది. కాని యిప్పటిమల్లే కవిత్వపు వాక్యాలు నోటికి చప్పున అందేవికావు. ఆ పాకా, ఆ బండీ చీకట్లో ణాతో యెందుకంత వోపికగా గంటల కొలది కూచునేదో! వెడతానని అంటుందని భయం. ఆమె బుజానికీ బండీకీ మధ్య నా వేలు నలుగుతోంది. ఆమెజుట్టు నా మెడమీద గిలిగింతలు పెడుతోంది. కర్ణుడిలాగు ధీరంగా కదలక కూచున్నాను. మెల్లిగా నా మెడకింద ఆమె పెదిమలు కదిలాయి. అది ముద్దు అవునా కాదాఅని యీనాటికీ తర్కించుకుంటోవున్నాను. అడుగుదామా అనుకుంటాను ఆమెని. మర్యాదస్తురాలు, పెద్దకుటుంబానికి అధికారి యేమంటుంది?

నా చెంప తడి అయింది.

“ఎందుకు ఎందుకు...ణా”

“ఎందుకు మరి నీకు—నామీద యింత ప్రేమ?”

ఈ పాతికేళ్లూ నన్ను అగ్నిలో, అమృతంలో, ముళ్లలో, మేఘాల్లో లాగి, తిప్పి అదిమిన చేతులూ, పెదవులూ చూపుల్నీ వీటినన్నిటినీ పక్కకి తొలగించి మృదువుగా పవిత్రంగా నన్ను యిట్లాంటి మధ్యాహ్నమే నువ్వడిగిన ప్రశ్న ప్రతి మధ్యాహ్నమూ నాకు వినబడి నరాల్ని ఝల్లుమనిపించి wonder చేసేట్టు చేస్తుంది.

వొంటిగంట. అమ్మా! విడుదల.

కొత్తవాళ్ళు పరీక్షలకి వాస్తుంటే, కావలి కూచున్నాను. ఈ పరీక్షా యువకులకి కాపీలు చెయ్యడం యొక్క బాధో, లేక విద్యాప్రాపంచికంగా కావలికాయడం యొక్క బాధో నిర్ణయిం చుకోలేకండా వున్నాను. ఈ కావలి కాయడంలోని యీ అనుమానంలో నైతిక వైచిత్ర్యం స్ఫురిస్తుంది. "మీరు దొంగలు. మీకు నీతిలేదు. నేను చాలా నీతివంతుణ్ణి. మీ దొంగతనాలు పట్టిచీల్చేందుకు ఇక్కడ కూచున్నాను." అంటున్నట్టుంటుంది. వాళ్ళు తలెత్తి నావంక చూసి, మళ్ళీ తలవంచి వ్రాస్తుంటే, అక్కడ కూచోడం సిగ్గు వేస్తుంది [illegible] వాళ్ళుంటారు. పనిలేనివాణ్ణి, ఎవరితోనూ యే సంబంధంలేనివాణ్ణి, పైగా విరోధిని నేనే. పరదేశంలో భాష రానివాళ్ళలో యేకాకినై కూచున్నట్టుంటుంది. నిశ్చలంగా పనిలేకండా సుఖంగా కూచోడం రెండురకాల వాళ్ళకే చాతనవుతుంది—పశువు లకూ—ఋషులకూ—పైపెచ్చు, నాలాంటి టీచర్లకూ—ఇట్లా కూచో పెట్టి పశువుల్ని ఋషుల్ని చెయ్యలేరుగాని—పశువులంతగొప్ప చెయ్య లేరు. [illegible] మారుస్తారు.

నా చిన్నతనం పనిలేకా, వెంటనే అప్రయత్నంగా 'Day dreaming' పగటికలల్లో పడిపోతాను. నన్ను కావలిపెట్టి ఏం లాభం?

ఎందుకూ యీ యాతన! ఆ పిల్లలు ఆ ప్రశ్నల్ని సాగతీసి సాగతీసి అట్లా తెలిపోని ప్రత్యుత్తరాలు వ్రాయడం, నేనీశూన్యాన్ని భరించలేక మనసులో తిట్టవలె కొట్టుకోవడం ? ఎందుకోసం ? పిల్లల్కీ, యొక్కళ్ళకీ యీ లోకం ఇట్లాంటి అనర్థాలనించి పైట పడుతుంది ? పైగా యింత వైచిత్ర్యంలో బాధలో నేర్చుకునే విద్య, యీ కాయితాలలో కొలిచే జ్ఞానం, మనుష్యుల మెదళ్ళని వెలిగించి, లోకాన్ని ఉద్ధరిస్తుందట.

ఏమో, నాగరికత అంటారు—ఇండస్ట్రీలు, రోగాలు, దారిద్ర్యాలు, పాపాలు, అన్నీ తగ్గాయి. ప్రజలు సౌభాగ్యవంతులయ్యారంటారు. కాని యీ ఫ్యాక్టరీలు, యీ పరీక్షలు, యీ రైలు ప్రయాణాలు, ఇన్స్టిట్యూషనులు, కోర్టులు, బ్యాంకులు—ఫ్యాక్టరీలు—ఏమిటో ఈ నాగరికత—ఎంత అర్థవిహీనమైన శ్రమ—యీ సంకెళ్లు—యీ పరుగులు—వీటన్నిటికీ మానవజాతికి విముక్తి!

ఉండి, ఉండి, యీ నాగరికవృత్తిని భరించలేక ఒక్కసారి అరుపు అరిచి, యీ విద్యనీ, యీ పరిశ్రమనీ వదలి తిట్టి, పైకి పారిపోవాలనిపిస్తుంది. ఎప్పుడో యీ నిగ్రహశక్తి అల్పమైపోయి, బాధ అమితమై, అట్లాంటి ప్రయత్నం చేస్తానేమో! 'పిచ్చి' అని ఒక్కమాటతో నా పేరు కొట్టేస్తారు—నాలాంటి వాళ్లు, నాకన్న సుకుమారమైన ఆత్మలు కలవారు, ఆరోగ్యవంతులు ఎందరు యిట్లా తిరగబడి లోకానికి పిచ్చివారై పోరు కారు! కాపురత్వం వల్లో యింకీ, లోక పూర్తిత్వాన్ని చూచి జంకీ, యీ అదృష్టంలోనూ, దేవుడిలోనూ నమ్మకం లేక—సైనికంగా యిట్లా యీ నిరర్థక జీవనవృత్తిలో నిలిచివున్నాను.

ఊరికే కారణం లేకుండానే జరిగిన సంగతుల్లూ, తెలిసిన ముఖ్యాలూ తటాలున జ్ఞాపకం వొస్తారు. ఎందుకా అని యోచిస్తే చెప్పలేను. మెదడులో ఆ Cell కదులుతుందేమో! లేక నేను చూసే మొహాల్లో ఏదో పోలిక నాకు తెలీకుండానే ఆ మొహమూటం చూస్తుందో! లేక యీ గాలిలో, ఎండలో, చెట్లలో, ఏదో ఆ నాటి పోలిక తోచి, ఆ విషయాలన్నీ స్ఫురిస్తాయో! అట్లా జ్ఞాపకం వొచ్చింది, బంగారమ్మ.

నేను పసివాణ్ణి. అంటే, యౌవనం వచ్చేట్టు ఆమెకి ముందు వచ్చింది. ఆమెని చూసిన మొదటి నిమిషాన్నే అద్భుతమైన భక్తి కలిగింది ఆమె సౌందర్యం మీద.

నేను నిద్రపోయ్యే స్థానాని కెదురుగా, పచ్చదనం నిండిన ఆ మనం పెద్దదివ్యం లేదు. పొద్దున్నే లేచేటందుకు జ్ఞాపకంతో, నేను నీకే, నా విశాలనేత్రాలకి ప్రథమదర్శనం, ఆమె ఆ ఆకృతి

ప్రేమించాను. పెద్ద పద్మంలో నుంచుని కనపడేది నిశ్చలమైన నీటిపద్మం. ఆ పద్మంలో లేత ఎరుపురంగు తలుచుకుంటే యీనాడూ ఏనాడూ నా మనసు యీ దృశ్యప్రపంచాన్ని వొదిలి, యేదో సగం తెరిచినట్టి, దొరకరానిది ఐన యేదో వివిధవర్ణాల సూక్ష్మప్రపంచాన్ని అందుకోవాలని బాధపడుతుంది. మరి చిత్రకారుడు ఆ పుష్పంలో ఏ అనుభవాన్ని సూచించాడో! పద్మం చూస్తేనే నా కేదో మధురమైన అసాధారణమైన పరిమళం తట్టుతుంది. అందువల్లనే ఆలోచిస్తాను. ఇంతకు పూర్వజన్మ వుందిగావును; లేక పూర్వలోకాల వున్నాయిగావును—అక్కణ్ణించి తెచ్చుకున్నానేమో యీ జ్ఞాపకాన్ని! అంతకుతప్ప కారణం కనపడదు. ఉంటే Psycho-analysts కనిపెట్టి చెప్పాలి. ఆ లక్ష్మి ఆ పద్మంలోని భాగంలాగు తోచేది. ఆ కాంత్రని చీరనే ముద్రించక, ఆ పద్మంరంగులోనే ఆమె దేహాన్ని కలిపేసి వుంటే!

బంగారమ్మని చూడగానే నాకు నా చిరపరిచితురాలు లక్ష్మి జ్ఞాపకం వొచ్చి, బంగారమ్మని ప్రేమించాను. కొన్ని రోజులు తలుపు సందుల్నించి, కొన్ని రోజులు, మావాళ్ళ కాళ్ళ సందుల్నించి ఆమె ముఖంమీది చిరునవ్వుతో ఆడుకున్నాను. అంత చిన్నతనంలోనే నా పురుషత్వం నన్ను సిగ్గుపెట్టి బాధించేది. ఆసిగ్గువల్లనే ఎన్నో ఆనందాలు పోగొట్టుకున్నానా అని దిగులువేస్తుంది. ఆమెకీ సంతోషమే, సగం దాక్కునే నా మొహంతో దోబూచులాడడం! నన్ను మరిచి పక్క స్త్రీలతో ఆమె మాట్లాడితే తలుపుకి ముఖాన్ని నించి బాధ పడేవాణ్ణి. ఆచిన్న శరీరంలో పురుష హృదయం జెలసీ అంకురాలు అప్పుడే. ఎట్లాగో ఒక రోజు ఆమె వొళ్ళో వున్నాను. నన్ను మరిచి ఆమె నవ్వుతోంది, చుట్టూ స్త్రీలతో. ఆమె చుట్టూ మూగేవారు స్త్రీలు. ఆమె సౌందర్యానికి సంపద పాయపడ్డది. నా లక్ష్మి! ఎన్నో చూపులతో తాగేవారు ఆమెని—ఆ దేహకాంతి, బంగారళ్ళ మెరుగూ, అధిక్యత కోసం పడే తగువును. వొళ్ళో మాయున్న బాలుడి హృదయంలో అర్థం కానిది, భయం కలిగించేది, సగం కళ్ళు విప్పుతున్నది, అయిన 'emotions' ని ఆమె యెరగదు. నా మొయ్య

ఆమె కంఠాన్ని, చంచల్ని, 'explore' చెయ్యడం, నాకిష్టం కొత్త తృ
ఆమె చిరునవ్వు కోసం నేను వెతకడం ఆమె యెరగదు. నే నెవరు?
అనేక స్త్రీ పురుష హృదయాల్నుంచి ఆరాధనని నిరంతరమూ పొందే
ఆ లావణ్యవిగ్రహానికి నా పైని మమత యేం లక్ష్యం?

నాశరీరానికి వయసు అతి అల్పం. ఏ ఆశక్త నా జ్ఞానమూ లేవు.
కాని యీ హృదయం! ఎన్ని జన్మాల అనుభవాన్నో, యెన్ని అనుభ
వాల ఫలాన్నో, యెన్ని ప్రణయాల అగ్నినో వెంట తెమ్చుకుంది
గావును!

హృదయం_పాపం! తనబాధ తనకే తెలియని నా పసిహృద
యం_ఆమెనించి యేం కోరుతోందో యెరగని ఆ హృదయం_ఆమె
చుట్టూ మూగి చీకట్లో గొప్పగానం విన్నదానివలె అర్థంకాని తపన
పడ్డది. ఆనాటినించి నిలిచింది బంగారమ్మ నా జీవితపథంలో మొదటి
ప్రణయజ్యోతిగా. ఏరూపాన్నైనా అప్రయత్నంగా ఆమె సౌంద
ర్యంతో పోల్చి చూస్తుంది నా మనసు.

ఈ జన్మలో అత్మ కాళ్ళకింది పద్మంవలె వొచ్చే జన్మలో
బంగారమ్మ స్వరూపం నాకు కళాదర్శమై, ఎట్లా మనసులోకి
వొచ్చిందో అర్థంకాక, బాధ పెడుతుంది గావును!

ఈ ప్రేమలో యిన్ని mysterious influences పెట్టుకుని
వాటి పర్యాంచలాలని అప్పుడప్పుడు అందుకోగలిగిన నేను, కథలలో
స్త్రీ వ్యక్తుల్ని సృష్టించ ప్రయత్నిస్తే, ఎందుకర్థమవుతాయి, యీ
పశువులకి!

నా పూర్వ సుకృతంవల్ల యీనాడు నాకంటికి యెదురుగా,
యీ బల్లల మధ్యనించి, వొంగిన పిల్లల పిచ్చి తలల మీదనించి, స్కూలు
తోట కనిపిస్తోంది. ఈ ప్రేమయినంగు నున్న_ళ్లలోంచి నవ్వూ,
స్వేచ్ఛా, విశ్వాసమూ, ధైర్యమూ, అందమూ, తరమి గలి గారు.
చాలా పొరలల్లో గాలినీ, వెలుతురునీ కూడా బహిష్కరిస్తారు.
(ఒక్క యీ క్రియనింగు నున్న_క్లమిటి అన్ని ఋక్షలో యింతే)
కాని యీ చెట్లు, యీ యెండ, గడ్డీ, గాలీ, యెట్లాగో అధికార్ల
ఆజ్ఞల్ని తప్పించుకుని దొంగతనంగా జొరబడుతున్నాయి. శ్రుణులు

క్రోటన్సుమధ్య ఎక్కడా లేని తొట్టిలో కూష్మాండజాతాన్ని గడ్డి మధ్యలో కప్పింది. ఆ గడ్డి మధ్య ఒక్కటే రౌద్రని పువ్వు గాలిలో వూగుతూ అవిసిన నాదృష్టిని అది ఆకర్షించింది. అప్పుడే కొత్తగా భూమిని బద్దలు చేసుకుని, మొఖాన్ని ఎత్తి, ఎండనీ, చెట్లనీ, చూసి కిలకిల నవ్వుతో తలవూపుతూ బాటసారులకి దూరానికే సంతోషంతో గంతులువేసి ఆడు తోంది. ఈ బిడ్డను చూసి చుట్టూ వున్న ముసలమ్మ చెట్లు కూడా చిగుళ్లు తొడిగిపెట్టి ఆనందిస్తున్నాయి. మన అనుభవానికి అందదు గనక మనకి తెలీదుగాని, చెట్లకి జన్మవల్ల, వృద్ధివల్ల, ఆహారంవల్ల ఆనందం వుండదా? పిల్లలకి ఏమి తెలీదు. కాని పాలుతాగి, గాలితగిలి, ఆనందించదా? ఏడుస్తుంది, తీరికగా సానుభూతితో పరిశీలిస్తే. ఈ వృక్షాల మనో భావాల్ని కనుక్కోగలం. చెట్లకి ప్రాణమూ, బాధా లేవుగనక వాటిని నిరుపయోగమని నిర్వలంగా నిర్భయంగా తెలిపినట్టు వాదించేవాళ్లని చూస్తే అసహ్యమేస్తుంది. మంచూ, వెన్నెలా, గాలీ, వానా చెట్లకి ఇచ్చే ఆనందాన్ని చూడనివాడు అంధుడే.

అట్లాగే ఆ పువ్వు కేసి చూసి కలలు కంటున్నాను. ఎండ తెలుస్తోంది రౌద్రని రేకులమీద. భూమికి గాటు తగిలితే పైకివచ్చిన రక్తపు చుక్కలాగుంది పువ్వు! ఆ పువ్వుని చూస్తే విశ్వనాథ సత్య నారాయణగారు ఏమని వర్ణించి వుంటారో?

ఇట్లా ఆలోచిస్తూ వుంటే గంట కొట్టారు. గడియారం మెల్లిగా తిరిగింది చిత్తూరు రైలు చక్రాలవలె. నా స్వేచ్ఛానందంలో పువ్వునే మరిచి నా గతినే మరిచి బైటికి పరిగెత్తాను. మంచినీళ్లు తాగాను. ఏం చెయ్యను? సంగతాముల మందికొక్క హెడ్మాస్టరు మొహం చూడాలి కోయి అనుకున్నందుకు.

కాని ఏమిటా కోయిన ఆనందం? ఆ రౌద్రని పువ్వు! తోటలోకి పరిగెత్తాను. ఆ తొట్టిమధ్య గడ్డిలో వెతుస్తే ఎవరో వుండ కట్టి పారేసిన రౌద్రని కాయితం కనబడింది. అది నన్ను వెదుకుగం కాగితపు పువ్వు.

ప్రాణం విరుక్కుమంది, సిగ్గేసింది. ఆ కలని కూడా అట్లాగే గాలి వుండకూడదా? కాంతనే కాని నిజమైన పువ్వు మొక్కలగల

ఆనందాన్నంతా యిస్తోందికదా దూరాన్నించి! దాన్ని అట్లానే వొదిలి వుండకూడదూ? జ్ఞానం, సత్యం అని వేళ్ళాడతారు యీ వైరాగ్యులూ, నీతిపరులూ! సౌందర్యాన్ని ఆనందకరమైన భ్రమ అనుకుంటే జ్ఞానం యేం లాభం? వ్యభిచారిణి ప్రేమ తనదేనని మోసపోయే భర్త, ఇంకొకడికి పుట్టిన బిడ్డని తనదేనని ప్రేమించే తండ్రి, లోకమంతా తన ఆజ్ఞలమీదనే నడుస్తోందని గర్వించే అధికారి, తాను వొళ్ళుమరిచి చచ్చినవాళ్ళు బతికేవున్నారని వూరటపొందే దుఃఖితుడు, వీళ్ళందరికీ వాస్తవజ్ఞానం యేం వుపయోగం? ఈ లోకమంతా అశాశ్వతమని బోధించే వుపనిషత్తులు; స్త్రీ సౌందర్యం రక్తమాంసమని రోత పుట్టించ చూసే నీతికావ్యాలు; నక్షత్రాలు, సూర్యుడూ వుత్త నిర్జీవఅగ్ని జ్వాలలని నిరూపించే నూతన శాస్త్రము; గంగను ధరించి యెద్దునెక్కే శంకరుడు వుత్త చిత్తభ్రమ అని బోధించే rationists—వీళ్ళందరూ యెంత సౌందర్యాన్ని మింగేశారు?

విరక్తి! విరక్తి! కొడుకెవడు, తల్లెవరు? భార్య యెవరు? అంతా మాయ! అని తత్వాలు పాడి, యీ లోకసుఖాన్ని ధ్వంసం చెయ్యాలని చూసే వ్రతివాణ్ణి కాల్చివెయ్యాలి. నిజంగా అక్కడ పువ్వుంటేనేం? కాయితంపువ్వు వుంటేనేం? నాకు ఆనందమిచ్చేప్పుడు ఏదైతేనేం? అట్లా చూసుకుంటే, నిజమైన పువ్వుం, విషయంలో కూడా ఆ యెర్రతనమూ ఆ మృదుత్వమూ నా మనసు కల్పించుకున్న గుణాలే. ఆగుణాలు నా మనసువి. పువ్వులో వున్నాయా? ఈ పంచేంద్రియాలే యీ దుఃఖాన్ని, భయాల్ని, యీ ప్రపంచ జ్ఞానాన్నీ కల్పించాయి. మనసు వాటి యింద్రజాలాలకి లోబడి కలలు కంటోంది. ఎందుకూ నిద్రలేపడం? కాని యీ యింద్రియాలకే ఆజ్ఞలు పెట్టగల మనసేవుంటే! ఆనందానుభవాన్ని కల్పించుకోగల మనసే వుంటే! అదేనేమో స్వర్గం? ఒక కవి—

ముళ్ళలో గులాబిపువ్వు వుందే అని ఆశ్చర్యపోతే, యింకో కవి—

గులాబిపువ్వు చుట్టూ ముళ్ళున్నాయే అని యేడుస్తాడు.

తాను ఒక గొప్ప కవినని గర్వించి తనకి సమస్తోపచారాలూ జరుగుతున్నాయనే భ్రమలో బతికే పిచ్చివాడికన్న అదృష్టవంతు డుండడు. నిజమైన మహారాజా రాజరికం ఎంతమాత్రం వాస్తవం? తాను రాజాననే జ్ఞానం అధికారం ధనం వున్నాయనే జ్ఞాపకమే కదా అతని కానందాన్నిచ్చేది. నిద్రలో రాజుకీ జోగికీ భేదంలేదు. అవి పిచ్చివాడికీ వున్నాయి. ఇంగ్లీషులో ఒక కవి తన మనోప్రపంచంలో ఎన్నో రాజ్యాలు పాలం తనకింద వుండని వ్రాశాడు. కృష్ణశాస్త్రి తన ప్రియురాల్ని హృదయ రాజ్యాల్ని యేలుకుందాం రమ్మని ఆహ్వానించాడు. శైట వొస్తువు లేనిదే దానినించి రాగల ఆనందాన్ని కల్పించుకోగల మనసే వుంటే అది యెంత అదృష్టం! కాని సామాన్యమానవులకి యీ illusions, self-deceptions చాలా అవసరం. లోకానికి అవసరమైన ఘనకార్యాలు చేస్తున్నామనీ, కాలం అంతమయ్యేదాకా జీవించగల పుస్తకాలు వ్రాస్తున్నామనీ, తమని చూసి లోకమంతా మెచ్చుకుంటున్నారనీ, భయపడుతున్నారనీ, తాము తక్కిన మనుషులకంటె వున్నతులమనీ నిరంతరమూ మోసపోవడానికి వీలయ్యే రంగుల ఇంద్రజాల వస్త్రాల్ని కప్పాడు లోకం మీద దేవుడు. అట్లా కాకుండా అసలు basic principles దగ్గిరికి తరచి చూడగలిగితే యేం మిగులుతుందో, శూన్యమేగా, పరమజ్యోతిలో దాన్ని భరించగలరా జీవులు! తల్లి, దేశం, పుణ్యం, శౌర్యం యీ సెంటిమెంట్సు అన్నీ మాయేకదా! కాని ప్రపంచం వాటిమీదే నడుస్తోంది. అవి లేకండా ఒక్క నిమిషం నిలవదు.

నిన్న సముద్రం వొడ్డున కూచుని పడమట మెరిసే చుక్కని చూసి కుర్రడిమీద షెల్లీ వ్రాసిన పద్యాలూ అవీ జ్ఞాపకం తెచ్చుకుని సాయంత్రమంతా మురిశాను. గంటైనా ఆ నక్షత్రం కిందికి జారక పోతే అనుమానం కలిగి తర్కించ ప్రారంభిస్తే అది ఆకాశానికెత్తిన విమానం దీపమని తేలింది. మన ఆనందమంతా యింతేనేమో! మన బాధలూ ఇంతే. సంభవించని బాధలు రాబోతున్నాయనే భయంతో వేదనలో కుమిలే వారెందరు లేరు? బాధ మాయ అని తెలుసుకో గలిగితే బాధలే వుండవేమో! జ్ఞానంవల్ల సుఖదుఃఖాలకన్నిటికీ అతీ

తుడై పరబ్రహ్మ స్వరూపంలో ఐక్యమౌతాడని వేదాంతుల వాదన. సుఖదుఖ్ఖాలు లేకండావుండే స్థితి యేం సుఖమా అనుకుంటాను. బాధలోకూడా ఆనందం కనపడుతుంది నాకు. ఈ వేదాంతులకి ఆనందంలో బాధ కనపడుతుంది. బాధలు తాత్కాలికాలు. మనుష్యుల మూర్ఖంవల్లా, దేవుడి క్రూరత్వంవల్లా కలిగాయి. కొన్ని యుగాలలో వీటినన్నిటినీ నిర్మూలించబోతున్నామని నా కలలు. ఈ ఆనందమంతా మాయ. దీన్ని నమ్ముతుంటే బాధ తప్పదు. లోకం రానురాను అధోగతికి నడుస్తోంది. విరక్తిని సంపాదించమని వాళ్ళ ఘోష.

'సైకాలజీ' ప్రకారమైనా యీ సుఖదుఖ్ఖాలు మన నరాల సంచలనం చేతనే కలుగుతున్నాయి. బహిఃప్రపంచం లేకండానే నరాల సంచలనం కల్పించుకోగల శక్తిగలవాడికి యిష్టానుసారం ఆనందం కలుగుతుందికదా! అదేలాగుంది యోగానందానికి రహస్యం.

ఈశ్వరుణ్ణి చూశామనీ, పరమానంద మనుభవించామనీ, అనే యీ ఋషుల ఆధ్యాత్మికానుభవమంతా ఈ నరాల సంచలనమేనేమో! దేవుడైనా మెదడులో పుట్టవలసిందేగా!

నియమాలు, నియమాలంటారే అదంతా చాలామటుకు saving one's face. నిజమైన నియమాలు మనస్సుల్లోనే వుంటాయి. కాని బైటికి రావు. కనక అవసరమైనప్పుడు, ఎవరికీ తెలీకుండానే వాటిని సులభంగా వొదులుకోగలరు. కాని యే నియమాలకై మనిషి ప్రసిద్ధి కెక్కాడో వాటిని వొదులుకోలేడు మనిషి. అంటే ఆ కీర్తిని మాపు కోలేడు. దాత అనే కీర్తిని పొందిన మనిషికి యాచకుణ్ణి పొమ్మనే ధైర్యం వుండదు. మననీ, మన నియమాల్నీ ప్రపంచమంతా చూస్తున్నారనీ, గౌరవిస్తున్నారనీ, అనుకుని ఆ పీఠంనించి యెక్కడ చ్యుతి కలుగుతుందోనని భయపడి 'నియమం, నియమం చాలా వున్నతమైనది. దాన్ని తప్పకూడ'దని సమర్థించుకుంటారు. అట్లానే చాలమంది నియమాలు వారి అవసరం కొద్దీ, నమ్మకాలకొద్దీ వారు ఏర్పరచుకున్న విగాక ప్రజలు వారిపైన విధించినవి ఐ వుంటాయి.

నిజమాలోచిస్తే మనని గురించి చాలా కొద్దిమంది - అది కూడా యే నిమషానో తలుచుకుంటారు. మనని ఎక్కువగా తలుచు కొనేవారు మనని ద్వేషించేవారై వుంటారు. కాని మన మనసుకి ప్రపంచమంతా మన కార్యాలూ ఆలోచనలూ ప్రతి నిమిషమూ కని పెడుతున్నట్లే వుంటుంది. ప్రజలు అధర్మాలూ, అవినీతులు, అనేవి చాలా వాళ్లకి ఏ పనులు చెయ్యడానికి ధైర్యం లేదో అవి ఐ వుంటాయి. వాటిని సమర్థించుకోడానికి శాస్త్రాలని సాక్ష్యం తెచ్చుకుంటారు. తమకి ఇష్టమైనవి శాస్త్రాలు నిషేధించినా, చెయ్యడం మానరు. తమకి చెయ్యడానికి ధైర్యం లేనివీ, ఇష్టం లేనివీ, మానీ, ఆ నెపం శాస్త్రాలమీదో పెద్దలమీదో తోస్తారు. కొంచెం సాధన కలవాళ్లు ప్రపంచమేమన్నా సరే తాము తప్పనుకున్నవి వొదిలే ధైర్యం కలిగి వుంటారు. కాని తాము మంచివనుకున్నవీ నియమాలనుకున్నవీ కూడ అతిక్రమించే సాహసం disinterestedness చాలా కొద్ది

ముందికే వుంటుంది. ప్రేమకోసం అవసరమైతే దొంగతనం, హత్య నీచమైన పనులు చేయడానికి సంసిద్ధులు కావాలి. అంత ధీరత్వం రావాలి.

అట్లా పీనుగపోతోంది. పీనుగనిచూస్తే భయం. భయం పోక పోవడం సిగ్గుపడాలి. నేనుఅట్లా అయిపోయ్యేకోణాజ్ఞాపకంవొస్తుంది. చస్తేనేం ? అసలు అట్లా నిర్జీవంగా అయిపోవడం అసహ్యం. శరీరం యెట్లాగో మాయంకావాలి. అట్లా కట్టె కాకూడదు. ఎన్నో ప్రేమా లింగనాల్ని పొందిన దేహం, రామ్మూర్తి అన్నట్టు ప్రతిఅంగుళమూ స్త్రీచుంబనాలతో పవిత్రమైన దేహం - మృత్యువంటే భయం ఎంత తర్కించుకున్నా పోదు. అది చిన్నతనపు అనుభవాలతో శాశ్వతంగా అతుక్కుంది మనమీద. జీవితంమీద ఈ లోకం లోని సుఖాలమీదవున్న అభిలాషచేత మృత్యువంటే తిరగ బడతాను.

చచ్చిపోతే మాయమౌతాము. అసలు లేకుండాపోతాము. అంటే కలలులేని నిద్ర. ఇంకేంభయం ?

తలుచుకుంటే గమ్మత్తుగా వుంటుంది. ఒక్క పూపుతో, యీ డబ్బుకోసం దిగులు, school results మీది ధ్యాస, ఈదేహాన్ని చక్కగా వుంచుకోవాలనే మమత, పిల్లలందరూ ఎట్లా అభివృద్ధి పొందుతున్నారో అనే యోచన, కథలు, పత్రికలు, సంస్కారం స్త్రీ స్వేచ్ఛ, రాత్రిభోజనం-అన్నీ అన్నీ-యివేమీ వుండవు. నిద్ర, చీకటి-యింకేం లేదు.

మళ్ళీ పుడతామా ? ఆ పుట్టడం తలుచుకుంటే కోపం. ఎవ రికో పిల్లై పుట్టడం, వాళ్ళు పెంచడం, మళ్ళీ నడవడం, నవ్వడం చద వడం నేర్చుకోడం-ఎంత waste, ఎంత stupid! మళ్ళీ అటీచర్లూ, అన్నలూ, కొట్టడం! వీల్లేదు. మళ్ళీ పుట్టడం వొద్దుకోను. ఈ లోకమే, అనుభవాలే, మనిషిని, క్రమంగా సంస్కరించి, యీ కర్మ ఫలాలవల్ల, బాధపెట్టి పాపకార్యాలనించి మళ్ళించడమే, యీ జన్మల

ఆ దృశ్యమైతే—మళ్ళీ చిన్నతనం, చదువు, పెళ్లి—ఒకటే అనుభవాలు తిరిగి, తిరిగి జరగడం—ఎంత stupid waste!

పుటకకీ పుటకకీ మధ్య స్వర్గనరకాలున్నాయా.? జీవితం అంటేనే చాలమందికి పాపం పెంచుకోడం. నరకానికి ఇంకా ఎక్కువగా యోగ్యులు కావడం. ఇంకా పాపంచేసి నరకభారం పెంచుకోడంకంటే తొందరగా చస్తే అంత నయం.

ఇట్లా Argue చేస్తారనే, ఆత్మహత్య అంటే అంత బెదురు పెట్టారు. ఆత్మహత్య ఎందుకు తప్పు? అని నిలవేసి అడుగుతే 'దేవుడి ఉద్దేశ్యానికి విరుద్ధమని, వాళ్లకి దేవుడు తన ఉద్దేశ్యాలని తెలియచేసి నట్టు మాట్లాడతారు. ఒకాయన యేమన్నాడంటే To die voluntarily is to accept defeat at life's hands అన్నాడు. కాని మన బతుకే అపజయం. చావేనన్నమాటేమిటి?

నిజంగా తలుచుకుంటే యీ బతుకు ఎంత దుర్భరం? యీ తిండి, పొట్టలోకి పదార్థాలు తొయ్యడం; దొడ్డికిపోవడం, దేహం లోంచి వొచ్చే మురికిని కడగడం! ఇతరుల్ని మోసంచెయ్యకండా, Competetion లేకండా బతకలేకపోవడం, భయాలు, ద్వేషాలు ఇవి యెంత ప్రయత్నించినా వొదలకపోవడం, సెక్సు, పిల్లలు, యేడుపులు, నిస్సహాయంగా ఆధారపడేవారు...ఒక్క బాధని, రోగాన్ని తీసి వెయ్యలేని నిరాధారం, మృత్యువు—ఛీ యింత దుర్భరం—

ఏ విధానచూసినా, చావును చూసి భయపడవలసిన కారణం కనపడదు. కాని కారణం కనపడకండానే మన reason కి శక్తి తిరగబడి మనను పనిచేస్తుంది. ఇంద్రియాల్ని నిగ్రహించగలిగినవాడికి కూడా మనసుని పాలించడం చాతకాదు. ఈ మనసుని లోబరుచుకునేందుకే యోగమూ, జపం, తపస్సు యిన్ని ఏర్పరిచారు గావును!

సాయంత్రం. Express train కి వేళ అవుతోంది. ఇక్కణ్ణించి తప్పించుకుని బైటపడాలి. ఎందుకో రైళ్లని చూస్తే సంతోషం? రైల్లో మనుషులు సంతోషంగా వుంటారనా? కాక నిలవ ఉన్న నీరుమల్లే గాక కదలుతో వుంటారనా? రైలులో మనుషులు—ఎక్కడికో—దూరంగా—కలలుకన్న ప్రదేశాలకి—యీ రూమాలు కాకా

పరిణం నించి ఎక్కడికో యింకో అందమైన లోకాలకి పడుతున్నట్టు కనపడతారా! కైళ్ళవల్లనే అత్యంతప్రియులైన మిత్రులు నా దగ్గరికి వొస్తోవుంటారనా?

ఒకొక్కరినే పలకరించి ఆ సెల్లో మనుషుల్ని ఏం పనిమీద యెక్కడికి పడుతున్నారో కనుక్కోవాలనిపిస్తుంది. నేనే వూహించుకుంటాను వాళ్ళ మొహాన్ని చూసి. మొన్న పెద్ద స్వంత పెట్టిలో రాత్రి ఒక గొప్ప అయ్యర్ని చూశాను. ఎంత అదృష్టవంతుడో అనుకొంటామా! వొంటరిగా, దిగులుగా అన్ని యావలూ illusions పోయినవాడివలె కూచుని వున్నాడు ఓ కుర్చీలో. వాళ్ళ బాధలు వాళ్ళవి. వాళ్ళకీ నిరాశలూ, disappointments వుంటాయి. మీద తనంలో వుండే struggleం లేనిది జీవితానికి చురుకు లేదేమో! మళ్ళీ దరిదాపులేని దారిద్ర్యం మొద్దుబారిస్తుంది మనిషిని. సోషలిజమ్ వొచ్చి అందరి భౌతిక వాంఛలూ తృప్తిపొందితే ఇప్పటి చురుకు పోతుందేమో ఒకవేళ!

ధనవంతులు, సుఖంలో జీవించేవారు అదృష్టవంతులనుకుంటామా! కాదు. ఏ నిమిషాని కానిమిషం తీసుకొచ్చే సుఖబాధల quality మీద ఆధారపడివుంటుంది మన జీవితపు విలువ. అన్నంలేక మాడినవాడి నోట్లో పెట్టుకున్న అంబలిముద్ద, ఆకలిలేని ధనికుడు తినే పరమాన్నంకన్న pleasing quality లో ఎక్కువ విలువ కలది. అట్లానే గొప్ప ఉద్యోగస్థుడు రోజల్లా వుద్యోగపు సమస్యలతో చిరాకుపడుతూ వుంటే, నెమ్మదిగా బస్తాలుమోసే కూలీకంటె సుఖంలేని హీన స్థితిలో వున్నాడన్నమాటే! ఎండలో నుంచుని కిటికీలోంచి అధికారిని చూసి కూలివాడు ఆ పంకాలూ, బల్లలూ, అద్దాలూచూసి అనవసరంగా యీర్ష్య పడతాడు.

ర—కి చాలా జబ్బుచేసింది. ఓసారి హాస్పిటల్లో పడుకో పెట్టాల్సివొచ్చింది. దూరంగానే వేరే గది యిచ్చారు. డాక్టరు ర— బతకడన్నాడు. రాత్రింబవళ్ళు అన్ని గంటలూ ఆ గదిలో మేమిద్దరం యెదురుగా అంతసేపూ అతని జీవన మృత్యువుల్ని గురించి ఆలోచిస్తో హృదయక్షోభతో నేను—అతను లేకపోయినరోజు

నా వంటరితనం...ఏమౌతాడు? ఆ మెత్తని వేళ్లూ ధిక్కరించే చూపులూ, కవిత్వం, జీవితంమీద ఆశలూ, కలలూ అన్నీ......... ఏమైపోతాడు? అంతా శూన్యమా ఇంత వికృతమా జీవితం? చదువుకుందామంటే కళ్లు కలిగాయి. నా ఆదుర్దా. భరించరానివేదన.

దీర్ఘమయ్యే నీడలూ, మెల్లిగా దిగులుగా death knells లాగు కొట్టే తాలుకా ఆఫీసు గంటలూ, మందు తాగించడానికొచ్చే కాంపౌండరూ—ఇంతే నా ప్రపంచం. యెవరన్నా వొక్కమనిషి నాతో వుంటే నాకో నిమిషం ఆకాశాన్ని చెట్లని మానేందుకు వ్యవధినిస్తే!

అప్పుడు తట్టింది యీ ప్రపంచంలో నా యేకాకితనం! నాకు యెవర్నైనా బంధువుల్ని, స్నేహితుల్ని సహాయం అడగడమే కొత్త అయిపోయింది. అడిగినా నాకు ఆశలేదు. పెళ్లిళ్ళకి, చావులకి, పేరంటాలకి, చిలిపి పోట్లాటలకి సంఘంతో కులంతో కలియాలి, సంబంధాలు పెట్టుకోవాలి. లేకపోతే సహాయానికి రారు. వాటిని వొదులుకున్నవాడు ప్రపంచాన్ని ఎంత ప్రేమించినా ప్రపంచం కనికరం చూపదు. ఇంకా చిన్నపిల్లల స్థితిలోవున్నారు మనుష్యులు. పిల్లలు తమకి అన్నం పెట్టేవారికన్న మిఠాయి కొనిపెట్టి తమతో ఆడుకునేవారిమీద యెక్కువ ప్రేమ చూపుతారు. పాఠాలు చెప్పే వారిమీదకన్న కథలు చెప్పేవారిమీద. అట్లానే, సంఘాన్ని వొదిలి నిలిస్తే, సంఘమూ నిన్ను వొదిలి నిలుస్తుంది. వాళ్ళ తప్పా!

ఇక స్కూలులో రెండుమూడేళ్ళు కలిసి పనిచేస్తామా? మొదట నా కీర్తి ముందుగానే విని తప్పుకుంటారు. తరవాత భయాలుపోయి దగ్గిరగా జరుగుతారు. నేనూ ప్రయత్నిస్తాను. కాని ఏం లాభం? ప్రతివిషయంలో ప్రతి అంగుళం అభిప్రాయభేదమే. ఆచరణలో విరోధమే; అభిప్రాయభేదాల్ని సహిస్తారు. ఆచరణని వొప్పుకోలేరు. తెలుసుకున్నకొద్దీ ఘోరాలు బయలుపడి మెల్లిగా దూరంగా పోతారు. చివరికి మేము ప్రచారంచేసే విద్య విషయంలో కూడా పెద్ద అగాధం వాళ్ళ అభిప్రాయాలకీ, నా వాటికీ!

మాకో బ్రాహ్మణేతర హెడ్మాస్టరుండేవాడు. ఆయన బ్రాహ్మల్నీ వాళ్ళ ఆచారాన్నీ వొకటే వాళ్ళ మొహానే వెక్కిరించేవాడు. తాబేదార్లు ఎట్లా ఎదురు చెపుతారు? బాగా రేడిపించేవాడు. వాటిని వొదలమని బోధించేవాడు. నే నెప్పుడూ వాళ్ళ నేమీ అనకపోయినా...... నా స్వంత అనాచారాల్ని చూస్తే వాళ్ళకి ఆయన వెక్కిరింపులకన్న కోపం. నా శాంతమయిన తిరగబాటు వాళ్ళకి కోపాల్ని కలిగించేది. వెక్కిరించటంలో ఆయన వాళ్ళ plane లోనే వాళ్ళతో బాంధవ్యం కలుపుకున్నాడు. కనక మిత్రుడే. వాళ్ళమోస్తరు అల్పత్వం, అసహనం కలవాడు కనకనే వాళ్ళ ఆచారాల్ని ద్వేషించాడు.

మతాన్నీ, కులాన్నీ వొదిలినా ఇవన్నీ ఉత్త బాహ్యవిషయాలనిపిస్తుంది. ఈ మతకుల కలాపం. వాటిని వొదిలిపెట్టడం వొక మహాత్కార్యం కాదు. కాని వొదిలిపెట్టలేకపోవడం అల్పత్వం, భీరుత్వం, అంధత్వం. వీటి అన్నిటికన్నా గొప్పది అసలు మనిషి character. వితంతువివాహం చేసేవాళ్ళకి స్త్రీమీద యెక్కువ అభిమానం అనుకుంటాము — వాళ్ళకంటే చాలామంది పూర్వాచారపరులకే స్త్రీల మీద యెక్కువ గౌరవం వుండడం చూశాను. రోజూ భార్యల్ని కొట్టేవాళ్లని చూసి మండిపడ్డాను. కాని సమయం వొచ్చేసరికి వాళ్లలో చాలామంది ఆ భార్యలకోసమే అద్భుతమైన త్యాగాలు చేస్తారు. కులభేదాలు సర్వమానవసౌభ్రాతృత్వానికి అడ్డనుకుంటాము! యిరుగు పొరుగువారి ప్రేమనుబట్టి చూస్తే యీ కులభేదం పాటించే వాళ్లకే చాలామందికి నిజమైన ప్రేమవుంది. ఈ కుల మత భేదాలన్నీ తాత్కాలిక ఆచారాలు మన బట్టా బొట్టూవలె. అందువల్లనే కార్యాల్నిబట్టి మనుష్యుల్ని judge చేయకూడదని ఎంత మొర పెట్టినా, ఎన్ని కథలువ్రాసినా, లాభం వుండదు. కార్యాలవల్లనే గాని, అంతకన్న deep గా ఆలోచించే సాహసంగాని, జ్ఞానంగాని వ్యవధిగాని చాలామందికి లేనట్టుంది.

గాంధిగారి కొడుకు మహమ్మదీయుడు అయినాడా! తాగుడికి జుల్మానాపడ్డాడా? అతని రక్తం, అతని tendencies, instincts

చిన్నప్పటి శిక్షణా, heridity అన్నీ లోకమంతా పూజించే గాంధీగారిదీ, ఆయన భార్యదీ. మరి యిట్లా ఎందుకైనాడు? ఏదో ఆత్మా కర్మా యిట్లాంటి Nonsense కట్టిపెట్టి scientific గా ఆలోచిస్తే ఏం జబాబు చెప్పతాం? మహాత్ములు కావడానికీ, దురాత్ములు కావడానికీ అవసరమైన stuff లో, Calibre లో దీంటో తేడా లేదు. ఒక చిన్న Discipline, ఒక inhibition, ఒక్క గుణంలో ఇటూ, అటూ, వ్యత్యాసం యీ చివరినించి ఆ చివరికి తీసికెడుతుంది. గాంధీగారినీ కొడుకునీ దగ్గరగా study చేస్తే యిద్దరికీ చిన్న చిన్న mannerisms నించి గొప్ప emotions దాకా, చాలా పోలికలు వుండకతప్పదు. కాని యీ ఒక్క చిన్న మనోభేదమే ప్రపంచం యెదుట యింత వ్యత్యాసాన్ని ప్రదర్శించింది. ఇట్లా వాదిస్తే ఈ ప్రకారం యోచించమంటే ప్రజలు ఒప్పుకోరు. యెందుకంటే వాళ్ల virtuous pride గాయపడుతుంది. వాళ్ల basic moral values నేల కూలతాయి. అందుకనే psycho-analysis ని అట్లా తిడతారు. కాని యెవరెంత యేడిస్తేనేం? ఏ యిద్దరి తలితండ్రుల అన్నదమ్ముల చరిత్రలు తీసిచూసినా ఈ సూత్రం వ్యక్తమవుతుంది. గాంధీగారిదీ, కొడుకుదీ, జీవితంలోని motives ప్రకారం, emotions ప్రకారం జాగ్రత్తగా పరిశీలించి జీవితాల్ని study చేస్తే, ఈ తాగుడిమీది ప్రేమా, దేశంమీది ప్రేమా, ఒకటే source నించి వొచ్చి వుండవొచ్చు. పైగా సారీన్ అంటోంది కదా 'ఈ గాంధిగారు కొడుకుని తిడతారు. తననే అతనిలో చూసుకోలేక; అతను తన వికృతమైన ప్రతిబింబమేనని అంగీకరించక' అంటోంది. మరీ చెడ్డపేరు తెచ్చుకున్న పిల్లల్ని చూస్తే మర్యాదగల తల్లితండ్రులకి యెందుకంత కోపమంటే తమ అసలు గుణాలు ఎవరికీ తెలీకండా తమకే తెలీకండా తమలో దాచుకున్న గుణాలు తమ పిల్లలముందే ఆ పిల్లలమూలంగానే లోకంలో బయట పడ్డాయే అనే కోపంవల్ల.

ఇంత చిన్నవాడికి ఇంత ప్రేమగలవాడికి ర—కి యింత బాధ ఏమిటి? ఎంత కాఠిన్యం వుండాలి దేవుడి హృదయంలో!

సృష్టి దయాదలిచి అతనిమీద మగతను కప్పింది. తన ప్రాణానికి వొచ్చిన అపాయంగాని బాధనుగాని యెరక్క పడివున్నాడు. స్వేచ్ఛగా, తిరుగుతో, ఆడుతో, నేర్చుకొంటూ వుండవలసిన వయసులో, ఇన్నేళ్లు అట్లా బాధపడడం ఎందుకు? ఆ అర్భకు ఏమి లాభం? ఏదో పూర్వపుకర్మ కని తీర్చుకోడమా? కర్మకి కని లేదా! గుడ్డిదా! దేవుడు గుడ్డివాడేనా? ఈ కర్మలకి యీ శిక్షలు అని నిర్ణయంచేసి దేవుడు నిద్రపోయినాడా? చచ్చిపోయినాడా? ఏమిటి యీ వేదనకి అర్థం? ఒక్క మతమూ సరైన జవాబు చెప్పదు ఏదో అర్థంకాని ముసిలి వాగుడుతప్ప. గొప్ప శ్లోకాలూ, సూత్రాలూ వొప్పుచెప్పడం, ఏమీ తెలియని ఆ దేవుడనే దాని మీద యీ భారమంతా పెట్టడం. ఇన్ని శాస్త్రాలు, పురాణాలు తగలేసినన్ని వున్నాయి లోకమంతా నిండి, పుచ్చి పురుగులుపట్టి. అవిచదివేవారు, వ్యాఖ్యానాలు తీసేవారూ, వాటిమీదపైన తగాలాడేవారూ, గుళ్ళూ, గోపురాలూ, మఠాలూ—యీ చిన్న ప్రశ్నకు జవాబు చెప్పలేరు. ఎందుకు ఆ ప్రగల్భాలూ, ఆ పెద్దకేకలూ, ఆ దుస్తులూ, ఆ బోడిగుళ్ళూ! ఏం తెలీదనీ, తెలిడానికి వీలులేదనీ వొప్పుకోరాదూ?

వేదాంతులు సులభంగా "ఇట్లాంటి దురదృష్టం నీకే వొక్కడికేనా? లోకంలో అందరికీ సామాన్యమేకదా?" అంటారు; అదేదో వోదార్పులాగు! గొప్ప మతకర్తలు యీ విధంగా పూర్వకాలంలో చనిపిల్ని వోదార్చిన కథలు చెపుతారు. బుద్ధుడూ తులసీదాసూ మొదలైనవారి జీవితాలనించి. ఆ సలహా యిచ్చినవారా, ఆ సలహాలతో తృప్తిపడ్డవారా ఎవరు యెక్కువ బుద్ధిహీనులు అనుకుంటాను. ఆ శాస్త్ర యుక్తితో ఉపశమించిన దుఃఖం, యితరులుకూడా మనతో యేడుస్తున్నారు కదా అని సంతుష్టిపడే విచారం యెంత అల్పమో, నీచమో, స్వార్థమో! లేక ఆ మాటలు నాకే ఆ మహాత్ముల ఆత్మౌన్నత్యం తెలుసుకోలేకపోతున్నానా [illegible]! కాని యీ కాలంలోకూడా [illegible] ఇట్లాంటి వోదార్పులు ఇస్తూనేవున్నారుగా!

? మత గ్రంథాల్లో కనబడితే చాలు ఏదన్నా సంగతి! దాన్ని గురించి మంచిచెడ్డలు విచారించేశక్తి ప్రజలకి పూర్తిగా నశిస్తుంది. ఇదంతా అసత్యమేననీ ఎవరన్నా ప్రశ్నిస్తే వాళ్లు దుర్మార్గులనీ. అప్పుడు యిట్లాంటి బాధలు సర్వసామాన్యమే. నాకేకాక యిట్లాంటి బాధ అందరికీ వుండే అని విచారంవల్ల నా విచారం ఎక్కువ కావాలి గాని, తృప్తిపడాలా? ఇతరులుకూడా ఇట్లాంటి బాధలతో ఇంత కన్నా తీవ్రమైన వ్యధలతో, నశిస్తున్నారని గంతువేసి సంతోషించాలా నా కెన్నడూ యిట్లాంటి బాధ కలగకపోయినా, యితరులకు కలిగినప్పుడు నాకు సృష్టిమీద ఆగ్రహం కలగకపోతే వాళ్ల దురదృష్టానికి నా దిగులు ఎక్కువకాకపోతే......యెందుకు మనిషినై పుట్టి? పురాణనీతులూ, ఆదర్శాలూ యిట్లానే వుంటాయి. ఇతరులకికూడా ఆపదలు తప్పవుకదా అని ఓదార్పుపొందే బదులు, మనకీ, వాళ్లకీ, ఎవరికీ, బాధలులేకుండా, వుండే మార్గాలు చాతనైనంతవరకు ప్రయత్నిద్దాము అనుకోవాలి.

ఈ ఋషులూ, బైరాగులూ, వేదాంతు లంత అప్రయోజకులూ, మూర్ఖులూ లేరు. ఈ మతపాంసకులవల్లనే యీ లోకమింత మోసంలో పడ్డది. ఎట్లా యీలోకంలోకి వొచ్చామో తెలీదు. ఈ బాధలెందుకో అర్థంకాదు. "ఎట్లాగో వొచ్చాం, బాధలు వొస్తే అనుభవిద్దాము నోరుమూసుకుని. చాతనైనంతవరకు ఒకరికొకరం సహాయం చేసుకుందాం. వీలైనంతవరకు విచారాలు తగ్గించుకుందాం. కారణాలు నిర్మూలిద్దాం." అంటే యెంత బావుంటుంది? దానికి బదులు పెదిములు చప్పరించి, మంత్రాలు వుచ్చరించి, గుడ్లుతేలేసి, 'ఈశ్వరేచ్ఛ' 'కర్మ పరిపాకం' అనుభవించు. ఎవరికోసం! ఇదంతా నీ మంచికోసమే. ఏమో, ఏ వుద్దేశ్యంతో నిన్నిట్లా కాలుస్తున్నాడో యీశ్వరుడు?" అంటారు; తాము చూసి వొచ్చినట్లు. ఈశ్వరుడు స్వయంగా ఆ రహస్యాలను వాళ్ళతో చెప్పి, తక్కిన పామరులకు వెల్లడించ వొద్దన్నట్టు.

ఒక దేవుడుండి యీ పిల్లల్ని ప్రేమించమని మనకిచ్చి గాఢంగా మమకారం కలిగించినవాళ్ళే యిట్లా ఆపిల్లల్ని చంపుతున్నా

డమకో. ఈ చంపడాన్ని యీ క్రూరత్వాన్ని సమర్థించడానికి ఎన్ని తుక్కు కథలు, ఇతిహాసాలు! కొడుకు ప్రేమలో దేవుణ్ణి మరిచాడని, కొడుకుని తీసుకుపోతాట్ట ఆ దేవుడు? ఆ దేవుణ్ణి ఎందుకు జ్ఞాపకం వుంచుకోవాలో! ప్రీతి ఎక్కువో, కొడుకెక్కువో పరీక్షించడానికి కొడుకుని చంపుకున్నారు ముగ్గురు మహాభక్తులు. ఇట్లాంటి దొంగ కథలు అబద్ధపు ఆదర్శాలు బోధించి తికమకలు పెట్టారు ప్రజల మనసుల్ని! కొడుకుల్ని ప్రేమించడం, భార్యలతో సుఖంగా కాపరం చెయ్యడం, నవ్వడం, ఆనందించడం అన్నీ పాప కార్యాలు; బూడిదలూ, మురికీ, రుద్రాక్షలూ, ఏడుపులూ, చాత్రు మోహాలూ, ద్వేషాలూ, నీతి పేరిట క్రూరత్వాలూ, మతం పేరిట కలహాలూ, సుఖాలు నోములుకోడాలు, ఉపవాసాలూ, సన్యాసాలూ— ఇవీ పుణ్యకార్యాలు. ప్రతిదాంటో వేదాంతాన్ని వైరాగ్యాన్ని కలిపి బతుకునే అసహ్యం చేసిపెట్టారు. దేశ వీర్యాన్ని పీల్చి పిప్పిచేసి, ప్రజల్ని శుద్ధ అప్రయోజకుల్నిగా చేసిపెట్టారు.

ఈ బాధల్ని సృజించిన దేవుడు ఎంత ప్రార్థించనీ, యాడవనీ కనికరంలేని రాయి, మొద్దు. మళ్ళీ పూర్వకాలం మంత్రాలకి, మందులకీ, యజ్ఞాలకీ, పూజలకీ కట్టుపడేవాట్ట. దర్శనాలిచ్చేవాట్ట. ఇప్పటికీ కలల్లో, కాలవల్లో దర్శనాలు యిస్తున్నాడుగాని మూర్ఖుల్ని మోసగాళ్ళనీ ఎక్కువగా ప్రేమిస్తున్నట్టు తోస్తుంది. "ఆ దేవుడు నీ ప్రార్థనలని ఎందుకు వినాలి?" అంటారు. వినకపోతే ఎందుకు అక్కడ వుండి? వూరికే బాధలు కల్పించడానికేనా?

నువ్వే కల్పించుకున్నావు యీ బాధ అంటారు. నాకు తెలీదు ఎట్లానో. పోనీ అన్నీ నేనే కల్పించుకున్నాను. ఇంక ఆ దేవుడు చేసే పనేమిటి? పైగా యీ పూజలూ, వ్రతాలు, స్తోత్రాలూ ఎందుకు? పోయిన జన్మలో చేసిన పాపానికి శిక్ష? ఏం పాపం? చెప్పకుండానే శిక్ష! Trial లేకండా శిక్షిస్తే అన్యాయమంటారే, దీనికెవరూ నోరెత్తరు.

♦ ♦ ♦

సుశ్రావ్య నాగస్వరం వాయిస్తున్నారు. పడమట చంద్రుడు క్రుంగుతున్నాడు. చల్లని గాలి నా మొహానికొచ్చి కావలించు కొంటోంది. ఇట్లాంటప్పుడు ఏమనిపిస్తుందంటే, 'దయగల దేవుడున్నాడు. తను నా బాధని పోగొట్టలేక, ఏమీ సహాయం చెయ్యడం చేతగాక, నాతో కూడా బాధపడి, 'ఎంత నలిగిపోయినావో!' అని నన్ను ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నట్టు' వుంటుంది. వున్నాడా?

ఎందుకీ మనుష్యులు నాకు. మృగాలవలె సుఖదుఃఖాలన్నీ కళ్ళుమూసుకుని తిరగబడకుండా అనుభవించడం చాతనైతే భాగ్యం మనకు. ఈ పాత జ్ఞాపకాలూ, ముందు భయాలూ, సందేహాలూ, ఇన్ని Evils కల్పించాయి మనుష్యులకి. ఇవి చాలక యింకా నా [illegible]పాలు!

ప్రజామిత్రలో నా 'పాపం' విమర్శిస్తో ఒక వాఙ్మయ పీఠాధిపతి ఆ కథలు వివాహమనే సంస్థను నిర్మూలం చెయ్యాలనే వుద్దేశ్యంతో వ్రాశానన్నారు. ఆ విమర్శ చదివి మళ్లీ ఆ పుస్తకం తిరగ వేసి చూశాను. నా కంటికి ఎక్కడా అట్లాంటి ప్రయత్నం కనపళ్ళేదు. ఆ కథల్లోని వాస్తవత్వాన్ని అంగీకరించే ధైర్యంలేక, ఆ నేరారోపణంకింద తప్పుకుంటున్నారా, లేక నిజంగా నాకు తెలీకుండానే అట్లాంటిప్రయత్నం నేను చేస్తున్నానా అని ఆలోచించి మిత్రుల్ని చూడమన్నాను. వాళ్లూ అట్లాంటిదేమీ లేదన్నారు. ఆ పీఠాధిపతి ఒక్కసారి ఆత్మపరీక్ష చేసుకుంటే బావుంటుందనుకుంటాను.

ఈ లోపల నేను ఆత్మపరీక్ష చేసుకుంటున్నాను. నిజంగా నా వుద్దేశ్యం, ఆ పుస్తకంలో కాకపోయినా తక్కిన కథల్లో నేమిటని?

వివాహం విచ్ఛేదం అవుతుందంటే, స్త్రీపురుషులు స్వేచ్ఛగా ప్రేమించుకుంటారంటే, నేనందుకోసమే ప్రయత్నిస్తున్నానంటే, నాకేమీ భయపడవలసిందిగాని, సిగ్గుపడవలసిందిగాని కనిపించదు. నాకీ scandals చూస్తే భయంలేదు. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే నిజంగా నా ప్రయత్నం అదేనా అని.

ఈనాడు స్త్రీ స్వేచ్ఛ పొందడానికి వున్న ఆటంకాలన్నీ తీసివేసినా, సంసారాలు వొదులుకుని వెళ్ళేవాళ్లు యెక్కువమంది వుండరు. క్రమంగా స్వేచ్ఛకి అలవాటుపడి కొందరు కాలం గడిచిన కొద్దీ బైటపడవొచ్చు. స్నేహం, పిల్లలు, అలవాట్లు, సుఖాలు, ఒకరి కొకరు అలవాటు కావడం, సుఖదుఃఖాలు పంచుకోవడం, యివన్నీ కాపురాల్లో మనుష్యుల్ని ఆకర్షించి స్వేచ్ఛగా బంధించి వుంచుతాయి.

వివాహమనేది వుణ్నా లేకపోయినా, సంబంధాలు అస్తమించవుకదా? స్త్రీ పురుషులు వుత్త మోహంచేతనేగాక, పెళ్లికానీ, కాకపోనీ కొంతకాలంకలిసి జీవితం గడపడంచాల స్థిరంగా అతుక్కుపోతారనే సంగతి మానవ స్వభావంలోనేవుంది. అది యెవరూ మార్చలేరు.

ఎదురు తిరిగి నేను "అవునయ్యా, వ్యభిచారాన్నే బోధిస్తున్నాను. వివాహంలో జీవించడం నీచం, రోత. ఒక్క జొన్నన్నం మాత్రమే, గడ్డిని మాత్రమే మేసే మోట బతుకు అది. అనేక ఆనందాలు వున్నాయి మీ ముందు. అనుభవించండి, నిర్భాగ్యులారా!" అంటే జవాబేలేదు; దేవుడూ, అతని ఆజ్ఞలూ, శాస్త్రాలూ, ఆదర్శాలూ తప్పు! నేను వాటిని అధికారాలుగా అంగీకరించనంటే నా అంతరాత్మే 'నామనస్సే నాకు ప్రధానమంటే - మీకో తెలివి మనసు లేవుగనక - మీరు శాస్త్రాలనీ' పెద్దల్నీ వెతుక్కుంటున్నారంటే! కాని ప్రస్తుతం నా ప్రశ్న నేను వ్యభిచారాన్నే బోధించావా అని!

ఎన్ని వ్యాసాలు ఎవరు యెంత ఆకర్షవంతంగా వ్రాయనీ, ఏ డిక్టేటరో వివాహమనేది వుండకూడదని శాసించనీ, ప్రజలు జతకావడం మానరు. భర్తలనించి లేచిపొయ్యేవాళ్ళుకూడా, ఏ మూలనో కొంచెం విశ్వాసం కలవాళ్ళతో యెవరితోనో స్థిరపడతారు. నేను వాంఛించే మార్పు యీ వివాహంలోవున్న అక్రమాలు అన్యాయాలు పోవాలని. ఈ దుర్మార్గాలు వొదిలించినంతమాత్రాన అసలు చచ్చేటంత దుర్బలంకాదు వివాహం. అంతేకాకండా వివాహం వొద్దన్నవాళ్ళకి బలవంతంగా కట్టకూడదనీ, వివాహం అయినంతమాత్రాన సర్వమూ నీతిగా తలచడమూ, కానంతమాత్రాన అవినీతి అనడమూ మూర్ఖమనీ నా వాదన! ఇట్లాంటివి బోధిస్తే యీ ప్రజలకి కోపమెందుకంటే—వాళ్ళ హృదయాలు విప్పి చూపగల యంత్రమో మంత్రమో వుంటే అర్థమవుతుంది—పురుషులకి స్త్రీమీద తమకి చలామణీ అవుతున్న హక్కులు పోతాయి అనీ, స్త్రీకి పురుషులు పెడుతోవుంటే సుఖంగా బద్ధకంగా బతికే భాగ్యం వొదులుకోవలసి వస్తుందనీ భయం.

అందరికీ మరీకోపం యీ నా దుష్టప్రచారానికీ, కళా, ఆకర్షణా తోడ్పడి, వాళ్ళు మింగకూడదనుకున్న మాత్రల్ని, చక్కగా షుగరు పూసి ఇచ్చి రక్తంలో కలిసేట్టు చేస్తున్నాయని.

వర్ణనలు పచ్చిగా వున్నాయనీ, ఆకర్షంగా వున్నాయనీ, ఒక నింద. "అవును. ఆ శృంగార వర్ణనలతోనే ఆకర్షించాలి మీ tastes ని. నేను వ్యాసాలు seriousగా వ్రాస్తే, చదివేవాళ్ళా? నా అభిప్రాయాలని తర్కించనన్నా తర్కించేవారా? నా వర్ణనలు మీ రుచులకి యెర. తిట్టుకుంటో వాటికోసం వొచ్చి, నా అభిప్రాయపు బోనులో చిక్కుకోవాలనే నా వుద్దేశ్యం" అని చెప్పంటే యెట్లా వుంటుంది?

ఇదంతా vested interests చేసే మామూలు propaganda. నేను బోధించే స్వాతంత్ర్యం తనకి కావాలనే వుంటుంది పురుషుడికీ, స్త్రీకీ. తన స్త్రీలకీ తక్కిన పురుషులకీకూడా యీ స్వాతంత్ర్యం వస్తుందేమోనని ఎవడికి వాడికి బెంగ. కారణం లోకం పాడవుతుంది అని చెప్పుకుని సమర్థించుకుంటారు. వాళ్ళ మనస్సుల్లో తరతరాలనించి నాటివున్న నీతిఅభిప్రాయాలు మార్పుని అంగీకరించవు. ప్రేమలో యీ బలవంతమూ మామూలూ ఆనే రెండూపోతే యెన్ని నూతన సుందర లోకద్వారాలు వాళ్ళ కళ్ళయెదుట తెరుచుకుంటాయో కలలోనన్నా తెలుసుకోలేరు వాళ్ళిప్పుడున్న స్థితిలో, యీ ప్రజలు. వాళ్ళందరికీ యీ నిర్బంధ వివాహం అవసరం. నిర్బంధం లేకపోతే యీ మాత్రం స్త్రీ సౌఖ్యం దొరకదు వీళ్ళకి. వీళ్ళకి విజ్ఞానం యివ్వడం, వీళ్ల మనసుల్ని మార్చడం, మనుష్య ప్రయత్నానికి సాధ్యమయ్యే పనికాదు. ఎప్పుడో యెట్లాగో, యే జన్మలోనో, యే లోకంలోనో వారికి ఆత్మలనేవి వుంటే, mysterious గా, యీ పువ్వుల్ని వికసింపచేసే కాంతివలెనే క్రమంగా వాళ్ల కళ్ళని విప్పుతుంది యీ విశ్వప్రేమ. ఏ భయంకర ఘాతాలవల్లనో, యే ప్రేమ దృష్టివల్లనో, ఒక్కసారి నూతనలోకంలో ప్రవేశిస్తారు. అందాకా కావంటివారు, యే నాటికి అవసరమవుతుందో, ఏవ్యక్తి అభిలషించి వెతుక్కుంటుందోనని యీ విజ్ఞానాన్ని వెదచల్లి వుంచాలి. దీనివల్ల

తృప్తినీ, సుఖాన్ని, శాంతినీ పొందుతున్న మిత్రులున్నారని నాకు తెలుసు. నాకు మనుష్య హృదయంమీదవున్న విశ్వాసంవల్ల యిట్లా పొడగా, మేల్కొంటుందనే భగ్నంకాని ఆశతో వ్రాస్తోవుంటాను. ఈ అశాంతి, యీ వ్యభిచారం, కామోద్రేకం, యీ స్వల్పవాంఛలు, శాశ్వతమైనవి కావనీ, యింతకన్న జీవితాల్ని వున్నతంగా ఆకర్షించి తృప్తినిచ్చే మహాశక్తి ప్రీతివారికోరకూ జన్మహక్కు వేచివుందనీ, విశ్వసించబట్టే వీళ్లు కల్పించుకున్న కాపరాలూ, వివాహాలూ, చట్టాలూ, బంధాలూ అన్నీ మేఘాలవలె చెదిరిపోయి, ప్రేమభాస్కరోదయ మవుతుందని నాకు రూఢి కాబట్టే, నేను ఇంత కాలాన్ని శక్తినీ, మర్యాదనూ, సౌఖ్యాన్నీ, వినియోగించి persistantగా వ్రాయగలుగుతున్నాను. నిర్భాగ్యులైన పతిస్మృత స్త్రీలలో వారి దుశ్చరిత్ర్యంలో పానిసత్యంలోనే, దేవత్వాన్ని, అధికత్వాన్ని, చూసి పరిశోధించదలచిన నా faith in woman-hood ని వక్రంచేసి స్త్రీ పాతివ్రత్యాన్ని, శీలాన్ని, modestyని ధ్వంసం చెయ్యాలని చూస్తున్నానని పాగించే దుష్ప్రచారం అసాధారణంకాదు లోకచరిత్ర చూస్తే. నిజంగా శీలాలూ, ఆత్మనిర్మలత్వాలూ, ధర్మాలూ, పాడైపోతోవుంటే, భార్యలు, కూతుళ్లూ, తమ ఇష్టాలకి ఎదురుతిరిగి వేషాలూ, భావాలూ, ఆచారాలూ, నీతులూ, మారుతోవుంటే, ఏమీ అనలేరు కాబట్టని - వాళ్లు లేకుండా గడవదు. ఏమన్నా గట్టిగాఅంటే స్త్రీలు లేచిపోతున్నారు. అందుకని ఆ కోపాన్ని, ఉక్రోషాన్ని అసహాయత్వాన్ని, స్త్రీల స్వతంత్రతని సమర్థించే వ్యాసాలమీద చిమ్ముతారు.

విశాఖపట్నం వూరు యింత అందమయిందని ముందు నాకు యెవరూ చెప్పలేదు. ఈ కొండలూ, సముద్రతీరమూ, ఎన్ని నెలలకి కూడా వీటి అందం పాతపడటంలేదు నాకు. ప్రతిసారీ యేదో వొకమూల కొత్త అందాన్ని చూపి నన్నాకర్షిస్తున్నాయి. ఒక్కొక్క ప్రదేశంలో ఒక్కొక్క యెత్తునించి, కోణంనించి చూస్తే కొబ్బరిచెట్ల నీడలోంచి మధ్యాహ్నపు పచ్చనియెండ మెరుపులోంచిగాని, రాత్రి నిండువెన్నెల తెలుపు సునుపులోంచిగానీ, మెరిసే యిసికా, తెల్లని నురుగూ, వెనక నీలపు సముద్రమూ నిలిచి హృదయాన్ని ఆకర్షిస్తాయి.

'సోమర్ సెట్ మాఘమ్' సౌత్ సీ ద్వీపాల్ని వర్ణించినప్పుడు భావనలో పడ్డ బాధ యీనాడు నిజంగా నేను చూసి అనుభవించినట్టవుతుంది. ఇల్లు కట్టడమన్నా, లోకంలో ఒక ప్రత్యేక స్థలం నాదని 'సెటిల్' కావడమన్నా, అసహ్యమైన నాకు యీ 'బీచ్' మీద నివసిద్దామా అన్నంత వ్యామోహం కలుగుతోంది. ఈ సౌందర్యం నేనేనా, నావంటి కొద్దిమందేనా, ఇక్కడ సాయంత్రాలు పోగయ్యే జనమంతా అనుభవిస్తున్నారా? లేకపోతే యెందుకు వొస్తారు?

అలలు కొండరాళ్ళమీద తగిలి పైకి చిమ్మినప్పుడల్లా గుండె ఝల్లుమంటుందా అందరికీ! సుందరరాజన్ అనే స్నేహితుడు హిందూదేశంలో మనుష్యుల అందంగాని, సృష్టి అందంగాని, చూడాలంటే యీ కొనకో ఆ కొనకో ఉత్తరదక్షిణాలకు వెళ్ళిచూడాలని అన్నారు. మరి విశాఖపట్నం సంగతి! రాత్రులు యెర్రదీపం, పచ్చదీపం, సముద్రం మధ్యనించి మిణుకు మిణుకని ఆగి ఆగి వెలగడం, వెనక వంపులో నలుపైన కొండనీడ, దీపిస్తున్న దేవతాహస్తాలవలె తిరిగే 'లైట్ హౌస్' కాంతిధారలూ, యీ నెత్తిమీద బ్లూలైట్ వీటి అంద

ముంతో ఆ అందంనించి కలిగిన ఆనందమేనా లేక బావయ్యా న్నికాలంలో, బ్రహ్మానందం అల్లరిలో, చి- కళ్ళ చూపుల జ్ఞాపకాల్లో నేను పొందిన మాధుర్యం ప్రతిఫలించిన transferred emotionవి ఉంటుందా? బావయ్యాని నేను—

"ఇంత చిన్నతనంలోనే ఇంత సినిక్" అయినావే అంటే—

"ఇన్నేళ్లొచ్చినా యింకా యింత 'romantic fool' గానే ఉన్నావే" అన్నాడు.

ఎప్పుడు మాట్లాడినా, తర్కించినా, చివరికి ఆ basic judgement కి వొచ్చేవాళ్ళం.

బీచ్ మీద చాలాసేపు కూచుని యింటివేపు దిబ్బ యెక్కుతున్నాను. చీకట్లో దూరంగా పోయ్యే స్టీమర్ కొసన ఎత్తిన వొంటి దీపం కొత్తనక్షత్రం ఆనాడు తూర్పున జన్మించిందనే భ్రాంతి నిచ్చింది. పక్కన మేడలో దయామయులెవరో గ్రామఫోనులోంచి చక్కని హిందీపాట వినిపిస్తున్నారు. దాని తరవాత 'సునోసునో' పెడతారేమో అనే భయమే లేకపోతే యింకా ఉత్సాహంగావుండి ఉందును. తోవలో నాకన్న ముందు నడిచే ఒక కుటుంబంవారిని కలుసుకున్నాను. వాళ్ళు సముద్రందగ్గిరికి రావడంలో వుద్దేశ్యమేమా అని ఆశ్చర్యం.

నిన్న రాత్రి బ్రహ్మానందం పాడమన్నాడు వెన్నెట్లో సముద్రం వొద్దున. "ఇట్లాంటప్పుడు పాటరాదు" అన్నాను. సౌందర్యం నన్ను దిగులులో ముంచుతుంది. ముఖ్యంగా ముఖసౌందర్యంకన్న సృష్టి సౌందర్యం. అదేదో pathology అనుకుని నా కోసం నేను దిగులు పడ్డాను చాలారోజులు. తరవాత పశ్చిమవాఙ్మయంలో నాకు సోదరులు, నావలె దిగులు పడేవారిని కలుసుకున్న తరవాత ఆ దిగులో ఒక మంచి లక్షణమే నేమో అనిపించింది. బ్రహ్మానందం లాటి సాధారణ healthy youths సముద్రంవొద్దున వెన్నెట్లో పాడతారు, పాడమని అడుగుతారు. చాలామంది అదృష్టవంతుల్లో healthy animal instincts rouse చేస్తుంది గావును సముద్రపుఅందం. కాని నాకు బాధ కలుగచేస్తుంది. చాలా తృప్తిలో ప్రేమించే స్త్రీ

శాస్త్రాల్లోకూడా చెప్పలేని దిగులు కలుగుతుంది. "ఏమిటి? ఎందుకు? చేసేవరు? ఎంత నశ్వరం?" అని మూలుగుతుంది హృదయం.

సృష్టిసౌందర్యంచూస్తే దిగులు.

శరీర సౌందర్యం చూస్తే బాధ.

చాలామంది సముద్రంవొడ్డుకి ఎందుకు వొస్తారంటే, మార్పు కోసం. ఆఫీసునించీ, వంటిళ్ళనించీ, నలుగురూ వొస్తే యెవరన్నా తెలిసినవారిని కలుసుకోవచ్చుననీ, చల్లగాలిలో విశ్రాంతిగా కబుర్లు చెప్పుకోవచ్చుననీ. బైబుల్ని యింగ్లీషుకోసం చదివేవాళ్ళలాగు అంతకన్న చాలామందికి సముద్రతీరానికి రావడం (fashion) తమ గొప్ప చూపించుకోడం, కార్లూ, బట్టలూ, పువ్వులూ, కుక్కలూ, కొంతమంది తమ స్నేహితులతో "యేమండి—యీవాళ సాయంత్రమండి బీచ్‌కి వెళ్లామండి. చాలా బావుందిలెండి" అని చెప్పుకునేందుకు వొస్తారు.

సాయంత్రం బీచ్‌కి వెళ్ళేవారు, వెళ్ళని వారికన్న సాంఘిక సోపానాల్లో ఒకమెట్టు యెత్తు. బీచ్‌లో తక్కినవారు అనుభవించే ఆనందం 'మిస్' అవుతున్నామనే ఆశతో వొస్తారు చాలామంది. ఈ 'మిస్' అవుతున్నామనే restlessness క్రమంగా యెక్కువవుతోంది ప్రజల్లో. నిజమైన ఆనందంమీది వాంఛకాదు, ఆనందం 'మిస్' అవుతున్నామనే దిగులు ప్రోత్సహిస్తోంది చాలా కార్యాలని.

"బొంబాయి చూశారా?...కలకత్తా?... హిమాలయాలూ?" అని ప్రశ్నిస్తారు. చూడలేదంటే, చూడాలని లేదంటే ఆశ్చర్యం.

మిస్, మిస్, మిస్;

"వైగల్ని చూశారా? మేవెస్టునీ? బోబర్న్? చూడనేలేదా! ఎందుకు చూడలేదూ?" చూసి నిజంగా వాళ్ళ అభినయంలోని గొప్పతనాన్ని అనుభవించారా? లేదు. చూశామనే సంతృప్తి. వెళ్ళడం, చూడడం, చూశామని మాట్లాడడం— ఇట్లా గడిచిపోతుంది జీవితం. ఇదంతా అభివృద్ధేనా? Progress ఏనా?

స్త్రీలలోకూడా ఉద్యోగాలూ, స్వేచ్ఛా, స్వతంత్రజీవనం, విద్యా, ప్రేమ, రొమాన్సు అన్నీ 'మిస్' అవుతున్నామనే దిగులు

ధ్యేయమైనట్టనవ్వుతున్నాయి. వాటిమీద వాళ్ళకి ప్రేమలేదు. కాని అవి కొందరికి సంతోషాన్నిస్తున్నాయనీ, ఆ గొప్పతనం తమకి లేకపోయిందనీ, ఆవేదన. నా వ్రాతలుకూడా యీ దిగులుకి పాయకపడ్డాయా? అభివృద్ధికి తోడ్పడ్డాయా?

ఈ బాధలులేక simple జీవితాల్ని గడిపే పూర్వ పద్ధతుల వాళ్ళనీ పల్లెటూరివాళ్ళనీ, కూలిజనాన్నీ చూసి, వాళ్ళలో ఏమున్నా ఇంతకన్న శాంతీ గొప్పతనమూ కనపడతాయేమోనని వెతికితే, వాళ్లు మొట్టిజడులు. చాలామంది వాళ్ళలో ఏ"క్యూరియాసిటీ" adjustment లేని నిర్జీవులు. వాళ్ళ గొప్పా! ఆ జీవితమే సుఖమా! స్వల్పవాంఛలతో తృప్తిపడి నిద్రగా గడిపే జీవితాలే నయమా? అట్లా ఐతే పశువులూ అంతకన్నా తాళ్లు superior beings అన్నమాట.

కాని యీ నాగరికుల అభివృద్ధిచూస్తే యీ రాళ్ళూ, పశువులూ చాలా ఆనందమయము అనిపిస్తుంది. వింతనటన! ఎన్ని అఖద్దాలు ఎంత అల్పత్వం! కుతకుతలాడే పట్టణపు మురుగు కాలవకీ, పొలాల్లో పారే పంటకాలవకీ వున్న భేదం కనపడుతుంది. ఒకరికంటె ఒకరు యిళ్ళు, నగలు, పటాలు, వస్తువులు వీటి గొప్పతనం చూపుకోడమూ, ఏమీ ఆనందమివ్వని తళుకులకై శ్రమపడడమూ, ఏదో మిస్ అవనట్టు పరుగులెత్తడం. దీనికన్న శుద్ధ జడత్వమే నయమేమో!

"మోటారొస్తోంది భద్రం" అన్నాడు ఆ భర్త. భార్య నవ్వి "అబ్బో! యీ కాస్తకే భయం! ఏమీ ఫరవాలేదు. అంతమాత్రం తెలుసు" అంది. నూతన స్త్రీ! కట్టూ, వేషమూ సాధారణమైతేనేం? నూతన స్వతంత్ర వాయువుల్ని పీల్చిన స్త్రీ. పురుషుడు ఇస్తాననే సహాయాన్ని అంగీకరించడం అవమానము, ఆత్మగౌరవానికి లోపమను కనే స్త్రీ. కాని అతనిలో అనాది పురుష అహంభావం గాయపడ్డది. ఎట్లా తన ప్రతిష్ఠ నిలుపుకోడం? అధికృత పునః ప్రతిష్ఠించుకోడం?

"ఆ! అట్లాగే అంటావు. రోజూ వూళ్ళో నేను ఎన్నిసార్లు ఇట్లాంటి అపాయాల్ని తప్పించుకుంటానూ? మోటార్లకీ, బళ్లకీ, సందుల పెళ్లిళ్ల తొక్కులకే తెలుస్తుంది" అని అసందర్భంగా మాట్లాడి

స్త్రీ లనుగమించలేని సదనాలకి (లేక గొందులకి) వెళ్ళిపోయి నిల్ల బెట్టుకున్నాడు గౌరవం.

భార్యని షికారు తీసికెళ్ళాడు, చూపించాడు, తీసికెడుతున్నాడు భద్రంగా.

ఈ restlessness వల్ల విద్యాస్వేచ్ఛలకైన ఆరాటంవల్ల పూర్వపు స్త్రీలు నెమ్మదిగా కదలకుండా పొందగలిగిన ఆనందాన్ని, శాంతిని, నూతన స్త్రీలు వొదులుకుంటున్నారేమో? పిల్లల గంతులు, చిన్న మాటలు, దొడ్లో పాదులు, బంధువులు, తెల్లారకట్ట పాటలు. పురుషులూ అంతే! టీచరుపని చేసుకోక యీ కధలు వ్రాయడ మెందుకు? ఈ కొత్తనీచపు నాగరికతలోనించి, యీ బాధకరమైన అశాంతిలోనించి, కొత్త విశాలత్వాన్ని, విజ్ఞానాన్ని ఆనందాన్ని పొందే type evolve అవుతుందా? ఈ పల్లెటూరిజడులు, యీ పట్టణపు నాగరికతా నీచత్వాలలోకి, వికృతాలలోకి మారారు. ఈ మార్పు ఉన్నతపరిణామమా? తరవాత కథ ఎక్కడ? తిరిగి అది జీవితంలో శాంతినీ, శాంతంగా సుందరంగా అనుభవించే శక్తినీ తెచ్చుకోడమేనేమో!

From calm to storm and through storm to a higher calm.

గ్రామఫోను "ప్రేమనికుంజమే ఆహా" అని పాడుతోంది. హిందీపాటల్లో మొదలుపెట్టి ఆ వరసలలో ఆ మాటల్నే తెలుగులో వ్రాసిన ప్రస్తుతపు పాటల్లో ఎక్కడచూసినా యీ ప్రేమ అనే మాట అమితంగా వాడుతున్నారు. ప్రేమలోకం, ప్రేమమందిరం, ప్రేమమురళి, ప్రేమహృదయం, హృదయప్రేమ, ప్రేమప్రియుడు, యిట్లా. ఇట్లాంటి గోల వ్రాత ప్రారంభించిన పాపం నేనే చేశానేమో చాలా! కాని మాటలెట్లా ప్రయోగించినా వాటివెనక ఏదో ఒక సంగతి నిశ్చితంగా చెప్పాలనే వేదన వుండివాలి. ఈ పాటల్లో యింకా కధలలోను గీతాలలోనూ, మాటలమీద ప్రేమ ఎక్కువగా కనబడుతుంది. ముఖ్యం ప్రేమమాటలమీద.

అందువల్లనే యీ పల్లెటూరి స్త్రీల fashions వలె యీ

క్రొత్తలుకూడా దిగులుపుట్టిస్తాయి. రిబ్బన్లు, బొట్టుకాయలు, పౌడర్లు, లోలకులు ఇవి రోజు మనుష్యులు ఉపయోగించగా చూస్తారో, వీళ్లు బొమ్మల్లోనే చూస్తారో, చూడకుండానే మొగవాళ్లచేత తెప్పించుకుంటారో - వాటివల్ల అందంకలుగుతోందా లేదా అనే ఆలోచన లేదు. అవి ఉపయోగించాముకదా అనే సంతుష్టితప్ప. వేళ్ళు పాతుకున్నాయి వీళ్లకి, ఈ పొలాలనించి కదల లేరు, కాని మనసులు వూరికే ఆరాటపడుతో వుంటాయి. వాళ్లకే తెలీని దేనికోసమో! పాపం! కాని యీ అశాంతి లేకపోతే మరీ మోదులవుతారు, కాని యీ ఆవేదన హాస్యాస్పదమైన పర్యవసానాల వ్యక్తమవుతోంది. తృప్తిలోనించి కలిగే అతృప్తిలోనించి తృప్తి పర్యవసానం గావును జీవితానికి. ఆ హృదయాలలో ధూమాలనున్న రసికత్వమో ఏం సౌందర్యతృష్ణో, ప్రోత్సహించి యీలా వికృతకార్యాల్ని చేయిస్తుంది. విద్యావంతులచేత కథలూ, పద్యాలూ వ్రాయిస్తుంది. రౌడీలచేత కూనిరాగాలు తీయిస్తుంది, తాగిస్తుంది, బూతులు మాట్లాడిస్తుంది.

“తృప్తి అమార్, అతృప్తి అమార్” అనే టాగూరు గీతం జ్ఞాపకం వొస్తుంది.

“Love is just a trick of the heart to fool the mind” నిజమైన ప్రేమకూడా అంతేనన్నాడు మైకేల్ ఆర్లెన్. కానిరోజూ వినే యీ ప్రేమ! ప్రేమ! ప్రేమ! ప్రేమ అనే ఆమాటమీద యెంత ప్రీతి మనుషులికి! నిజంగా ప్రేమే ప్రత్యక్షమైతే గుర్తించగలరా? పురుషుడు ఆహ్వానించగానే మంచంవేపు చూస్తారు స్త్రీలు. ఇంక ఇక్కడ వ్రాయకూడని పనులు చేసేవాళ్లున్నారు చాలా మర్యాదస్తులు. ప్రేమనిగురించి మాట్లాడేవాళ్ళు! వీళ్ళందరికీ ప్రేమ అక్కడే ప్రారంభం. అక్కడే ఆ నిముషానే అంతం. మోహాన్ని, అలవాటుని అతిక్రమించే ప్రేమనుగురించి వ్రాయబోతే అర్థంకాక, అర్థంచేసుకోవాలని ప్రయత్నించి, వ్యభిచారం, పశుత్వం, అని అరుస్తారు - అంతా morbidity, perversity అని కళ్లు సంసారపుగదుల్లోంచి, పెళ్ళిల మాసిన దుప్పటి ముసుగులోంచి అరుస్తారు, లీడర్లూ, డాక్టర్లూ, ముఖ్యం బొర్రలు పెంచుకున్న గురూజీలూ, కవులూ.

గర్భాధానలతో సేగా వీరి ప్రేమచరిత్రలు ప్రారంభం. అంటే 'శరా'తో. ఒక్క యువకుడికీ యీ ఆచారాన్ని రొదిరించే ధైర్యంలేదు. ఈ నవీన స్వాతంత్ర్యం, దేశసేవ, సోషలిజమ్, విశ్వాలు కొక్క యువకులకి, ప్రేమజ్యోతులూ, ప్రేమాగ్నులూ, ప్రేమమూర్తులూ పాశ్చ్యాయువకులకి, ప్రేమగీతాలు స్రవించే యువకులకి కూడా! వ్రతిదీ మానసం. అంతా మనోవాంఛ, మనోకూరత్వం, మనోకర్మ వీరత్వం. వయిగా వ్యాసాలూ, ఉపవ్యాసాలూ, సంభాషణాలోకాల్ని మింగేట్టుంటాయి. చేతికందనిదీ, ఏదో పూర్తిగా కార్యాలకి సాధ్యం కానిదీ, మాటలతో అభిరయ్యేదీ, ఏదో దూరపు మనో ప్రపంచం సంగతి రొూచించడం, వోట్లకోసం తిరగడం అంతే జీవితం. గట్టిగా యింటో ఒక్క దురాచారానికి తిరగబడే కాల రొూధుడు అరుదు. ఆ కమ్యూనిజమ్ వొస్తే అన్నీ చక్కబడతాయని ఒకరూ, హృదయం పరాయత్తమయిందని దిగులుతో యింకొకరూ, ముసలితల్లి అడ్డమున్నదని ఒకరూ. అందరికీ ప్రేమకావాలి, స్వేచ్ఛ కావాలి, యుద్ధాలూ, విప్లవాలూ, రొూచించేవారేగాని, తాము పుట్టిన స్థలంలో సంస్కారంగాని, తమ హృదయాల్లో వ్యల్ప అభివృద్ధికాని ప్రయత్నిస్తున్నట్లు తోచదు. ఇంక ఏ ఉద్యమానికీ యింటివద్ద శక్తిలేక తమ లోపలి స్వతంత్రాభిలాషనీ, మనోఅశాంతినీ పట్టణాల్లోకివెళ్ళి అక్కడి కాఫీహోటళ్లలో, గుంపుల్లో, రైళ్లల్లో అక్కడవినే scandals లో Discussions లో తీర్చుకో చూస్తారు.

ఈ నీచదృష్టు లన్నిటిలోంచి, బురదనీళ్లపైన తేలుతున్న తెల్లని కలువవలె మనసులో తోస్తుంది నా చి — ఆకారం. దూరమైతే నేం జ్ఞాపకం తప్ప యింకేమీ మిగలకపోతే నేం? నా చి—కల్పించిన నిర్మలత్వం యీ ఆత్మనించి తొలిగిపోదు. ఎంత రొూచించినా చి — శరీరానికివున్న గొప్పసౌష్టవంకన్న, మెరుపుకన్న అతిక్రమించిన సౌందర్యం ఏదో నా ఆత్మని కలత పెడుతుంది. అనంతా అమె heridity ఏనా లేక అమె సంపాయించుకుందా?

వుత్త అందంలో ఆకర్షణ స్వల్పం. కావాలి మాడాలి అనిపిస్తుంది. అంతటితో తృప్తి కలుగుతుంది. Tooth paste వాళ్ళ

అందాన్ని Mono Lisa ని పోలిస్తే tooth paste బొమ్మ సలక్షణంగా వుంటుంది. కాని ఆత్మ, ఆత్మ పరిశుద్ధమూ, నిర్మలమూ అయివుండ నక్కర్లేదు—ఆత్మ complex కానక్కర్లేదు. కొందరి ఆత్మల్లో రసికులైనవాళ్లని పిలిచి, ఆపి, ఆలోచింపచేసి, ముందుకు రానిచ్చి, వెనక్కి భయపెట్టి, ఆశపెట్టి, ఆశ్చర్యపడచేసి, యీ mystery ఏదో తెలుసుకోవాలనే కుతూహలంలో చిక్కుపెట్టి, ఏమీ తెలియదనే నిరాశతో మగ్గించే గుణం వుంటుంది. టాగూర్ వర్ణనలవలె, వుడ్‌హౌస్ చక్కలిగింతలవలె, మైకేల్ ఆర్లన్ ఊహపూసాలవలె, జపాన్ దేశపు రేడియో సంగీతంవలె, నరాల్ని అందంతో లాగి బాధిస్తాయి ఆ స్త్రీసౌందర్యాలు. పురుష హృదయాల్ని ఏలిన గొప్పస్త్రీలు గొప్ప సౌందర్యవంతులు కారు. పురుషహృదయం దేన్ని ప్రేమిస్తుందో దేన్ని చూసి మంటను వదలలేని కీటకంవలె అయిపోతుందో, ఆ గుణాన్ని వర్ణించగలరు, ఏమీ ప్రయత్నం లేకుండా. వూరికే వర్ణిస్తారుగాని ఏ విధమైన అందమూ లేని జుట్టు, ఏ పరిమాణానికీ సరిపోనికళ్లు, ఏ సన్నదనమూ లేని నడుములూ, ఏ మెరుగూలేని రంగు — ఏదో రహస్యమైన ఆకర్షణవల్ల ఏ నడకో, ఏ మాటమాధుర్యమో, ఏ కామవిస్ఫురణో రసికుల్ని దాసుల్ని చేసుకుంటాయి.

ఏ పోలికలకూ ఉపమానాలకూ అందని యీ స్వభావాన్నే grace, charm అని వాదిస్తారు కవులు. కాని వీటి అన్నిటికన్నా ఆత్మ గొప్పగా నేత్రాల్లో ప్రకాశించడం చూశాను. ఆ ప్రకాశం చాలామందికి సామాన్యమిత్రుల మనస్సులకు అందలేక పోవడంకూడా చూశాను. ఈ mystic factor వల్ల సాధారణ స్వరూపాలు అతి ఆకర్షకంగా మారినప్పుడు అనశ్వరమైన ఆత్మలో విశ్వాసం కలుగుతుంది. తన సహజ స్వభావంవల్ల పూర్వ సంస్కారాన్ని బట్టి ఆత్మ తనచుట్టూ కల్పించుకున్న గూడు కాదుగదా యీ దేహం అనుకుంటాను.

నిన్న రం—గారి కూతురు వొచ్చింది. ఆమె యెవరో నాకు తెలీక తెరవెనకనించి కంఠంవరకు కనపడే ఆమె శరీరాన్ని చూసి ఏ రసికుడైన చిత్రకారుడి స్వప్నమో యిది అని ఆనందపడుతున్నాను.

ఆమె నా "పాపం" కోసం కబురంపింది. ఆ మాట సరిగా వినకపోవడంవల్ల కలిగిన అసందర్భానికి ఆమెను నవ్వించి పుస్తకం యిస్తే దగ్గిరిగా నుంచుని నాయెత్తున యెదురుగావున్న ఆమె ముఖంకేసి చూశాను. చాలా చక్కని well chiselled face లో, తీర్చిన కళ్ళలో ఆత్మ లేదు. కళ్ళలో తెలివి, పెదవుల్లో పెంకితనం, గడ్డంలో గర్వం, అన్నీ coquettishness తో కలిసి చాలా ఆకర్షకంగా వున్నాయి; challenge చేస్తున్నాయి. కాని ఆత్మ లేదు. ఏమిటా ఆత్మ అని ఆమె ప్రియులెవరైనా నన్ను దిఖ్ఖరిస్తే అర్థం చెప్పడం నాతరం కాదు.

కాని నా చి- కళ్లు కిందికివాల్చి

"ఇంతే, కలలు కందాం జీవితమంతా" అంటే___

ఆ అజ్ఞచొప్పున చేతులు కిందికివాల్చి జీవితమంతా కలలు కంటున్నాను.

ప్రబంధాల్లో గాని, పురాణాల్లో గాని, సౌందర్యాన్ని వర్ణించేప్పుడు, చావలూ, చాటలూ, పువ్వులూ, కాడలూ, తిన్నెలూ, పుట్టలూ వుపమానాలుగా తీసుకొచ్చి పెట్టారుగాని ఒక్కచోటా ఈ ఆత్మతేజస్సు సంగతి యెత్తుకోలేదు, ఎక్కడో ఒకచోట కాని. మైకేల్ ఆర్లెన్ గాని, గాల్స్వర్దీ గాని ఏ వర్ణనా లేకుండానే తమ కథానాయికలచేత మనసంతా కలవరపరిచి వారం రోజులు ఆ చింత వదలలేనంత సన్నిహితంగా ఆకర్షణీయంగా చేస్తారు. పైగా పూర్వకవుల్ని, పతివ్రతల్ని తలుచుకుని పొంగిపోతారు యీ దేశస్తులు, ఆ పిండిబొమ్మల్ని ఆత్మలేని మట్టిముద్దల్ని చూసుకుని. ఇతరుల్ని మెటీరియలిస్టులూ, దేహలంపటులూ అని తిడతారు.

Dead beauty ని అనుభవిస్తున్నారు. ఆత్మల్ని నాశనం చేసి స్వేచ్ఛ కాళ్లు విరగగొట్టి కళేబరాల్ని కావలించుకుని సుఖపడుతున్నారీనాటి ప్రజలు. సౌందర్యానికి అంధులు కావటంకన్న సౌందర్యం చూస్తూ రైపోవడంకన్న మృత్యువు వేరేలేదు.

సౌందర్యభావం ప్రజలలో చచ్చింది. చూసే సౌందర్యాన్ని ఎట్లా వుపయోగించుకోవాలో తెలిసే ధ్యాస తప్పిపోయింది. చక్క-

ఏరాటికీ, గడ్డాలకీ, గోడలమీదికీ, లాగి, బంధించి, ఎంగిలిచేసి, అదలపారేసి, అనుభవించామని గొప్పు చెప్పుకోడంలో తృప్తి పడుతున్నారు.

సౌందర్యంమీద భక్తి వుంటుందనికూడా మరిచిపోయినారు, గొప్ప కవులూ, కళారాధకులూ. సౌందర్యాలన్నిట్లోకీ సుందరమైనది సుందరమైన జీవితం, దానికి మాత్రం సుందరమైన ఆత్మ. అధికారుల ముందు ఉపకారాలకి ఆశించి డోల్లు కొట్టే కవులూ, సినిమా డైరక్టర్ల కాళ్లు పట్టే చిత్రకారులూ, విశ్లేషకులకి ఆదర్శప్రాయులు. సౌందర్యం శృంగారం ఏమిరాసినా, బూతూ, వ్యభిచారంగా పరిగణిస్తున్నాయి యీ క్షుద్ర విమర్శకులకి. ఎంగిలి పెదవులు లేకుండా మానసిక masterbations తోటి కాకుండా సాంఘిక కృత్రిమ ఏర్పాటులకి లొంగక, సృష్టిలో మల్లే ఆరోగ్యంగా, ఆనందంగా, అనుభవించడం, తుచ్ఛమూ, క్షుద్రమూ, పశుత్వమూ అయింది. పవిత్రంగా ఆధ్యాత్మికంగా, పరిణయంగా, అగ్నిసాక్షిగా, స్త్రీతో ఏం సంబంధం పెట్టుకుంటావు? విమర్శకుడా! చేతులూ, పెదిమలూ, తొడలూ మనిషెయ్యకుండా, ఎట్లా మోహిస్తావు, ప్రేమిస్తావు స్త్రీని, ఆడదో ఆ రహస్యం కొంచెం చెప్పుదూ? నీరసంగా, ఏడుస్తూ, తిడుతూ, కళ్లు మూసుకుని, పాపకార్యం సాగిస్తున్నావా, మహామునీ! అనుభవించి పోతున్నారటా, ఆ అగసాం!

నీకూ, నీ సోదరులకూ, లేకపోతేనేం, కొందరి పాపులకన్నా దొరికాయి రక్తమూ, మాంసమూ, రసికత్వమూ, శృంగారబాంధా! ఈ దరిద్రపు దేశంలో ఈ కలియుగంలో!

చెరువునిండా యిట్లా తామరపుష్పాలు వికసించి నవ్వుతో వుంటే తెల్లగోరింకలూ, పిట్టకాకులూ, ఆకులమీద పూగుతో వుంటే, ఎర్రని మబ్బులు పిట్టమీద బుల్లావు దల్లులో వుంటే, తలలు వొంచుకొని సిగ్గు తీసుకుపోయ్యావా, ...

ఎండాకాలంలో సాయంత్రం దక్షిణవాయువు స్ఫూర్తి "అమృత తోయంగా వుందంటారు."

"దక్షిణ భూతలంలోంచి యీ వసంతప్రియుడు నన్ను తాకి ఆనందిస్తున్నాడం" టాడు ఏ ఒక్క టాగూరో.



మొదట నా పాదాలముందు చిక్కటి నీలం దానివెనక నీలిముందురంగు, ఆటుతరువాత చిక్కని వూదా, అన్నిటిమీదా తెల్లని కొంగల్లాగు లేశే అలల తలమీది నురుగు; ఎన్ని గంటలు చూచినా విసుగు పుట్టదు. పొద్దస్తమానం ఇక్కడే కూచుందామంటే రెండు గంటలైతేనేగాని యీ బొంగలిపాద కొంచెం నీడనివ్వదు.

బారకందని చాపల్ని కావిళ్లల్లో వేసుకుని యీ తోవన తీసుకుపోతున్నారు పల్లెవాళ్ళు విశాఖపట్నం మార్కెటుకి. ఐదు మైళ్లు మొయ్యాలి యీ ఎండలో. నెత్తిమీద కాలే యీ ఎండనిచూసే విసుక్కుంటున్నాను నేను. వాళ్ళో పాపం! ఈ చాపల్ని తీసికెళ్ళి అమ్మి, యింటింటికీ పంచి, ప్రజల్ని బతికించే పరోపకార పారాయణులుకూడదూ వీళ్లవి! ఆ కూటంకే కూంపాపోతేరయులు పళ్లు కొరుకుతారు. మళ్లీ పడ్డు పండించే కర్షకుడిమీద, యీనాడు అచ్చరశ్యా పాటల్ని పద్యాల్ని మాశ్యాలిచ్చే యీ మహారాజాకూడా అందలేకపోయాడు. కర్షకు డెంతఘనుడో, పరోపకార పారీణుడో యీ పల్లెవాడుఅంతే. ఛేదాళిప్రాయానికి జీవహింస నెట్టిమింటే కారణం. పల్లెవాడి కష్టంలో కాపువాడిది యెన్నోవొంతు!

పొలం దున్నడంగాని, చాపలు మొయ్యడంగాని నిజంగా అంత దుస్సహమైన కార్యమేనా? కాదు. ఆ బాధ అంతా చూసే వాళ్ళలోనే, వ్రాసే నా కలంలోనే. ఇతరులకి లేని బాధలు వున్నాయనుకోడం ధర్మాత్ముల ద్యూటీ. కవికీ, కథకుడికీ, అత్యవసరం- అతని జీవనాధారం; అతిశయోక్తి లేంది వాంగ్మయమే లేదు. ప్రస్తుతం కవులు వ్రాసే కార్మిక కర్షక రచనలు మూడుపాళ్ళు misplaced sentiment. నా వరాలు ఆ పల్లెవాడి వరాలుకావు. అతనివి యింత సుకుమారాలుకావు. ఎండలో దున్నే కర్షకుడి చమటలు కలుపుకొని వచ్చును వొంగని కవి పగడాగా వరండాలో బాపుమీదకూచుని,

తనకే సంభవిస్తే అదని ఎంత బాధకరంగా వుంటుందో ఊహించు-కుని, కవిత్వమల్లుకాడు. తాను కూర్చున్నందుకు చాపకెంత బాధో అని కథలు వ్రాయవచ్చు. ఆ చాప రోదనం వర్ణించానికి వినిపించవచ్చు. ఆ చాప లోకపారిశుధ్యఆశయం, అచాప తనలోపల పెట్టుకుని అవతరించిన దేవత అనవచ్చు. స్త్రీ విషయమై నేను వ్రాసే కథలూ అంతేనేమో! కళకూడా fashionsని అనుసరించి నడుస్తోంది. స్త్రీలని subjectగా తీసుకుని కథలు వ్రాయడం చాలా సన్నుతకార్యమైపోయింది ప్రస్తుతం.

చల్లని గాలికి నిద్రవొస్తుంది. Old horse కొండలో పడుకుని కొండలకేసి చూస్తోంది. దూరంగా Dolphin's nose కొండకి దాహపడి వుప్పునీళ్ళు తాగవొచ్చిన యీలోకపు కొందటి మృగం వలె సముద్రంలో పడుకునివుంది, చెరువులో పడుకున్నట్లు. వీక్లు రాళ్లు చుట్టూ తిరిగివొచ్చి కలుసుకుని నవ్వుతున్నాయి, తల్లిచుట్టూ దాగుడుమూతలాడే పిల్లలవలె.

నిద్ర వొస్తుంది యీ ఎండవేళ! తెల్లారకట్టే మెలకువ వొచ్చేసింది అట్లతద్దికి ఆడుకునే పిల్లల గోలవల్ల. ఈ వూళ్లో యింకా యీ ఆచారం సాగుతున్నట్టుంది. ఏఏ వూళ్లనించో వొచ్చి దిగే యీ కొల్లూరు మాన్షన్సులో పిల్లలందరూ చుట్టుపక్కల వాళ్లని నిద్రలేపే ప్రయత్నంలో unite వినారు. పక్కమీద కళ్ళు తెరవగానే పక్కనకూచుని పల్కరించింది సుందరమ్మ. అప్పుడే చీకట్లో తెరుచుకుంటున్న నా కళ్ళమీద అగరువాసనలతో పెద్ద బొట్టు కప్పింది. నా చెవులో జాలిగా "మరిచిపోయినావా నన్ను!" అని రహస్యంగా వినిపించింది.

చిన్నప్పుడు ఎన్నేళ్ళయిందో - అట్లతద్దిముందు సాయంత్రం నన్ను చూడ్డానికని వొచ్చింది క్రూరమైన అభ్యంతరాలు తప్పించుకుని. కనపడగానే ఎదురువెళ్ళి జాతిబాదవనక యింకా చిన్నవిగా వున్న ఆ బుజాలు - మజిలిన్ చొక్కాకింది ఆ తెలబుజాలు - కావిలించుకున్నాను. అట్లతద్దీ, చిన్ని తెల్లని జాజిపువ్వులూ, సుందరమ్మా యీనాడిలా చిక్కుపడిపోయినాయి నా హృదయంలో, గోరింటాకు

ట్రోఫీలు పెట్టుకొన్న బల్ల చూసి నవ్వు పొడిచింది, నా కొడుకులో కలెక్టర్ గోల్డుమెడల్ అంటిస్తారని. నేను వాళ్ళదగ్గరే "బంగపిల్లా ధైర్యంగా" అని నవ్వేది.

... ...

చందురుడు వచ్చిందాకా డాబామీద కూచుందామనుకున్నాను. చీకట్లో మెట్లమీద దిగుతుంటే తిరిగి కూచోబెట్టాను పొద్దుటో యుండని భయపడే పిల్లని.

కాదు, ఆ శ్రీహరి పహార్లు చేస్తున్నాడు డాబామీద.

ఏం చెయ్యను? కుర్రవాణ్ణి. ధైర్యం లేదు. పెద్దవాళ్లకి అను మానాలు పుడతాయని భయం.

సుందరమ్మ లేచి నిలుచుంది. దిక్కు తోచక వేసుకుని చూట్లో దీక్షగా చూస్తున్నాను ఆ కొంపకేసి. మెట్ల తలుపుదగ్గర ఆ అమ్మాయి నావంక జాలిగాచూసి నా గడ్డంకింద చెయ్యేసి "రేపు పొద్దున్న తెల్లారగట్ల ... తప్పక రండా" అని వెళ్ళిపోయింది.

నేను వాళ్ళిద్దర్నీ చందుర్ణ్ణి చూస్తో విరహపడ్డాను. అందరితో చెప్పాను తెల్లారకట్ల లేస్తానని.

"ఏమిటి? నువ్వుకూడానా? ఇంకా చిన్నపిల్లవాడివా?" అన్నారు. బాగోదు Lad of Sixteen నేను! ఇటు పెద్ద వాళ్ళతో జతకాదు; అటు కుర్రవాళ్ళతోనూ కాదు. కాని పెద్దవాణ్ణి అవుతు న్నాను గనక నేను లేస్తానన్న సంగతి తెలుసుకోలేరు ఎవరూ.

తల్లి దండ్రులకి తమ పిల్లలమీద వుండే విశ్వాసాన్ని చూస్తే నవ్వు వొస్తుంది. చిన్నపిల్లలుగా తమ వొళ్ళో, తమ ముందు నవ్వి, గంతులేసి, గోల చేసినపిల్లలు యిట్లాంటి మోహావాంఛలలో పడతా రని నమ్మలేరు. తమ చిన్నతనం మరిచిపోతారు. Sex అనేది వాంఛ కాక ధర్మమయినట్టుండి ఈ రోజుల్లో... చాలా కాలం ధర్మంగానే నడిచిందేమో [illegible] వాంఛగా [illegible] adjust కాలేకుండా [illegible] తల్లి దండ్రులు [illegible] ఎన్ని [illegible] ఎన్ని [illegible] చరిత్రలో...

సన్నటి చంద్రకాంతిలో ఆడుతున్న పిల్లలగుంపుల్ని చూస్తూ ఉన్నాను. సన్నని వొళ్లూ, చంపలంతా కళ్లూ, పూవువంటి ముక్కూ, వెన్నెలని మింగేజడా, గాలిలో కొట్టుకుపోతున్నట్లు పరిగెత్తే నా ప్రియబాలికోసం, దగ్గరగావెళ్లి మొహాలుచూసే నావంక ఆడపిల్లలు 'స్కాండల్'గా చూస్తున్నారు. చాలామంది తన హృదయానికి తగిన ప్రియులకోసం జన్మాన్ని వెతికే ఉదారులకి దుర్మార్గుడనే అపకీర్తి యిట్లానే కలుగుతుంది.

కనబడ్డది, నా వంక చూడదు. పిల్లలతో కేకలేస్తుంది. నవ్వుతుంది. దూరంగా పరిగెత్తి దగ్గిరగా రాసుకుంటూ పోతుంది. తలెత్తదు, వంకజూడ –

"బాబు వచ్చాడు. సుందరమ్మా!" అన్నా. వినిపించుకోలేదు.

ఈ చంచలమేకదూ, యీ non-dependability, variable quality యే కదూ స్త్రీమీద పురుష ఆగ్రహాన్ని సమ్మోహింప చేసింది! పూర్వకాలంనించి దీనివల్లనేకదూ స్త్రీని తిట్టినతిట్లన్నీ!

"ఈడుండమంటాది యిటు దూకపోతాది."

"మాట యివబడనట్టే మరి రూటా చెప్రతాది."

కాని యీ ఆటలే, ముందు నిముషం ఏంచేస్తుందో ఎట్లా మారుతుందో తెలీని యీ మిస్టరీ యే లేకపోతే స్త్రీ యెంత uninteresting, tame, insipid వ్యక్తి అయిపోయివుండును!

హృదయాన్ని మండిస్తుంది. కాని ఆ మంటలో యెంత మాధుర్యముంది? విశ్వేశ్వర్రావు తన పుస్తకానికి 'మధుకీల' అని పేరు పెట్టటంలో యింత యేముంది? పురుషుడెట్లానైనా స్త్రీని యీ చంచలత్వం నించి dependable సాధారణ గృహిణిగా మార్చాలని చూస్తాడు, comfort కోసం. సఫల మనోరథుడవుతాడు. అగర్భంగా పోగొట్టుకున్నదాని విందించి త్యజిస్తాడు. బాధలో ఆనందాన్ని, అగ్నిలో మాధుర్యాన్ని, 'మధుకీల' నెరిగిన మానవుడు చాలా అల్పుడు.

ఆ ఉదయాన నేను పడ్డబాధని పదిహేనేళ్ళ తరువాత నా కవి పాడాడు అద్భుతంగా.

"నీ వెళ్లిపోయినావంటే"

“వన్ని పేరెట్టి పిలవా నాయెంకి” అని అనాటంత నేను కొత్తగా వ్రాయవలసిన అవసరమున్నంత దౌర్భాగ్యంలో ఆంధ్రదేశం లేదని విశ్వసిస్తున్నాను.

“సుబ్బారావుగారూ యివన్నీ యింత సుకుమారమూ, అంతరాంతరమైన ‘టచ్చెస్’ మీకెట్లా వొచ్చాయండి? అసలు ‘పోయ్స్’ ఏమి” టని అడిగాను సగం కొంటెగా, సగం ‘యీగర్’గా.

పాపం ఆ రెండేళ్లూ నా కొంటెతనాన్ని నేను తెచ్చిపెట్టుకున్న విపత్తుల్లో ‘యీగర్‌నెస్నీ’ భరించారు ఆయన వోపికగా. ఎన్ని తిప్పలు పెట్టినా పడ్డారు; నామీది వాత్సల్యంచేత ఆ మహాకవి. నేను స్థాపించబోయే పెదక్షన్ ఎసోసియేషన్‌కి మూతాం లీగల్ ఎడ్వైజర్‌గా వుండడానికి వొప్పించలేకపోయినాను.

ఆయన యిదివరకే జవాబు చెప్పాడు యిట్లాంటి కొంటె ప్రశ్నలకి.

“యెంకెవ్వరని లోకమెప్పుడైన కదిపితే
వెలుగు నీడలకేసి వేలు చూపింతు.” అని.

ఆ రెండు పాదాలకీ యీ దైనకవిత్వాల యీ ప్రపంచ వాంగ్మయంలో ఎక్కడా కనిపించదు. నాముందు ఆరాటపడే ఈ సముద్రపు అగాధత్వమూ, నిరంతర అశాంతి, నా హృదయంలోని అర్థంలేని ఆరాటమూ, నిర్నిద్ర, అదర్శవాంఛా; సఫలం లేని, కాని, ఘోష; జీవితంలోని మాధుర్యమూ, విషమూ, నిష్ఫలత్వమూ, నిరాశా, నిరంతరమూ ఆకర్షించే యీ అనందాల అల్పత్వమూ, వ్యర్థత్వమూ అన్నీ గోచరిస్తాయి నాకు ఆ పాదాలలో. అంతేకాదు యీ సృష్టి ప్రవాహపువడిక– అన్నీ అందుకునే అర్థంగాని పిలుపు, సాధారణ మానవంలోని మిస్టరీ, ఔన్నత్యం అన్నీ తోస్తాయి నా మనోవీధిలో.

నా ప్రశ్నకి కొదక్లేదు నేను నా రహస్యాలు అప్రయత్నంగా ఆయన కంటబడ్డ తరవాత ఆయన రహస్యం తెలుసుకోకుండా పోదులేనా!

“భార్య చెప్పమనింది చెప్పుతున్నాను” అన్నాడు చివరక్కి గొప్పగా గర్వంగా.

పూర్వ జన్మంలో నాకు నమ్మకం లేదని తెలిసి ఆ జవాబు లేని జవాబు చెప్పావనే legal satisfaction, లేదుకదా ఆ చిరు నవ్వులో మీసాలకింద!

గత జన్మలనించి యింత దీర్ఘ కాలాన్ని, దేహాన్ని, పుటకల్ని, అనుభవాల్ని దాటివొచ్చి యీ నాడింకా యింత స్పష్టంగా, మధురంగా, రక్తాన్ని పొంగిస్తో నిట్టూర్పులు వినిపిస్తో శుష్క జీవితాల్లోకి రసం ప్రవహింపజేస్తో సున్నితంగా detailed గా, దృఢంగా, పాటల్లో పలికిస్తున్న ఆ అనుభవం మొదట్లో వాస్తవంగా జరిగినప్పుడు యెంత గొప్పదై వుండాలి! కోప్పడకండి మీ పూర్వజన్మల సంగతి మాట్లాడుతున్నాను, ఈ జన్మల సంగతికాదు, సుబ్బారావు గారూ? ఎందుకంటే చాలామంది పవిత్రులకి పూర్వజన్మల్లో రొమాన్సు జరిగి వుంటుందన్నా ఆగ్రహం కలుగుతుంది, అందుకని.

నేనే కాదు, ఆంధ్రదేశమే పూర్వ పతివ్రతల్ని వాళ్ళ పీఠాల్నించిలాగి కింద పారేసింది. ఇంక నూతన యుగపు బాలికలకి ఆదర్శమైన పతివ్రత మీ యెంకి. యెంకి అనే హాస్యాస్పదమైన assosiations వున్న సాధారణ నామాన్ని యెంత శక్తితో, romanceతో, poetryతో, తపస్సుతో, charge చేసి మా హృదయాలను యిట్లా పవిత్రించ గలిగారో మీరు!

నమ్రతతో నేను తోటి కవిని, ఆంధ్ర యువకుల తరఫున శిరస్సు వొంచుతున్నాను మీ ముందు.

"ప్రేమలో విశాలత్వంకాదు, పురయిటీకాదు, ఇన్టెన్సిటీ ముఖ్యం" అన్నాను మొన్న బాపయ్యతో.

"వెంకటచలమేనా మాట్లాడేది?" అన్నట్లు చూశాడు నావంక.

అట్లాంటి అద్భుతానుభవం తరవాత ఏం చేసివుంటారు నా హృదయగాయకా! ఏ మహాపరాధం చేశారు, ప్రేమదేవతకి కవినించి పెడరుగా జారిపోయేందుకు? మాలాంటివాళ్ళందరి కళ్ళనూ dazzle చేసి తెలుగు కవిత్వంలో కొత్త ఆశల, విశ్వాసాలు కల్పించి — యింది వరకు పాతుకున్న బురదచాళ్ళల్లోంచి తెలుగు సారస్వత రథాన్ని

ఒక్క పూపుతో పుష్పాలతో నిండిన చద్రికలు మాదిరే లాగి చిర కి. చివరకి......

ప్రేమ కవినించి mystic poet ఆధ్యాత్మికకవి దాక్కా ప్రేమ గాయకుడినైతే, ఏమీ మాట్లాడని మానినైతే, ఆనందిస్తుంది. కాని, కాని...... సవరముసల నిరాశా నిశ్వాసాలు విశ్వాన్ని నింపు తున్నాయి. అయినా భయంలేదు కోట్ల అవరణలు ప్రకాశించవు లెండి.

"ఏటితరగలకేసి ఏటి చూసేవే?"

ఏమిటిచూస్తావు ఈ అల తరగల్లో అలలనే తెరమీద ప్రతిబింబం మాకేదో న్వృత్ని గిసే ఈ నురుగులో నేను! ఏమిటో సంబంధం, పిలుపు? నా చి- కళ్లువిప్పి నన్ను ఆహ్వానించినప్పుడు సగం చూసి నా ముఖాన్ని చెనికోసమో పతికేశ్వాడు నేను గాఢంగా మాట్లాడిన మాటకి అర్థమేమా అని రూపించేటప్పుడు ఈ కాంతి ఉదయించింది, అర్ధరాత్రివరకు ఈ నీటిమీద తెచ్చే మార్పులే జ్ఞాప కంవొస్తాయి నాకు.

"ఆత్మకోసం కళ్లు వెతుకుతాను. నా ప్రేమకి ప్రవేశమార్గాలు నేత్రాలు. నీ నేత్రాలంత అందమైనవాటిని నేను చూడలేదు. నీకళ్ళవంటి దయగల దారులా" అన్నాను చి. తో... ఏమనుకుందో.

నవ్వింది? నేను ప్రేమించే స్త్రీతో మాట్లాడే సాధారణ వాక్యాలనుకుందా?

ఎన్నడో ఎట్లానో Lawson's Bay కి వొచ్చి ఈ స్థలాన్ని ఈ సెంగలిపొద కిందనే కూచోవడానికి కల రూపైపోయింది చి..? న్నా-విధి పూయించిన వొక్క పూపుతో, ఆ కేసులోని కలల ఒక్క గీటుతో రెంత దూరమైపోయినాము మనిద్దరం?

"ఎంత దూరం" అన్నావు! నీ ఉంటరంలో రెక్కలు చూస్తో.

"నాయనా కళ్లు. కాని చేస్తున్నావుగా!"

[illegible]. [illegible], [illegible] ఈ [illegible] నిద్రపోకా [illegible] ప్రత్యక్షమైన [illegible] మనిద్దరం- [illegible] [illegible] నా [illegible] మాటే [illegible], [illegible] [illegible]

బాధ పడుతున్నావేమోనని నీ సుఖం వదిలి నేను, ఆ ప్రియుణ్ణి అనంతమూ, నిరాటంకమూ చెయ్యగలిగితే!

“అటువంటి అద్భుతాలూ మన హృదయాల్లో వున్నాయి, ఇనపకడ్డీల పంజరాలకి కూడా మన ఆత్మలకి వున్నాయి. సాహసించు. జీవితాన్ని భవిష్యత్తుని తలుచుకుని భయపడకు” అని మాటలతో చెప్పాను. కాని నీ ఆత్మకి అర్థం కాలేదు నా భాష. అర్థం చేయించే శక్తి నా ఆత్మకి లేదు. అందువల్లనే మన జీవితాలిట్లా అయిపోయినాయి చివరికి.

పైగా వచ్చిపోతా నంటావు. ఇన్ని పుస్తకాలు నావి చదివావు. నేను చెప్పింది— “జీవితంనించి సంఘాన్నించి అపజయాన్ని అంగీకరించవొద్దు. మరణంలో, మర్యాదలో, జడత్వంలో, మామూలులో, శరణ్యం పొందవొద్దు. రణభూమిలోకి రా. గాయమయిందా, అవయవాలే ఖండాలైనాయా, రక్తమంతా నేలపాలయిందా, హృదయమే ముక్కలయి పోయిందా! భయంలేదు. ఆ సంసార మృత్యువు కన్న ఇదే నయం!” అని.

నన్ను మరిచిపోమన్నావు. అవును, మరిచిపోతాను. మరిచిపోక నిరంతరం జ్ఞాపకం తెచ్చుకుంటూ భరించలేను. నా నరాలు కాలిపోతాయి. ఆశలేని వెలుగులై విరహపడి— బాధ మేమిటి? అర్థం లేని బాధలో యోగ్యతలేదు. చివరికి విరహబాధకై నా నరే, నిన్ను నా consciousness, పైపొరల్లోంచి అంతరమైన depths లోకి నెట్టేస్తాను. ఆ అనుభవంలోంచి కవిత్వాన్ని, ఆత్మవికాసత్వాన్ని సేకరించుకునేందుకు ప్రయత్నిస్తాను. ప్రేమసామ్రాజ్యం; తప్పితే దానితో తులతూగగలది ఒక ఆత్మసామ్రాజ్యమే. నా చేతులూ, నా పెదవులూ నా— ఏమో? ఏ ఇతర సౌందర్యంతోనో వాటి ఆరాటాన్ని అణచానికూడా ప్రయత్నించవొద్దు.

కాని నువ్వు! నీ గతి? వంటా, పేడా, చివాట్లూ, చికాకూ, దినదినమూ భరిస్తూ కళ్లు ఆకాశంవేపు, ఆత్మ సౌందర్యలోకాల సంచారం— పిల్లల చదువుల్లో పెళ్లిళ్లల్లో, [illegible] నువ్వు నా చి—వి, నువ్వు తృప్తిపడతావా, [illegible]

జ్యోతుల రేపే దీపాలార్పిన చీకట్లోనో, రేపే దొడ్డిదండిట్లోనో, ఏది గుమ్మందగ్గిరో, ఒక్క చూపుకి, ఒక్కమాటకి కరువువాచి, మర్యాదస్తుల మాయమాటల్లో, నీరసస్తుల నీతినియమాల్లో, ఎక్కడ ప్రియమైనవాళ్ళని గాయంచేస్తానో, అన్యాయం చేస్తానో అని భయపడుతూ ఏడ్చే నీహృదయాన్ని సమదాయింప ప్రయత్నిస్తావా? నువ్వు! ఒక్క చూపులో రాయిని కరిగింపచేసే మహాశక్తి, ఒక్క పలుకులో లోకాల్ని మైత్రపడచేసే మాధుర్యం, గానంలో సమస్త దోషాలూ కడగగల నీ ఆత్మ ఔన్నత్యం అంతా, అంతా, వ్యర్థమై లోపల లోపలే కాలి, కాల్చి, నశించవలసిందే! ఎందుకిట్లా? మనకు మనం మన చేతులతోనే యీ గతికి తెచ్చుకున్నామా? మనుషులా, సంఘమా, కర్మా, దేవుడా? ఎవరు, ఏది? ఏమిటికారణం? గుడ్డితనం పరిపాలిస్తోందా లోకాన్ని? క్రౌర్యం కాలికింద నొక్కుతోందా హృదయాల్ని! ఎక్కడగతి? ఏదిముక్తి?

ఒక్కటే సాధనం. సాహసం, జీవితంలోవిశ్వాసం మాతృత్వంమీద, కర్మమీద, శాసనంమీద తిరుగుబాటు, భవిష్యత్తులో నిర్భయం, ఆత్మలో విశ్వాసం, పర్యవసానాల నిర్లక్ష్యం.

నా సత్యంలో నమ్మకం.

విధిని తారుమారు చేస్తుంది సాహసం!

నా రాత్రిని అప్పుడే మరిచావా?

నిన్ను మరవగలనా, అంటాను కాని!

గుమ్మంలోంచి దూరమయ్యే నా వంక నీ కడపటిచూపుని—

ఎందుకు కనబడ్డావు నాకు!

అనేక సంవత్సరాలు వృత్తపేరు నువ్వు. నాకు మనిషివై, దేవతవై నాముందు ఎందుకు నిలిచావు?

నీ ముళ్ళపంజరం చూసి నేనెందుకు దూరంగా పడలేదు?

తలుపు తెరవమని అంత జాలిగా ఎందుకడిగావు?

గొళ్ళెం పెట్టలేదు.

గడియ లోపలవుంది.

సాధనమేమిటున్నాను.

నువ్వే చెప్తున్నావు.

నా solutions భయంకరమైనవి నన్ను దగవద్దన్నావు.

నా సాహసాన్ని నీ వెరగలన్నావు.

నమ్మి చెయి జాచాను.

సాహసయాత్రికు నడుముకట్టాను.

భయపడి పంజరపుకడ్డీని పట్టుకు వేళ్ళాడావు. పాపం!

నన్ను ప్రేమించడానికి, నా జీవితాన్ని నీ మాధుర్యంతో ముంచెత్తడానికేకాదు నీ వేపు నేను చెయిజాచింది.

నీ జీవితాన్ని అర్థయుక్తం చేసుకోమని, ముఖ్యం. విశ్వసించగలిగావా నామాటలు!

కాని నీ జీవితమార్గంలో నేను సోపానమా- అవసరమా- నాకూ భాగమున్నదా?

అనుగ్రహం.

లేదా, దారి నడుస్తాను నా వృత్తరీయంతో ఆనందంగా!

అన్నీ కలలు, కలలు, మధురమైన కలలు.

కాని అర్థరాత్రివేళల ఆ కలలే, చచ్చిపోయిన ఆ కలలే దిగులుతో మూలుగుతో మూగి నన్ను రాత్రులు రాత్రిలిట్లా పలకరించి వేధిస్తాయి

కానీ ఇట్లాంటి హృదయంతో నరాలతో జన్మించినందుకు శిక్ష! పంజరాల తలుపు కడ్డీలతో పెనుగులాడిన గాయాల బాధ! బేలగా దీనంగా చూసిన నేత్ర దృష్టుల్ని నమ్మి హృదయాన్ని ముక్కలు చేసి అర్పించిన వెర్రితనం!

అనుభవింతవద్దా, మూర్ఖత్వాల ఫలితం!

నిరంతర జన్మాల్లో నమ్మి మీకే యింత అవిశ్వాసమా? అంటున్నాను.

నీకు విశ్వాసమివ్వలేని లోపం నాది. భీరుత్వం నీది అనుకోకు. నా కింకా తపస్సు అవసరం.

ఏమైపోయినాయి మన జీవితాలు చి--!

ఇట్లా రూపొందిస్తోవుండగానే, అనుకోకుండానే, కళ్లముందే, పాయింటో మెరిసింది. సముద్రం ఘోష పెడుతోంది కొత్తదయాలలో. ఈ నీటిమీద దూకే తెల్లని పిట్టలు! గూళ్లెక్కడో! గుడ్లెక్కడో! వాటితో సంభాషించ గలిగితే! ఇందాక పక్కన కూచుని కాళీని నిదానంగా చూసే ముసలి బల్లివాడితో ఏం మాట్లాడాలో తోచలేదు నాకు, తోడి మానవుడితో!_ యింక యీ పక్షులతోనా!

తొక్కుళ్లీ వెళ్ళాలి మెల్లిగా యింటికెళ్ళు. ఈ నిమిషాన సుందరమ్మ ఏం చేస్తోందో! రాత్రిళ్ళ కొకసారి నన్ను తలుచుకుంటుంది!

సుందరమ్మా నేనూ కలుసుకోడం, ప్రేమించడం ఎట్లా కటసపడాయి? ఎందుకు పిరికిలలు కన్నాము? మా భవిష్యత్తునుగురించి ఒకరితో ఒకరం ఆ విషయమై మాట్లాడేగల ధైర్యమున్నా లేక! విధికీ, కులాలికీ ఎదురీదాలని ఎందుకు సాహసించాం?

ఇందాకనే ఆ దూరం రాతిమీదికి యీదాలని ప్రయత్నించే నన్ను సముద్రపు అలలు పరసగా ఎదురుకొట్టి నవ్వుతో వెనక్కి తోశాయి. పట్టువిడవని నన్ను చూసి కోపగించి, పోర్లించి, అడుగున యీడ్చి గాయం చేసి ఒడ్డున పారేశాయి. అంతే మన యత్నమూ సుందరమ్మా!

అప్పుడింత జ్ఞానంలేదు, ఆ నూతన బాల యవ్వనంలో లోకాన్ని జయిస్తామనే విశ్వాసం, సాధించలేనిది లేదనే ధైర్యం రక్తంలో పొంగేవి. కాని యీనాడు మాత్రం? నా ఈ విషయంలో ఏముంది నా విశేషం? లాభం లేదనుకుంటాను యీ జన్మకి! పాపం చచ్చిపోయిన మిత్రుడు విశ్వనాథం "ముళ్ళ మధ్య గులాబిపువ్వు ఎందుకు రమ్యా చేతులు కోస్తావు? యెట్లా కంత కనపట్టం లేదూ? పువ్వు నీకు, ముళ్ళు గుచ్చుకోడమే అనుభవిస్తుంటావు. కాని అయినప్పటికీ నీ దగ్గరికి వొచ్చే ప్రయత్నంలో ఆ పువ్వు ఆ ముళ్ళల్లో గిసుకుని రేకులు నాశనమై పోతుంది" అనేవాడు.

విశ్వనాథం - ఎందుకు చచ్చిపోయినాట్లు? ఏమయినాట్లు కత నాకు? గొప్ప త్యాగాలూ, virtues, ధర్మాలూ, ఇవన్నీ ఆనేక లేవి

తాల్లో గుర్తించి ప్రకటించి శాశ్వతంగా లిఖింపబడింది. లోకం! కాని వాళ్ళందరూ ప్రపంచం కళ్ళముందు కుమతకెక్కినవాళ్ళు. సహజంగా రక్తంలోవున్న nobility వల్ల నీచత్వానికి దాసత్వానికి లోబడ నిరాకరించి సహించిన నీలాంటి జీవితాలసంగతి రోజుకు గుర్తొ స్తాయి? నువ్వా! ఏమయిపోయావో నాకు తెలీదు. తెలుసుకునే వాళ్ళే తెలీదు. నేనా? విశ్వనాథం! ఇంకా ముళ్ళల్లో గులాబి పువ్వులకోసం చేతులు జాస్తున్నాను. పువ్వులకి కలిగే అపాయం సంగతి తలు చుకోక!

ఛి.. నీకూ తెలుసు, నాకూ తెలుసు, చుట్టూ పొదల్లో గాయ పడతానని. పసిదానివి నీకు తెలీకపోవచ్చు. కాని నాకు? మోహ మాయ అంత గొప్పతెర కప్పుతుంది మన జ్ఞానచక్షువులమీద నేనెదో నీ గాయాల్ని నా రసికత్వంతో, మాన్పలేనా అని నమ్మిక పడతాను. కాని... కొన్ని గాయాలు మానవు. ఛి.. మరిచిపో నన్ను.

సుందరమ్మవలె నువ్వూ నాలుగేళ్ళలో మధురమైన జ్ఞాపకంగా మారతావు. ఈ నాడు ప్రతినిమిషం నా కళ్ళయెదట నిలిచి, నావంక నిదానంగా చూసి విరహం రేపి కాల్చే నువ్వు? ఎందుకు నామీద అంతకోపం నీకు? ఒక్కనిమిషం విశ్రాంతి నివ్వక నన్ను వెంబడించి యిట్లా accuse చేసి వదలక వేధించడం ఎందుకు? కాని యిది బల హీనులైన స్త్రీలు తరతరాలనించి నేర్చుకున్న trick మోహించి నందుకూ మోహించనందుకూ కూడా మొగవాణ్ణి నిందించడం.

నువ్వూ! నువ్వుకూడా విశ్వనాథంవలె సుందరమ్మవలె జ్ఞాప కంగా మారిపోతావా? కాని అంతకన్న యేముంది? ఈ ప్రపంచమే ఒక జ్ఞాపకం. ఈ విమానం పేరు చెప్తే K. O. దే పాటలు, రాధా మనోహరి, పుష్పపరిమళం కూడిన దివ్యతేజస్సు అన్నీ అన్నీ దే ఇప్పుడు అనే కాలంలోంచి వృత్త జ్ఞాపకాలైపోతున్నాయి.

ఈ ఆనందమేమిటి, యీ జ్ఞానం స్వభావమేమిటి, అనే ప్రశ్న లలోకి వెళ్ళానా, వరాలు లాక్కుపోయి అలిసిపోతాను. వద్దు. అది యేనాడో యిట్లాగే అర్థమవుతాయి గావును. ఈలోపుల నీ కళ్ళ ల్లోకి చూసి — ఆకాశంవంటి నీ కళ్ళల్లోకి చూడనీ.

సుందరమ్మా! ఇంక మన స్నేహం అసంభవమని రూఢీపడ్డ ఆ రాత్రి హైవాదీ కింద కొత్తపందిట్లో నువ్వు చూచిన చూపు యిందులో యీ సముద్రంమీద అర్ధరాత్రి అర్ధచంద్రుడుదయించినట్లు డల్లా జ్ఞాపకం వొస్తుంది. సంవత్సరమంతా నిన్ను మరిచినా అట్లాంటి రాత్రి తెల్లారకట్ట పిల్లలు కేకలు వేసే సమయాన నా పక్కలో వొచ్చి కూచుని,

"మరిచిపోయినావా?" అని జాలిగా పలకరిస్తావు.

ఈ విశాల ప్రపంచంలో అనంతాకాశం విశాల సముద్రం ఎడ తెగని యీ యిసిక బయలు వెనక యీ తుప్పలు - వీటి అన్నిటిలోనూ నా శరీరంలో మాత్రమే "నేను" అనే భావం. నేను యేమిటి? ఇదంతా యేమిటి? అనుకోవడం, ఆ దేనా భేదం? ఈ 'నేను' లేకపోతే నేనూ ఒక రాయినే, నిద్రిపోయ్యే ఒక యిసుక రేణువునే. సూర్యు డిలో మెరుస్తాను, వెన్నెట్లో తళతళ మంటాను.- నాకేమీ తెలీదు. ఆనందిస్తున్నాననే భావం వుండదు...ఎందుకో యీ వేదాంతంలో పడగానే మాటలకి తడుముకుంటాను......... నీళ్ళలో కనపడని చాపలకి నా చుట్టూ సాయంత్రిపు గాలిలో కత్తిరిత్తి చూసే పిట్టలకి, "నేను" అనే భావం వుందేమో! దీని అంతటినించీ భిన్నమూ నేను? ఆనందిస్తున్నాను యీ చుట్టూవున్నదాన్ని! ఆ దినాన్నించి వేరు అనే భావం ఎట్లా యేర్పడ్డదో! దానిలోనించేకదా నేనిట్లా వేరుపడ్డది! వేరుపడ్డానా, లేక వేరు పడ్డానని అనుకుంటున్నానా?

కాని యీ చుట్టూ నిద్రపోతున్న ప్రపంచం...కాని నిద్రి పోతోందా? దొర్లే అలలు, వీసే గాలి, అలలమీద రత్నాలకింద ముక్కలయ్యే యీ అస్తమయ కిరణాలు, వెనకగా సముద్రాన్ని వనుత్రగామార్పే ఆ పెద్దమేఘం యివన్నీ నిద్రపోతున్నాయా? ఆ మేలుకున్నాయనే భావం నా హృదయంలో నేనా?

ఒకవేళ నావలెనే నా చుట్టూవున్న ఆకాశం "నేను" అంటోందేమో! అనగలదేమో! నావలెనే "నన్ను" అనేది మరచి నిద్రిపోతుందేమో! ఆ సూర్యుడు "చూస్తున్నాను" "కాల్తుంది"

ఇట్లాంటి భావాన్ని పొందగలదేమో! వీటినన్నిటినీ కలిపే ఒక హృదయం స్పందించానికంతా కలిపి "నేను" అనేది వుందేమో! నా హృదయంలోని "నేను" అనే శబ్దం ఆ విశ్వఆత్మ ప్రతిధ్వనేనేమో! ఆ విశాల ఆహం, ప్రతిచోటా ప్రతి అణువులోనూ యిట్లా ధ్వనిస్తుందేమో, హృదయంలో రక్తప్రసరణ ఘాతం, ప్రతి నాడిలోనూ వినబడటు!

ఈ సముద్రం నేను రాగానే నన్ను గుర్తుపట్టి ఆహ్వానిస్తుందా? 'నిన్ను చూస్తున్నాను' అంటుందా, అనుకుంటుందా? ఈవాళ నీలంగా వున్నావేం సముద్రమా అని నే నన్నట్టు, యీ సముద్రం నన్ను చూసి "ఎంత బావున్నా"వని కళ్ళలో మెరుగు చూపుతుందా, నా చిన్ని చిన్ని చి___వలె. అదేనేమో జీవబ్రహ్మల సంయోగమంటే. ఆ సముద్రం "నీ రాక నాకెంత ఆనందం" అనడం వినగలిగితే చి___చూపులో శబ్దాలు నేను విన్నట్లు. Light ని Sound గా మార్చడానికి టాకీ యంత్రాలెందుకు, నా హృదయం చాలదూ? ఒక్క నా చి___లోనే గాక ప్రతి స్థలంలో సృష్టిలో నన్ను చూసి గుర్తించి ఆహ్వానించే ఆనందం నేను తెలుసుకో గలిగితే యింక మనుషులెందుకు నాకు?

కాని వుంది ఆ ఆనందం. లేకపోతే నాకీ ఆనందం కలగదు. నన్ను చూసి ఆనందపడని జడురాలివించి నాకేం ఆనందం కలుగుతుంది? ఈ ప్రపంచమే నా ప్రియురాలు. ఘోరరాత్రి ఆమె శిరోజం, యీ కిరణాలే ఆమె హస్తాలు, యీ పొంగే అలలే ఆమె వక్షం, యీ ఇసిక ఆమె తొడలు—ప్రపంచమే నా ప్రియురాలు.

చి___ని చూసినకొద్దీ ఆమెలో నాకీ ప్రపంచ సౌందర్యం కనిపిస్తోంది. ప్రపంచ సౌందర్యంలో ఆమె కనబడుతుంది. ఇట్లా రెండు రూపాలూ కలిసిపోకూడదా? అప్పుడు ఆమె సంసారమూ నీతి నిబంధనలూ, లోకమూ, ఆమె విచారమూ ఏమీ వుండవు, అంటవు. ఇంక ఆమెని నేను ప్రత్యేక అన్యగా, దాహంతో కోరనక్కరేదు. మోహమునే తాదాత్మ్యాన్నించి విముక్తి కలుగుతుంది, కాని ఆ ముక్తి! ఆమెలో? ఇంత సౌఖ్యం యింక కావాలా, యింక ప్రేమ,

ఆమె హృదయంలోనూ వుందా? వుందనుకునే నా హృదయంలో నేనా? పిచ్చివాడి మనసులోవున్న మహారాజ్య పదవుల్లాగు. అట్లా చూస్తే పిచ్చివాడికీ, సాధారణుడికీ మాత్రం ఏం భేదం? మనదీ imagination అతనికి అంతే. ఇంకొంచెం దూరం పోయింది.

ఇట్లా లేనిబాధలు నేను ప్రేమించిన స్త్రీలు నా కోసం పడుతున్నారని ఊహించుకుని ఎన్ని అపాయాల్లోకి నడిచాను, వేదనలతో గడిపాను అర్ధరాత్రులు!

మొదట చి—లత కళ్ళతో చెప్పింది నాకు యీ విశ్వప్రేమ విషయమై. సాధారణ ప్రేమవాక్యాలు నా నాలిక చివరికి వచ్చాయి. ఇన్ని నెలలనించి నిన్ను ఆరాధిస్తున్నాను అనబోయినాను.

కాని ఆమె నన్ను నిరాకరిస్తే? ఇంకేమి? అదికాదు నా వుద్దేశ్యం అంటే? ఇంక ఆమెనిచూసే భాగ్యంకూడా తప్పిపోతుంది. ఆ కంఠంలో, ఆ వాక్యాల్లో (ఆమె రోజూ కొత్తగా ప్రారంభిస్తుంది వాక్యాల్ని) ఆ అందంవినే భాగ్యంకూడా పోతుంది.

అంతకన్నా భయం— నన్ను, నా ప్రేమని అంగీకరిస్తే— నా కలే బద్దలైపోతుంది. సాధారణ ప్రియురాళ్ళవలె నన్ను ఆవ్హానిస్తే! నా బుజంమీద తలవానించి నా ముఖంవంక ఆ నేత్రాలతో చూస్తే! నా కలంతా చిటాపంచలవుతుంది. ఎంతో అందమూ ఆకర్షణా అనుభవం. కాని ఆశయాలతో కలలు కన్న నా హృదయం ఏడుస్తుంది. వీల్లేదు. ఆమె నావంటి క్షుద్రుల్ని అంగీకరించకూడదు. సాధారణ మోహానికి ఆమె దిగకూడదు. నాకు విశ్వప్రేమని అందవ్వాలి. చి—లో కంటికి కనపడే ఆ అసాధారణ సౌందర్యానికి కారణమైన ఆ మధుర శరీరంలో, పువ్వుల మందహాసంతో ఆ విశాల నేత్రాంతాల్లో అద్భుతమైన ఆత్మవుందని విశ్వసించి ఆమెని కోరాను. లేదాన్ని ప్రేమించాను, ఆత్మని ఆరాధించాను.

"నన్ను ప్రేమించావు" అనగానే చేతులుజాస్తే, యువతులకు ఎంతమందో స్త్రీలు లేనిసట్లు!...

వీల్లేదు.

నావంటి సాధారణుణ్ణి అంగీకరించిందా! ఎంత సాధారణు రాలు! అనుకుంటాను.

నిరాకరించిందా? ఎంత క్రూరురాలు, అని కోపగించు కుంటాను, ఇంక ఆమె నెట్లా చూడనని సిగ్గుపడతాను.

విచిత్రం మానవహృదయం!

నా ఆరాధన దృష్టుల్ని అంతర్ముఖం చేసుకుని మానం ధ్యానదశకు ప్రశాంతం. కాని నా యీ శరీరం, యీ రక్తం, పూరుకుంటుందా? ఏనాడో నా ఆత్మ ఆజ్ఞలనించి తెంచుకుని ఆమె మీదికి ఉరుకుతుంది, చీలుస్తుంది, పీలుస్తుంది, తినేస్తుంది, చంపేస్తుంది — అను కున్నాను ఆనాడు.

నేను చూసే చి—లో లావణ్యమంతా నిజంగా చి—లో వుందా? లేక సాధారణ బాలికలో యీ ఆరాధనవంతా నేనే కల్పించుకున్నానా? ఏమైతేనేం? మోపస్సా అన్నట్టు సమస్తమూ, మన ప్రేమ అంతా ఆత్మకల్పితం subjective. నా sublimation కి చి— సౌందర్యం ఆధారం. "నేను, నేను,—నేను" అంతా నేను. ఇంకేం లేదు. చి—, యీ సముద్రం, ఆకాశం, యీ లోకం— అంతా నేనే. నేనే వున్నాను అంతే ఇంకేం లేదు. వుంటేనేం? అదంతా నేనే! ఎంత ఆనందాన్నిస్తోంది ఆ ధ్యానం! భయాలు, బాధలు, మరణం—అన్నీ నేనే!

ఇంత సౌందర్యాన్ని కల్పించుకో గలిగిన నా మనస్సు, యింత ఆనందాన్ని కల్పించుకో గలిగిన నా హృదయం చి—అనే వ్యక్తి లేకుండానే కల్పించుకో లేదా యీ ఆనందాన్నంతా! ఆ శక్తి కలుగుతుందా? వుత్త భ్రమా?

విమల బోర్డింగు దగ్గర యేటివొడ్డున కొంచెం రాత్రి కాగానే మిణుగురు పురుగులు తీగెలు తీగెలుగా కాంతి చెట్లఆకుల్లో అల్లుకుంటూ, అలంకరిస్తాయి. పుష్పదేవతలు దీపావళి చేసుకుంటున్నారనిపిస్తుంది. ప్రతి పువ్వులోనూ దేవత— ఒక అందమయిన అమ్మాయి వుందని కథలు వ్రాశారు కొందరు. మన దేశంలో సృష్టిశక్తులకి దేవతలు పేర్లు పెట్టినట్టు గ్రీకుదేశంలో సౌందర్యాలన్నిటిలోనూ, దేవతలు నివసిస్తున్నట్టు నమ్మారు. తలుచుకోండి! ఆ చిన్న పువ్వులో ఒకామె పడుకుని వుండటం— ఈ మిణుగురులే దీపాలు- ఆమె వొంటినిండా పుష్పరజం— ఆమె భోజనం తేనె— చెట్టు వూగితే గాలిలో వూగడం. నేను ఆపువ్వుల్లో వున్నట్టు తలుచుకుంటే— ఏదో నేనొకసారి నివసించి దారిమరిచిపోయిన లోకంలాగు జ్ఞాపకంవొచ్చి, బాధిస్తుంది. ఈ కలఅంతా నిజమేనేమో! ఈ నిజమంతా కలకాగాలేనిది ఆ కల నిజం కాకూడదూ!

మెల్లిగా అర్ధచంద్రుడు- ఎక్కడున్నాడో నీళ్ళలో నవ్వుతో- ఏటిని చక్కిలిగింతలు పెట్టడం ప్రారంభిస్తాడు; విమల తోట యేటిలో ప్రతిఫలించింది.

"ఏటి కడుపున దాగి
తోట నిదరోయింది"

ఒకరోజున సుబ్బారావుగారిని తీసుకొచ్చాను, యీ అందం చూపడానికని— ఆయన హృదయం యెంత కలవరపడ్డదంటే— ఎంత ప్లీడరయినా, ఎంత చీట్లపేకమీద ప్రేమవున్నా, కవి కదా— అందులో నిజమయిన కవి!- వెంటనే నా ముందు పాట వ్రాశారు.

Red hot song in the making.

Watch చేశాను నేను.

"ఊరేయి కన్నోల్ల సేరవా రాజా
దుక్కాలల సాగసంత ఏటిపాలేనటరా."

అనేది. అందువల్లనేమో నాకు ఆ పాటమీద అంత ప్రేమ.

“కలవరపు నాబ్రతుకు
కలత నిదరయ్యింది.”

అంటో వుంటే పాట మధురమైన బాధతో — కుంగదీసే నిద్ర విరహంతో — యీ మామిడి పూల మత్తు పరిమళంవలె - ఆ చంద్రుడి నిద్ర ప్రతిఫలింత వలె — వినబడుతుంది నాకు. ఎంతోపాటల్ని అప్పుడే ఆంధ్రదేశం మరిచిపోయింది. గ్రామఫోనులో చదక చేశారు. కాని వుర్దూలోని ప్రేమ గీతాలవలె — బరన్సు (Burns) స్కాచ్ పద్యాలవలె — పూర్వకాలపు పర్షియన్ కవుల ధీరమయిన కవిత్వంవలె - వైష్ణవ గోపికా గానంవలె ప్రత్యేకమైన విలువ గలిగిన ఆంధ్ర ఐశ్వర్యం యీ పాటలు.

ఆంధ్రాభిమానం ప్రత్యేకించి నాకేం లేకపోయినా, ఆంధ్ర దేశము నారత్నం పిలుస్తున్నా (దీక్షితులుగారూ, వినండి) నేను ఆపాట వ్రాయించి, ఆంధ్రదేశానికి మహోపకారం చేసినట్టు సంతోషించాను. ఆ సంఘటనవల్ల కాకపోతే ఆ పాట యీ విశ్వసౌందర్యంలో భాగమై జన్మ లేకపోయేదేమో! ఆ ప్రత్యేకమైన రాత్రి వసుదేవుడు దేవకిని కోరకపోతే కృష్ణుడు పుట్టేవాడా? ఆ ప్రత్యేకమైన రాత్రి ఏ పాలకోవా తినో గాంధీగారి తండ్రి కామించకు పోతే మన దేశం యింకా చీకట్లో జడుపుతో వుండేది కాదా? ఈ పాట ఎంతమంది యువకుల హృదయాల్ని ఉత్సాహింప చేస్తుందో! నా మూలాన కవి హృదయంలో [illegible]! ఆ పాట ఆయన కవిజీవితానికి (Swan song) స్వాన్ సాంగ్ అనుకుంటాను. అది నా గర్వం.

“[illegible] నాకేల పోకూడని సుఖము”

అన్న పాదాన్ని కల్పించిన కవిహృదయం ఎంతమంది విరహి జనుల యుగయుగాల అశ్రువుల్ని తనహృదయంలో ధరించి తప్పించక పోతే కల్పించగలదూ ఆ శబ్దాల్లోని ఆ అగ్నిని! నేను చూసిన కళ్ళు అని చూసి పోవాలని సుఖముకొంద ఆ కవిహృదయం ఎంత వేదన లాభపోతే మాన్యపాదం ఆ మూలంగ పైటికి వొస్తుంది.

నేనే పిలువడం రాకపోతే ఆ సన్నని కొవ్వొత్తుల కాంతి బూజుగుడ్డలో దీపం పెట్టుకుని ఏదో "కథలు" అని అన్నట్లు చీట్లాట ఆడుతో వుండే వాడు యీ మహాకవి! "మనదేశంలోని కుండేలు" అని అన్నా, అరవ కూతలా! అనుకునేవాణ్ణి. ఎప్పుడూ ఆ పాడుముక్కల ముక్కల్ని [illegible] కాలబడగట్టి తడుగుతో, నా కవిత్వ, వినదానికి? అని అనేవో!

కథలు వ్రాసేవాణ్ణి నేను, ఆ కవిని సందర్భవశాత్తూ పిలువ లేకపోయిన పాయింతో. ఇట్లాంటివి యదార్థపు కథల్ని గురించి [illegible] ఆలోచిస్తాను, ఆశ్చర్యపోతాను! ఈ దేశంలో కవినని చెప్పు కోడమే సిగ్గుగా వుండగా ప్రదర్శిస్తుంటే, కవులం కాస్తున్నాకంటే ఎట్లా దాక్కుందామా అనే ధ్యానమే కలిగించకపోతే, [illegible] రాకపోతే, యీ ఆంధ్రదేశంలో కవి అనేదే పూర్తిగా కల్పితమైతే కవులంత (కథలలో నేనూ కూడా కలుపుకుని) గవ్వలంత కాకపోతే, ఒకడు కాకపోతే ఒకడైనా తన కథల్ని [illegible] కొనిపించుకుని వుంటే, [illegible] సంఘటనలూ, మార్గాలూ, [illegible] ప్రపంచం [illegible] కాని ఆ [illegible] [illegible] [illegible] [illegible]. ఆ [illegible] [illegible]. కాని [illegible], [illegible] భాగ్యవంతం, ఆ [illegible] [illegible] పెద్ద పుస్తకాలు [illegible] — ఆ [illegible], [illegible] [illegible] [illegible], [illegible] [illegible], [illegible] [illegible] [illegible] ఆ [illegible] [illegible], [illegible] [illegible], [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ఏదో [illegible] చెప్పలని [illegible] "[illegible] [illegible] [illegible] [illegible]" అని [illegible] [illegible]?

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]! [illegible] [illegible] [illegible] సంగీత [illegible], [illegible] [illegible], [illegible] [illegible] [illegible] — [illegible] — ఏ [illegible] [illegible] [illegible] [illegible] — [illegible], [illegible] [illegible]

యీర్ష్య, ఈ పేచీ వీటిల్లో యేది కారణమో? ఈ కవిని గాయిగోళ కష్టాలమన్య మృత్యువుకి పెట్టింది, యీ కోవెల గొంతు నొక్కేసింది.

"ఈ సుబ్బారావుని, మన మెరిగిన ప్లీడరు సుబ్బారావుని యెంత గొప్పచేసి వ్రాస్తున్నాడు!" అంటారు మిత్రులు. కాని ఆయన కవిత్వంలో పదోవంతు మాధుర్యంలేని ఇంగ్లీషు కవుల కావ్యాల్ని గురించి "ఆహా ఓహో" అనుకుంటో చదివిన వారు ఇంగ్లీషువాళ్లు "కీట్సు"ని వంటి రని షెల్లీ అందంగా పాడితే కంతకా కల్లన వేసినవారే యీ మాట లానేది!

కాని ప్రతిరోజూ కనబడేవాణ్ణి వక్కాణించి ఈ పేచీ చేసినా గాయపడ్డానికి ఒతిక్కివున్న హృదయంకలవాణ్ణి కోమలవాణ్ణి ఘనుడు, ఉత్తముడు అంటే నమ్మడం ఎంతకష్టం. మనుషుల ఆత్మలకి సెల్ఫుకి (Self) కి ఎంత గాయం! ఇంగ్లీషు అతనుకాదు, ఇంగ్లీషువాళ్ళ చేత గౌరవాన్ని పొందలేదు, చివరికి బెంగాలీ అతనన్నా కాదు, హిందీలోకి తర్జుమా కాలేదు, సారస్వత ఆచార్య కాళ్ళు పట్టలేదు, జమిందారు కాడు, జరీ టోపీలేదు. సంస్కృత సమాసాలులేవు, పండితుడు కాడు, అర్థంకాని చిక్కులులేవు — యీ సులభ పరిచయుడు యీ సుబ్బారావు సాధారణపదాల కవిత్వంలో గొప్పతనం పొడ్పకోడం ఎంతకష్టం?

కవిత్వం, సౌందర్యం, ప్రేమ — ఇటువంటి విలువలు యీనాటి మనుషుల మనసుల్లో లేవు. కొన్నాళ్ళయినా కొందరు ఘనత కోసం నటిస్తారు. ఆస్తి, పిల్లలు, గొడ్లు, భూములు, చీరలు, ఇళ్ళు ఇవే నిజమైన విలువలు వాళ్ళకి. అవి కాని విలువలు ఉన్నాయని గట్టిగా అనేవాడు, తన ఆస్తి వ్యక్తి అభ్యుదయాన్ని ప్రకటించేవాడు, తమలపరాణివాడు. తమతో competition కి రాలేదాలని, [illegible] పంచమని అడగలేదాలని, తమ ప్రాముఖ్యతని [illegible] ధైర్యంతో, చప్పిన artists [illegible] అలా కారు. ఆ కవుల్ని కాదు మెచ్చుకుంటే, తమ ఘనత [illegible] ప్రాసేవాణ్ణి [illegible] గౌరవం [illegible]

మర్యాదస్తుల్ని వొదలక ఏడిపించే కవులు లేకపోలేదు. వాళ్ల పేర్లు ఎన్నటికీ బైటికి రావు. కాని పాలం మనుషుల్ని, వాళ్ల మోటు మాటలతో, ఆవు వాసనలతో, మట్టితో, వాంఛలతో, లోపాలతో, తీసుకొచ్చి, శృంగార మూర్తులను చేసి, వారి హృదయ ఔన్నత్యం ముందు, వాళ్ల శృంగార తేజస్సుముందు - పిరికివీగే మీరందరూ, మీ భార్యలు, పతివ్రతలు, అల్పులు క్షుద్రులు అంటే! ప్రేమ, శృంగారం ఉన్నాయనీ, వాంఛనీయమనీ, మరిచిపోవడానికి రోజూ తంటాలుపడే, యీ ఆస్తి కొక్కులు, హక్కుల కొక్కులు, ఆ కవిని, బతికివున్న వాణ్ణి, గొప్పచేస్తే భరించగలరా? వ్రాయడం ఆపాడనీ, ఇంక వ్రాయనని పూచీనిచ్చాడనీ, కవిత్వాన్ని తలగుడ్డలో ఇరికించాడనీ, మండే హృదయాన్ని లాంకోటుకింద కప్పాడనీ, తమవంటి ప్లీడరై నాడనీ, పిచ్చివేషాలు వొదిలాడనీ, మర్యాదస్తుల గుంపులో చేరాడనీ, నిశ్చయమైనాక కద ప్రజలు సుబ్బారావుని క్షమించింది? అట్లా కాలేదనేకద, కృష్ణశాస్త్రిని ఇంకా పూర్తిగా క్షమించి మన్ననచెయ్యంది! దొక్కు సన్మానాలతో అగౌరవ పరిచింది! శాస్త్రిగారూ, ఊర్వశీ గాఢాలింగన ప్రవాసీ, వెలితిమనుషుల వెకిలి సన్మానాలలో సంతుష్టిని వెతికారా!

కవిత్వానికీ జీవితానికీ యేమిటి సంబంధమని ఎన్నేళ్లమట్టో తర్కం. ఉన్నదని కొన్నాళ్లు, లేదని కొన్నాళ్ళూ! నాలో చూసుకుంటే నా జీవితానికీ, నా వ్రాతలకీ, ఎంతో కలియక కనబడుతుంది నాకు. నాతో నావ్రాత మారుతోంది. నా కలలు, నా ప్రేమలు, నా ఆశలు, నా నిరాశలూ, అన్నిటినీ పాడుతుంది - నా కలం. ఒకప్పుడు శ్రావ్యంగా, ఒకప్పుడు కఠోరంగా! కాని నా మిత్రులలో గొప్పకవిత్వం వ్రాశేవారి జీవితాలకీ ఆ కవిత్వం ఆశయాలకీ సంబంధం కనబడదు నాకు. వారికి కనబడుతుందనుకుంటాను; ఎవరికి వారికి. ఏమి వ్రాస్తేనేం? వ్రాతలు వెనక్కి చూస్తేనేం, లేక ప్రస్తుతం ప్రతిఫలిస్తేనేం? హృదయంలోంచి వొచ్చిందా? వృత్త చమత్కారమా? అనేదే ముఖ్యం. జీవితం వ్రాతలకి అనుగుణ్యంగా వుందా? లేకపోతే యీ వ్రాతలు వృత్తపై మెరుగా? జీవితం అను

గుణ్యంగా వుండనక్కరలేదా? ఒక రన్నట్లు వ్రాతలు - ఒక మూడ్ (Mood) లేక Highest moments of inspiration ఇన్‌స్పిరేషనా? తక్కిన జీవితం అధమమైనా, ఏ పూర్వసంస్కారాన్నించో ఉత్తమ కావ్యం కలగవచ్చా! ఏ రసికత్వమూ లేనివాడు ప్రేమకావ్యాలూ, ఏ ధీరత్వమూ లేనివాడు ఆదర్శకీర్తనలూ, అల్పాత్ముడు ఉత్తమ ఉత్సాహాలూ కల్పించగలరా? ఏ మంత్రి పెళ్ళిసమయమో వచ్చేటప్పటికి ఒకకవి డోలూ, ఒక కవి బూరావూది కూడా దేశాన్ని నూతన ప్రపంచాలకి ఉదార ఆశయాలకి స్వేచ్ఛావీధులకి రక్తస్రావాలకి ఆకాశ విహారాలకి ఆంధ్రిపౌరుషాలకి పురిగొల్పగల శక్తుల్ని కలిగి వుండగలడా? ఇదీ నా సమస్య!

ఎందుకంటే మృతకవుల జీవితాలు, నిజమైన కవులవి పరిశీలిస్తే; ఏదో గొప్ప "స్ట్రిగుల్" ఒక తిరగబాటు, జీవితంలోనే ఒక ఆదర్శ ప్రయత్నం ఇట్లాంటివి కనబడతాయి. శ్రీనాథుడూ పోతన్నా తీసుకోండి; కీట్సు, షెల్లీ, బైరన్, వర్డ్సువర్తు, బ్రౌనింగ్, D. H. Laurance, మొదలైన వాళ్ళని వొదిలి. పోతన్నకన్న శ్రీనాథుడు నూరురెట్లు ఎక్కువ చక్కగా వ్రాస్తాడు. కాని ఆత్మ సంతుష్టికీ,- భక్తిసంగతి మాట్లాడటంలేదు - ఆత్మప్రోత్సాహానికి పోతన్న పలకవలిసిందే!

కవిత్వానికీ (కవిత్వమంటే వ్రాతలన్నీ) కవికీ, దీపానికీ కాంతికీ వున్న సంబంధం అనుకుంటాను. అన్ని తేజస్సులూ, వికారాలూ, మాలిన్యాలూ, దీపంలో వున్నవన్నీ కాంతిలో కనబడతాయి నిర్మల దృష్టి కలవాళ్ళకి. కవిత్వమేకాదు, అద్భుతమైన కంఠమూ, మంచి చాతుర్యమూ విద్యా కలిగికూడా ఆత్మలోకి పలకలేని కవులూ గాయకులెందరో యీ ఆంధ్రిదేశంలో! పేర్లు చెప్పానా సంగీతం తెలీదనీ, ఆంధ్రాభిమానం లేదనీ అంటారు. ఆత్మతో మాట్లాడగల శక్తి కావాలంటే వ్రాతలోంచి గాని పటాల్లోంచిగాని సంగీతం లోంచిగాని అసలు "సోర్సు"లో జన్మస్థానంలో ముందు ఆత్మ మాధుర్యం వుండాలి. కళలకైనా ఆత్మ విద్యే ప్రధానమేమో! ఎందుకంటే ఏమిచేసినా, ఏమి వ్రాసినా, ఏమిపాడినా, ఆత్మను

గవంనించి ఎట్లా తప్పించుకోగలరు? ఎంత గొప్పగా పాడగలిగినా త్యాగరాజు కీర్తనని నాబోటివాడు యితరులలోకి ప్రసరింపగలడా రామభక్తి గలవాడు కాని? ఆ Emotion తెచ్చుకోగలవారు, రంగం మీది నటకుడివలె తెచ్చుకోగలవారున్నారు. ఏ షేక్స్పియరో తప్ప తన అనుభవాన్ని మీరి యితర పాత్రల్ని తాను యెరిగినట్టే చిత్రించగల జీనియసులు అరుదు. నేను ఎక్కడన్నా స్త్రీ పాత్రని స్వభావ సిద్ధంగా చిత్రించినా అట్లాంటి స్త్రీని ఎరుగుదును గనక ఆమెతో బాధలు పంచుకున్నాను గనక. కాని ఎవరో అసామాన్య ప్రతిభావంతులు గొప్ప జీనియసులు స్త్రీతో పరిచయం లేకండానే స్త్రీ హృదయాన్ని గురించి అద్భుతంగా వ్రాయవచ్చు. అది Inspiration కావొచ్చు లేక తన ఆత్మతో విశ్వం ఆత్మని అందుకోడంవల్ల కావొచ్చు, లేక పూర్వజన్మ సంస్కారంవల్ల కావొచ్చు. ఏదో అన్నీనో లేక అన్నీ వొకటేనో నాకు తెలీదు. జీనియసుల్ని అట్లావుంచి సామాన్య చిత్రకారులు అనుభవంమీదనే తమ జీవిత నిర్ణయాలమీదనే ఆధారపడాలి, రసజ్ఞానంకోసం. అందువల్లనే జీవితానికీ కళకీ సంబంధం తప్పదు. జీవితాన్ని మీరి వ్రాయగలవారు యుగపురుషులు. నా సోదర కవులు తాము యుగకారకులమంటే నేను మాత్రం కానని మాత్రమే అనగలను.

జీవితమంటేనే Struggle. ప్రతి పదార్థమూ ఉన్నతదశని పొందాలని పెనుగులాడుతో వుంటుంది. అణువు సగ్గర్భించి గడ్డినించి అన్ని జీవులూ క్రమంగా ఇంద్రియాలలో బుద్ధిలో పరిణామాల్ని పొందుతున్నాయి. మానవ జాతిలోకూడా అడివి మనిషినించి వృద్ధిపొంది బలం బుద్ధి ఆత్మ వికసింపచేసుకోడానికని నిరంతర ప్రయత్నంలో వున్నారు. ఈ inner propulsion వల్లనే మానవులు ధనంమీద, స్త్రీలమీద, కళల మీద ఆశపడి తృప్తి పొందాలని చూస్తారు. ఎవరిలో యీ బాధ యీ Struggle ఆగిపోతుందో వారు నిర్జీవులు. ఈ ప్రయత్నబలం యెక్కువగా కలవారిలో కొందరు తమ అనుభవాన్ని కళారూపాన్ని వెలువరిస్తారు. పాడాలనే పోద్బలం వొక్కటి analyse చేసి

చూచుకున్నా అర్థమౌతుంది యీ విషయం. కనక వున్నతమైన కళ యెప్పుడూ మానవుడు ఔన్నత్యాన్ని అందుకోవాలని చేసే ప్రయత్నాన్ని ప్రతి ఫలిస్తుంది. అందువల్లనే జీవితంతో సంబంధం కలిగివుంటుంది. ఎప్పుడూ మార్పును సూచిస్తుంది. ఎందుకంటే జీవితమంటే ప్రవాహం, ఎప్పుడూ మారే స్వభావం కలదిగనక. జీవన శక్తి అదే. సృష్టిశక్తి, యెక్కువగా వున్నవాడు గాని ఇతరుడు గొప్ప కళాశక్తిగలవాడు కాలేడు. అందువల్లనే నేమో స్త్రీ శక్తి యెప్పుడూ ప్రోత్సహించే శక్తిగానే వుంటుంది. acheive చేసేది పురుషశక్తి ఇంతవరకు తమ స్వార్థంగాకాక యితరంగా యేదో ఒక cause ('కాజ్') తనదిగా చేసుకొని ప్రయత్నించనివాడు వ్రాయవచ్చు గంపెడు పుస్తకాలు - కాని కళా వాతావరణంలో వాటికి చాలా తక్కువ విలువ వుంటుంది. తమ జీవితాల్ని అంటక, కళకి ఎదో విషయం కావాలికదా అని తెచ్చిపెట్టుకుని వ్రాసేవాగు చాలా మంది. ఆ కారణంవల్లనే సుఖమైన పెళ్ళి, చక్కని వుద్యోగం, మర్యాదా, అధికారమూ - చాలామంది ఆంధ్రకళాకాలులకి ఆత్మ హత్యా కారణాలవుతున్నాయి.

ఈ సూత్రాల్ని పట్టే యేదోవిధంగా వున్న పరిస్థితులకి యెదురీదనివాడు, ఎక్కడో సంఘంతోనో ప్రజలతోనో విరోధం కల్పించుకోనివాడు గొప్పకళను సృష్టించేవాళ్ళు యిదివరకు ప్రచారంలో ఉన్న అభిప్రాయాల్నే మళ్ళీ యేకరువు పెడుతో వుంటారు. మన ప్రబంధకవులూ, ఇంకా యీ నాడు మళ్లీ భారతాలూ, రామాయణాలూ వ్రాసేవారు ఉదహారణాలు. అసలు లోకంలో మెళుకువ చాలామందికి రాదు. వాళ్ళకి వృద్ధి క్షయాలులేవు. వాళ్ళ కళాఅంతే. ఒక సున్నాలో చెప్పిందే చెప్పిందిగా ఒకభావం యిటూ అటూ తిప్పుతో వుంటారు.

రొమెయిన్ రోలెండు క్రిష్టఫర్ లో ఏం రాశాడంటే—

So many men - they have no opinions except in so far as they disapprove of all enthusiastic opinion. But if a man is to be independent, he has to stand alone, and how many men are there, who are capable of that?

How many men are there even amongest the clear-sighted who will dare to break free of the bondage of certain prejudces, certain postulates which cramp and fetter all the men of the same generation? That would mean setting up a wall between themselves and others; on the one hand freedom in the wildeness, on the other, mankind. They do not hesitate. They choose mankind, the herd. The herd is evil-smelling. but it gives warmth. Then those who have chosen pretend to think, what they do not in fact think. It is not very difficult for them. They know so little what they think! "Know thy-self" How could they, those men, who have hardly a *me* to know. In every coll ective belief, religious or social. Very rare are the men who believe, because very rare are the men who are men. Faith is a heroic force, its fire has kindled but very few human hearts.

ఉత్సాహం గలవాళ్ళ అభిప్రాయాలు తప్పనడం తప్ప యింకో అభిప్రాయాలుండవు, చాలామంది మనుషులకి స్వతంత్రింగా యోచించి అనుష్ఠించాలంటే ఏకాకి ఐ నుంచోవలసి వస్తుంది. ఆ శక్తి ఎంత మందికివుంది? బాగా జ్ఞానం కలవారుకూడా ఆచారాల్ని, సామాన్య అభిప్రాయాల్ని యీనాటి సంఘాల్ని సంకెళ్ళువేసి బిగదీసే అబద్ధాలని ఎదిరించగలవా రెందరున్నారు? ఎదిరించారా లోకానికీ తమకీ మధ్య గోడ కట్టుకుంటున్నా రన్న మాటే. ఒకవేపు ఎడారిలో స్వేచ్ఛ, రెండోవేపు మనుష్యజాతి. ఏమీ సంకోచించరు. మనుష్యజాతితో గుంపులో చేరిపోతారు గుంపులో చెడువాసనలు-కాని వెచ్చగా సురక్షితంగా వుంటుంది. ఇట్లా మనుషుల్లో కలిసిపోయి ఎదో గొప్పగా ఆలోచిస్తున్నట్టు సమర్థించుకుంటో నటిస్తారు. నిజం అసలు ఆలోచనా శక్తిగాని ధైర్యంగాని లేదు, ఉన్నట్టు నటించడం సునాయాసం వారికి. వారేమాలోచిస్తున్నారో వారికే తెలీదు. "నిన్ను నువ్వు తెలుసుకో!" ఎట్లా తెలుసుకుంటారు? తెలుసుకోడానికి వాళ్ళకి ఒక నేను అనేది వుంటేగా! ఏ ఆచారంలోనైనా, మతంలోగాని సాంఘికంగాగాని అసలు విశ్వాసం కల

వారు తక్కువ. ఎందుకంటే అసలు మనుషు లనతగ్గవారే తక్కువ గనక. విశ్వాసం చాలా తీవ్రమైన శక్తి. దాని అగ్ని చాలా కొద్ది మనుష్య హృదయాల్నే రగిల్చింది.

నూతనంలో పురాతనంలో దేనిలోనూ విశ్వాసం లేనివాళ్లు పురాతన కావ్యాలుమాత్రం వ్రాయగలరా?

కృష్ణుడి వాస్తవత్వంలో, శ్రీరాముడి దేవత్వంలో నమ్మకం లేనివాళ్ళకి యేమి భక్తి వుంటుంది? భక్తిలేంది పూర్వ కావ్యాలవంటి కావ్యాలు ఎట్లా రాస్తారు? ఆ విశ్వాసం వుందంటారా! ఇంకా యీ నవీన యుగంలో ఆ మూర్ఖత్వాలన్నీ నమ్మేవాళ్లు ఏం సందేశం ఇవ్వ గలరు, ప్రపంచానికి?

ఇంకా యీ వాటికీ మురళీ, గోపికలూ,హనుమంతుడూ, అత్రి మహాముని! వీటిలోనే వేళ్ళాడుతున్నారు. ఇంకేమీ ప్రపంచమే లేనట్టు. యుద్ధాలు వొస్తున్నాయి, క్షామాలు కలుగుతున్నాయి, రాజ్యాలు తల్లక్రిందులవుతున్నాయి. బుద్ధిమంతులు ఎట్లా లోకానికి మంగళం, క్షేమం కలగచేద్దామాఅని శ్రమ పడుతున్నారు ,ఆంధ్ర రచయితలుమాత్రం ప్రణయాలూ, భక్తులూ, తపస్సులూ, పురాతనపు రెడ్లూ, చచ్చిన భోజులు, మా నాన్నగారూ తాతయ్యగారూ, శంకరాచార్లూ, నేను చూసినపిల్లా, ఆ రాత్రి మాయమైన కన్యా, అనుకుంటో కూచున్నారు.

పైగా యీ తుక్కునంతా epoc making శాశ్వత కళగా పూజించమంటారు. అక్షరాలు రానివాడు కూడా ప్రతివాడూ వ్రాసేవాడే! అని వెక్కిరిస్తారు, ధిక్కరిస్తారు.

"ఇది అసమంజసంగా వుంది."

"దీని అర్థం తెలీటంలేదు " అంటే

"నీకేం తెలును, ఏం చదివావు?" అంటారు.

గొప్పకావ్యం వ్రాయాలంటే పదాలుకాదు, సమాసాలుకాదు, వ్యాకరణంకాదు కావలసింది ఆత్మౌన్నత్యం, struggle, rebellion-

ఈ పండితులకి నవీన ప్రపంచ వాఙ్మయంతో ఓనమాలు రావు. పుస్తకాలన్నీ కఠిన పదాలలో నింపి కళ్ళు చెదరగొట్టాలని చూస్తారు. పాత తెలుగు వాఙ్మయము మల్లేనే పుస్తకమంతా కలిపితే నాలుగు కొత్త అభిప్రాయాలు ఉపకరించేవి thought provoking ideas కనపడవు. వూరికే భాషామార్దవంలో భారంతో మూల్గుతాయి గ్రంథాలు - బతకవు, చలించవు, వుద్రేకించవు.



నగలు పెట్టుకుని అందం తెప్పించగల స్త్రీలు చాలా తక్కువ ఆంధ్రదేశంలో. పెట్టుకున్న నగలకీ దేహానికీ సంబంధం వుండదు. నగల అందాన్ని, మనిషి అందాన్ని వేరు వేరుగా చూడాలి. పైగా కడియాలు అందెలు ఆంధ్రదేశపు వనితల కాళ్ళ అందం పూర్తిగా చెడగొట్టాయి. ఎరికలవాళ్ళలో తప్ప యింకెక్కడా అందమైన కాలే చూడలేదు నేను. అర్థ ప్రసిద్ధ ఆంధ్రుణ్ణి, సంస్కారి అనుకునే ఆయన్ని, ఓసారి ప్రశ్నించాను—

"ఈ కడియాల బరువువల్ల కాళ్ళ అందం ఆంధ్రులలో పూర్తిగా నశించింది. కండరాలే లావెక్కిపోయినాయి పిక్కల దగ్గర" అన్నాను. నేను యీతుచ్ఛ భౌతిక సౌందర్యాలకి ఎంత ఎక్కువ విలవ నిస్తానో తెలిసిన ఆ పెద్దమనిషి, కొంచెంగా కళ్ళు తేలేసి—

"సౌందర్యమనేది హృదయంలో వుంది." అన్నాడు.

చాలా ఉన్నతంగా జవాబు చెప్పాననుకున్నాడు. ఆయన భార్యకి కడియాలవల్ల కాళ్ళేకాదు, దేహమంతా లావెక్కిందని అప్పుడు జ్ఞాపకం వొచ్చింది నాకు. అతని కళ్ళకి ఆమెలో అందం కనపడక, హృదయంలోంచి తెచ్చుకున్న సౌందర్యం చూడడం నేర్చుకుని వుంటాడు గావును, పాపం ఆ పెద్దమనిషి.

చాలామంది యింతే. మనం ఒక plane లో మాట్లాడుతూ వుంటే వాళ్ళు యింకో plane లో జవాబు చెప్పి తప్పించుకోవాలనీ, వోడించాలనీ చూస్తారు. అందమంతా హృదయంలో వుడుతుందని తెలీనివాడు లేడు. కాని objective beauty సంగతికద నేను మాట్లాడుతోంది! తుపాకి పేలిస్తే యెన్ని కాకులు మిగిలి వుంటాయనే ప్రశ్న లాగుంది ఆయన జవాబు.

కొందరి స్త్రీల చర్మం నగల మెరుగుని తాగేస్తుంది. కొందరి ఒంటిరంగు నగలకి మెరుగునిచ్చి ద్యోతిఫలింప చేస్తుంది. కొందరి శరీర

కాంతీ, నగలకాంతీ కలిసిపోయి, విడతియ్యలేక ఏకమైన శోభ కలుగుతుంది.

పూర్వోత్తరపు నవ్వు నగలు ధరించికూడా, నామనసు భ్రమింపచేసింది పె—. నా ప్రేమా, నా సానుభూతా లేక నా కళ్ళలోని మెప్పా! ఏది ఆమెని ఆకర్షించగలిగింది? చెప్పదు. ఆమెకే తెలీదేమో! నామాటలసాగను అని చెప్పి నవ్వుతుంది. మూగినైన నా మాటలు! ఆమె Silhoutte ఆమె మెడదగ్గిర్నించి కాలి చిటికినవేలు వరకు వుండే విల్లు వొంపు నన్ను తన్మయుణ్ణిచేసింది. ఆమె తన అరిచేతిమీద తలనానించుకుని పడుకుని మాట్లాడుతూవుంటే, ఆమె వంక చూసి హృదయం ఝల్లుమంటే, చూడలేక కళ్లు తిప్పుకునేవాణ్ణి. ఆమె శరీరాన్ని బుజాల దగ్గిర్నించి చెక్కినట్టుండేది. ఆమె చిరునవ్వు చంపల్ని స్విచ్చి నొక్కినట్టు వెలిగించేది. ఆమె సంసార క్షోభలు ఆమెకో Tragic romance నిచ్చాయి. ఆమె వింత భాష మాటలకో మాధుర్యాన్నిచ్చింది. అనుభవంలేని నా లేతతల, ఆమె వక్షంమీద, మధువును గోలినంత కైపెక్కింది. ప్రౌఢాంగనాలింగనాన్ని ఆకస్మికంగా సంపాయించగలిగిన నేను, ఎక్కడ నడుస్తున్నదీ ఏమిచేస్తున్నదీ ఏమి కాబోతున్నదీ మరిచి పోయినాను. నా చిన్నతనపు మోహాన్ని అరిచేతిలో ఉంచుకుని, చిరునవ్వుతో నిదానంగాచూస్తో, యీ వరాన్ని ఏమి చేసుకుందామా అని యోచిస్తున్నట్టు వుండేది ఆమె వాలకం.

కాని వుత్తరాల్లో వింత అగ్ని కురిపించేది.

ఈ రొమాన్సుల్ని ప్రజలు కేవలం తమాషాలక్రింద pastimes కింద చూస్తారు. "ఇంక లోకంలో అందమైన ఆడవాళ్ళే లేనట్లు యేడుస్తావేంరా?" అంటాడు పంతులు. ప్రతి ప్రేమానుభవాన్ని అతి serious గా తీసుకుని, అదే జీవితానికి మకుటం అనుకున్నట్టు వ్యవహరించే పురుషులు, పురుషుడికి ఆ అభిప్రాయాన్ని కలిగించగలిగిన స్త్రీలు, అరుదు. ఎన్ని Disappointments జరిగినా, యెన్ని అనుభవాన్నులు క్రూరాశ్రువులలో చల్లబడినా, యింకా మోహంలో

విశ్వాసం వదలని అవివేకులు, యీలోక ఐశ్వర్యాలకి పనికిరాని పరి
వ్రాజకులు అరుదు.

స్త్రీ మోహంకన్న వుత్తమమయింది వాంఛనీయమయింది యీ లోకంలో ఏం వుంది? ఆత్మసామ్రాజ్యం—అనేదేవుంటే అది.

లేకపోతే స్త్రీ సామ్రాజ్యం—

ఈ రెండే. ఇంకేమీ లేవు.

వీటిముందు తక్కినవి దుమ్ము. "ఎందుకు బ్రతుకుతున్నావు?" అని ప్రశ్నిస్తే,

"ప్రేమించేందుకు"

"ప్రేమని వెతుక్కునేందుకు"

అని చెప్పగలగాలి.

"ఏం చేస్తున్నావు?" అంటే

చివరికి "రోజూ సంభోగిస్తూన్నాను"

"ప్రేమిస్తున్నాను"

అని చెప్పగలిగిన ధీరులు కావాలి. ఈ ప్రపంచాన్ని ఉద్ధరించడానికి అంతకన్న ముఖ్యమైన దేముంది!

ప్రేమించే స్త్రీని కాపాలించుకోవడంకన్న ముఖ్యమైన ఉద్దేశాన్ని కలిగిన మనుష్యులు- దురదృష్టవంతులు, వ్యర్థులు, పాషాణులు, మృతజీవనులు. ఆధ్యాత్మికవిద్యా? లోకంలోని స్త్రీని ప్రేమించలేని మనుష్యుడు ఆత్మరమతో ఏం రమించగలడు?

ఈ దేశంలో అన్ని ఆనందాలూ నశించాయి. వున్న అందాలన్నీ చాలా త్వరగా వొదిలిపోతున్నాయి.

"భోజనం, పాలిటిక్సు" రెండు మిగిలాయి. అందువల్లనే ప్రజలకి కూమా గుడ్డా అని అల్లాడతారు నాయకులు.

ప్రేమకన్న యితర విషయాలకి మోహంకన్న ప్రాముఖ్యమిచ్చే మితృల్ని చూసినప్పుడు వీళ్లెప్పుడన్నా జన్మలో వాస్తవమైన మోహాన్ని యెరుగుదురా? గంభీరమై తమ హృదయంలో కలిగించగల అగ్నివంటి ఆనందాన్ని కాని, స్త్రీ మోహించినప్పుడు ఆమె అందిచ్చే స్వర్గాన్ని గాని యెన్నడన్నా అనుభవించారా? పోనీ చిన్నతనంలో

నైనా పెళ్ళికొత్తరోజుల్లోనన్నా - (అప్పుడైనా భార్య చిన్నదీ అనుభవంలేనిదీ కావడంచాత అప్పుడూ అపశృతిలోనే గడుస్తుంది గావును రసికానుభవం! అసలు రసికత్వం హృదయంలో వుండాలి కదా మొదలు!) ఒక్కరవ్వ ఉన్నత సౌందర్యాన్ని పొందారా? అని ఆశ్చర్యపడతాను.

ఒక్కసారైనా నిజమైన మోహాన్ని గాని ప్రేమనిగాని అనుభవించివుంటే, యింకో ప్రయత్నానికి ప్రాధాన్యమివ్వగలరా? ఆ ఉద్యోగాలు, అధికారాలు, సంపాదనలు, అన్నీ అన్నీ, మోహాశయ్యకు సహాయం కావడానికి ఉపకరణాలైపోవా?

సృష్టించడంకన్న ఆనందకరమైన విషయం ప్రపంచంలో లేదు. అందువల్లనేగా యీశ్వరుడీ సృష్టిని ప్రారంభించాడంటాయి వేదాలు. కథలు వ్రాయడం, శిల్పం యివన్నీ సృష్టికార్యాలే ఈ నిర్జీవమైన కళలే అద్వితీయానందాన్నిస్తాయికదా? యింకో జీవినే సృజించడం జడానికి ప్రాణమిచ్చే ప్రయత్నం, యీశ్వరశక్తిని అందుకో గలగడ మన్నమాట. అట్లాంటి అనుభవం యింతసులభం, నీచమైపోయింది ప్రజల చేతుల్లో. పక్షులు, మృగాలు, చివరికి పురుగులు, పువ్వులు - సృష్టి కార్యాన్ని యెంత ప్రేమిస్తాయి? ఒక దానివొంక ఒకటి ఎంత కృతజ్ఞతతో ఆనందంతో చూసుకుంటాయి! పావురాళ్లు, కోళ్లు తోక లాడించడం, పాములు యిటూ అటూ పరిగెత్తడం పువ్వులు తేనెటీగ యెగిరిపోగానే వొణకడం, పిల్లులు దేహాలు పులకరించడం, కాని యీ మనుష్యులకే కలిగింది, యీ నీచత్వం, ఆ కార్యం తరవాత యీ ద్వేషం. ఆ కార్యమేమిటో సరైన పేరుతో వ్రాయనీయకపోవడం - ప్రేమలేని అసహజ ఆలింగనంలో నరాలు అలిసి బాధపడడం. వివాహమనే బంధంలో, స్వంతమనే కాపీనంలో, పాపం చేస్తున్నామనే భయంలో, పిల్లలు పుడతారనే దిగులులో, ఆనందాన్ని, ఆరోగ్యాన్ని, సౌందర్యాన్ని, తృప్తిని, శాంతిని ధ్వంసం చేసుకోడం,

పె—! నీ కష్టాల బాధతో సానుభూతిచూపి, నీ మోహానికి నా అల్పానుభవంతో ప్రతి మోహమివ్వాలనే ప్రయత్నంతో

నీకట్లాగో నాలో యింకా ముకుళించి వున్న రసికత్వాన్ని, ప్రేమ రాగాన్ని తెలియచెయ్యాలనే కోర్కెతో నీ చేతులమధ్య వొణికే నా ఆత్రుతని ఏమని అర్థంచేసుకుని వుంటావో, నా లేతతనాన్ని చూసి నవ్వుతున్నావో, లేక నా కొత్తతనాన్ని ఆనందించుకుంటు న్నావో, అని నీ కళ్ళకేసి నిమిషానికొకసారి చూసే నా చూపు లెందుకు నిన్నట్లా కలవరపెట్టేవి? సిగ్గువల్లనా, పశ్చాత్తాపంవల్లనా? సౌందర్యం ఎన్నటికీ యెవరిసొత్తు కావడం అసంభవమని ఆనాడు తెలీనినేను నిన్నంతా, నీ వొంపుల్ని నీ నవ్వుల్ని అన్నిటినీ, నావిగా కొన్ని నిమిషాలన్నా, నా స్వంతంగా దాచుకోవాలని వెర్రిగా ప్రయ త్నించాను.

కాలం గడిచింది. నువ్వు నన్ను వొదిలినచోటే నుంచుని నేను యింకా దిక్కులు వెతుకుతున్నాను. నువ్వా! నువ్వు ఎన్ని యోజనాలు దూరంగా కొట్టుకుపోయినావు?

ఈ నాడు నేను దోసెట్లోవిచ్చిన మల్లెపూలకేసి చూస్తో తల పైకెత్తి "జ్ఞాపకముందా!" అని కళ్ళతో ప్రశ్నిస్తే "యింకా ఆ పిచ్చి వొదలలేదా" అని సనాతన స్మేరంతో తొలిగి వెళ్ళిపోతావు. నా ప్రేమ కళేబరాన్ని నీ కళ్ళల్లో చూస్తాను నేను.

రాధ వర్ణనలు చదివినప్పుడల్లా, నువ్వునన్ను కోరిన దినాల్లో నీ రూపం జ్ఞాపకం వొస్తుంది. యేళ్ళు గడిచింతరువాత, హృదయా నికి చాలా సమీప వర్తులైన మిత్రులతో కలిసి విహరిస్తో యిసికతిన్నె లమీద గోదావరి గీసివొదలిన చాళ్లు చూసినప్పుడు, నీ వక్షంమీద వొంపుగా లేచిపడే చంద్రహారపు మెరుగు జ్ఞాపకం వొచ్చి పరధ్యా నంలో పడేవాణ్ణి. ఎండాకాలంలో నున్నటి శిలలమధ్య ప్రవ హించే తుంగభద్ర నీళ్ళల్లో సాయింత్రపు పచ్చనియెండ ప్రతిఫలించి నప్పుడు, యేదేవుడు తనవేళ్ళతో, పెదవులతో, యీ బంగారు నీటి పాయల్ని నదీ వక్షంమీద యిట్లా చిక్కుపడేసి పోయినాడు అను కుని— జ్ఞాపకం వుందా?

ఒకసారి అం — కొల్లేరుమీద పిట్టలవేటకి వెడుతో నన్ను ఆహ్వానించారు. అందమైన వుదయం. ప్రియురాలితో విహరించడానికి దేవత లుద్దేశించి కటాక్షించిన ఉదయం. ఏ స్వర్గంలోనో రాత్రి ఉత్సవమై అక్కడినించిన బంగారు నీరూ వజ్రాలపొడీ యీ లోకం మీద వొలికిందిగావు ననిపించింది. గాలికూడా ఆ జ్ఞాపకాలతో దక్షిణంనించి మా సైకిళ్ళవెంట పరుగెత్తుతోంది స్కూలు పిల్లవాడి వలె. రెండు తాటిదుంగెల మధ్య మంచాన్ని కట్టి దానిమీద ప్రయాణం నీటిమీద. మాతో యిద్దరు పడవవాళ్ళు. రోజంతా నీటిమీదే గడపాలని నిశ్చయం. భోజనాల మూటలూ, నా సహచారిణి Book of verse పద్యాల పుస్తకం పైగా తుపాకీ. గట్టుదాటి పదిగజాలు వెళ్ళామో లేదో నేను స్థలచరుణ్ణనీ, నాది మట్టితో చేసిన దేహమనీ, ఆకలికీ కామానికీ బానిసననీ, అన్నీ మరిచిపోయినాను. అది ఇంకో లోకం. శ్రీ శ్రీ మరో ప్రపంచంకాదు.—

నీరు కనపట్టం లేదు ఆ పువ్వుల్లో. మైళ్ళకి మైళ్ళు ఎటు చూసినా పువ్వులు. రకరకాల పువ్వులు. ఆకులకికూడా స్థలం లేకుండా పువ్వులు. రంగు రంగులపువ్వులు. పువ్వుల్ని తీగెల్ని చీల్చుకుంటో నీటి నీలపు చాలుని ఎండలో తళతళ లాడిస్తో "పడవ పయనం". మా పైన మాచుట్టూ కనపడకుండా ఎన్నడూ వినని కొత్తపక్షుల అరుపులు. ఒక్కటే లోపం—ఇద్దరమూ మొగవాళ్ళం యాత్రికులం నా స్త్రీ మిత్రుల్ని తలుచుకున్నాను. ఒక్కొక్కర్నే; ఎవరెవరు ఏమని వుంటారో! ఏం చేసివుంటారో! ఒక్కరైనా -

పువ్వులు నవ్వుతున్నాయి. పిట్టలు అరుస్తున్నాయి చల్లగా నీళ్ళు తగులుతున్నాయి. సూర్యుడు తళ తళ మంటున్నాడు. చల్లని గాలి మా చొక్కాకిందనించి తాకుతోంది. రెండు మైళ్ళదూరాన పదివేలమంది. దాంటో నూటికి తొంభైమంది ఎన్నడూ యిటురాని

వారు. కాయితాలు దస్కతులు చేస్తున్నారు, పొందుతుంటున్నారు, తిట్టుకుంటున్నారు. తూస్తున్నారు. డబ్బులు లెఖ్ఖపెట్టుకుంటున్నారు, ఇళ్ళు కట్టుకుంటున్నారు. ఆనందం అనుభవిస్తున్నా మనుకుంటున్నారు. ధన్యులమని కులుకుతున్నారు.

నా మిత్రుణ్ణి, పడవని, నన్ను, నా అల్పత్వాన్ని, కాళ్ళే నా నిరీశ్వరత్వాన్ని, అన్నిటిని మరచి, తన్మయుణ్ణాయి, సౌందర్యమగ్నుణ్ణయి, చూచున్నాను, ఎంతసేపో నిశ్చలంగా కలలు కన్నాను, మళ్ళా తెప్పిరిల్లి, ఆ పువ్వుల్లో, ఆకాశంలో, మనసు కలిపాను.

ఎంతసేపయిందో! పడవవాళ్ళు దిగిపోతున్నారు. ఎక్కడికో పోయిన ఆత్మను లాక్కొచ్చాను, ఆ పడవమీదికి పరిస్థితంలోకి. మిత్రుడు తయారవుతున్నాడు, సమయమాసన్నమైనట్టు. మేమో దుబ్బుని ఆ నీటిమధ్య ఒక దుబ్బుదీవిని సమీపించాము అప్పటికి. నేను అంతవరకు గమనించనేలేదు. ఆ దుబ్బునిండా గూళ్లు కట్టుకుని, ఆ నీటిమధ్య యే భయమూ ఎరక్కుండా, కాపరాలు చేస్తున్నాయి నీటి పక్షులు. సముద్రమధ్యాన మయుడు కట్టిన పట్టణం జ్ఞాపకం వొచ్చింది నాకు. ఈ పడవ మనుషులు వెళ్ళి వాటిని లేవకొడుతున్నారు. నా మిత్రుడు తుపాకిని సవరించుకుంటున్నాడు. ఈ మనుషుల అదిలింపులకి దడిశి పెద్ద కేకలతో protests (ప్రొటెస్టు) తో, గుడ్లను పొదిగే బాలింతలు, పిల్లలకు చలులు పెట్టే తల్లులు, ప్రియుల్ని ఎదురుచూసే ప్రేయసులు, అన్నీ పైకిలేచాయి. వాటి దృష్టి ఆ గూళ్ళవేపుపెట్టి గుండ్రంగా తిరుగుతున్నాయి ఆ రెల్లు పొదల చుట్టూ. నా ప్రాణం చివుక్కుమంది. నా ఆనందం భగ్గుమనే మంటలో కాలి బొగ్గయిపోయింది. ఏ దుఖ్ఖాన్నీ భయాన్నీ యెరగని ఆ పక్షిపట్టణంలో ఆర్తనాదాలు నింపడానికి, ఆరని మరణవేదనల్ని వదలడానికి వొచ్చామా యింతదూరం పనిపట్టి? ఈ పుష్పాల నవ్వులలో, ఆకాశం శాంతత్వంలో, యీ నీటినీలంమీద రక్తపుచారలు అలకడానికా యీ యత్నమంతా?

తుపాకిని చూసి వొణికాను, ఆత్రుతపడే మిత్రుడి మొహాన్ని ద్వేషించాను. భరించలేను. ఏం చెయ్యాను? వొద్దని గోలచెయ్యనా?

తుపాకిని నీటిలో పారెయ్యనా? వింటాడా? నేను అతిథిని! నాకేం హక్కువుంది? వెళ్ళిపోనా! ఎట్లాపోను?

పక్షులు తమ రెక్కలతో ఆకాశాన్ని కప్పాయి. అరుపులతో దిక్కుల్ని నింపాయి. జరగబోయే మారణయజ్ఞం గుర్తించాయి గావును తమ పూర్వానుభవంవల్ల. ఆ అరుపుల అర్థమేమిటో? ప్రియులు ఒకరితో ఒకరు గుడ్‌బై చెప్పుకోడమా? గూళ్ళలోంచి తలెత్తి చూసే పిల్లలకి కడపటి సలహాలా? ఏడుపులా?

చాలాసార్లు అసలు పిట్టల అరుపులకి అర్థముందా అని రోచిస్తాను. కోతులు తప్ప మృగాలు అంతగోలచెయ్యవు. రాత్రంతా కప్పలూ కీచురాళ్లూ వినుగులేకుండా గోలపెడతాయి చీకట్లో ఒకటి యెక్కడ వుందో రెండోదానికి తెలియచెయ్యడానికేమో అనుకున్నాను; మిణుగురు పురుగుల దీపాలవలె. కాని యీ పిట్టలు! పామర్రు బంగళాలో నిదానంగా అనేక రకం పిట్టల కూతల్ని గమనించాను. కొండవీటి బంగళాలో పొద్దున్నే లేస్తే యీ పిట్టల ధ్వనులతో కొండలు మారుమోగుతాయి. కవులు, సరే యివన్నీ పాటలన్నారు, హర్ష ధ్వనులన్నారు, ధన్యవాదాలన్నారు. శ్రీ బ్రహ్మసమాజం వారు ప్రార్థనలన్నారు. సోమనాథరావుగారు—

"పిట్ట లెవనిని పాడుచుండునో ప్రీతిసాగరు నాతని" అన్నారు.

కాని బహుశా ఆ "పాడుచుండునో" అనే దాంట్లో నిజమైన భావం పక్షిభాషలో -

"ఈమూల లావాటి పురుగు పోతోంది. నువ్వా వేపునించి రా నేనీవేపునించి వస్తాను." అని మగపిట్ట ఆడదానితో చెప్పడం అయివుంటుంది. ఆయన శాకాహార హృదయం ఏమాతుందో! ఆ అర్థమే ఆయనకి అర్థమైతే!

పిచ్చికలు, గోరింకలు ఎన్నోరకాల అరుపులు అరుస్తాయి. ఒక కొమ్మమీద కూచుని ఒక అరుపు యింకో కొమ్మమీదికి గంతేసి యింకోఅరుపు. గదుల్లో గూళ్ళుకట్టే పిచ్చికల అరుపుల్ని ఒక సంవత్సరం అదేపనిగా వింటే పిచ్చికభాష dictionary వ్రాయవచ్చు ననుకుంటాను.

తుపాకి పేలింది. మెల్లిగా ఆకాశాన్నుంచి రాలే వల్లని కన్నీటి చుక్కలవలె దీనంగా నీళ్ళమీద రాలాయి పక్షులు. నీళ్ళమీద నించి మళ్ళీ గాలిలోకి లేవాలనిచూసే ఆ నిర్భాగ్యుల్ని పట్టుకుని లాక్కొచ్చి పడేశారు పడవలో. కన్నీళ్ళతో నావొళ్ళోకి తీసుకున్నాను యింకా వెచ్చగా కదులుతున్న కళేబరాల్ని. ఆ యీకల అందం, ఆ మెడలతిప్పు, ఆ రొమ్ము సౌష్టవం, రెక్కల వొంపు. అంతా చివరికి యిందుకా? దువ్వాను, పొరలుకమ్మే కళ్ళలోకి చూశాను. రొమ్ముకు అద్దుకున్నాను. నా చేతుల్లో చల్లబడ్డాయి.

ఈ చిన్న పిట్టల్లో చంపడానికి వచ్చినపుడు తప్ప మనిషి కంటబడని పిట్టల్లో యీ అందాలేమిటి యీ తళుకు, యీ నునుపు; పైగా తమ ఆనందంకోసం యీ సృష్టి జరిగిందని కులుకుతున్నారు ప్రపంచంలో సగం మంది. ఎవరు చూడడానికి? ఒకపిట్ట యింకో పిట్ట అందాన్ని చూడగలదా? దేవతలు చూస్తారా? యింత అందాన్ని యిట్లా నాశనం చేస్తోవుంటే చూస్తూ వూరుకున్నారా, దేవతలూ, రుషులూ, దిక్పాలకులూ? యిట్లా నాశనం కావడానికా యింతశ్రమ? అందమైన పిల్ల పుట్టగానే చచ్చిపోతోవుంటే, యీ సృష్టి విధానాన్ని నడిపేవాడువుంటే, ఇంత నిస్సహాయంగా, తాను నిర్మించిన సౌందర్యాన్ని, తానే నాశనంచేస్తాడా అనుకుంటాను -

అందమనేది వుందా? నా కంటోగాక బైటవుందో. దేవుడికి కనబడుతుందా? దేవుడే లేకపోతే ఎదో పక్షులు రావొచ్చుగాని, అందం ఎట్లావొచ్చింది? నా మనసులో సౌందర్యభావానికీ, పిట్టల రెక్కల నునుపుకీ సంబంధం ఎట్లా కలిగింది?

దేవుడువుంటే, సౌందర్యంమీద వుపేక్షా, నిరసనా, ద్వేషమూ అతనికి? ఇన్నేళ్ళూ వాటి అందం ఎవరుచూసి సంతోషిస్తున్నారు! చివరి నిమషంలో చంపబోయేప్పుడు ఒక్కనిమిషం నాకళ్ళు చెదర కొట్టేందుకా, అన్ని యుగాలప్రయత్నం evolution! పక్షిఅందాన్ని కల్పించేందుకు, నేనూ, నా సౌందర్యదృష్టీ అంతముఖ్యమా! ప్రపంచంలో... నేను - ఒక్క చిన్న దెబ్బతో - అంతా ముగిసే నేను - పురుగుకన్న నాజూకు ప్రాణంగల నేను - నేనే అంత విలువా దేవు

గికి? తక్కినవాళ్లూ! నదుల్లో, పిల్లలలో, పిట్టలలో ఏ సౌందర్యం చూడనివాళ్లు, కంది పచ్చడిలో, చీకటి మంచాలమధ్యతప్ప; మురుగు వాసనల్లో, నంగిమాటల్లో తప్ప అందం కనపడి యీ "children of God" సంగతేమిటి!

ఏం జరిగింది? ఏమిటి ఆగింది? ప్రాణం పోయిందా? ప్రాణం వుందా పోవడానికి? ప్రాణం ఆ శరీరంనించి వేరా? ఆ శరీరంలో నివసించిందా? ఇప్పుడు వేరై యింకా ప్రత్యేకంగా యింకో ఆత్మగా exhist అవుతోందా? ఎక్కడో యీ ఆకాశంలో? ఆత్మ అనేదివుందా? పిట్టలకి కూడానా? ఇట్లానే వాదించా, పంగనామాల వందికొక్కు హెడ్మాష్టరుతో ఒకసారి. ఆత్మ పురుగులకి, దోమ లకి, యింకా సూక్ష్మ జీవులకి, భూతఅద్దంకింద కనబడే జలజీవులకి, క్షయజీవులకి, మనరక్తంలో యెర్రనికణాలకి, మన శరీరంలోని ప్రతి cell సెల్‌కి, గడ్డికి, ప్రతి గడ్డిమొక్కకి, గడ్డిమీద ఆకుపచ్చతనా న్నిచ్చే అణువులకి, క్లోరఫిల్‌కి, protoplasm కి, రాళ్ళకి, రాళ్ళ లోని రజానికి? జబాబు చెప్పమను? ఎక్కడ గీతగీస్తావు ఆత్మవున్న వొస్తువు, లేని వస్తువు అని? మనకి ఆత్మవుంది. మనశరీరంలో cells కి వేరే జీవంవుంది. అది అందరికీ తెలును? వాటికి వేరే ఆత్మలా? ఏదీ నా ఆత్మ నా శరీరంలోని కోట్లకోలది జీవరాసుల్లో! అంతా ఒకటే పరమాత్మ స్వరూపమని తప్పించుకుంటారు వేదాంతులు. సులభం. కాని వాదించమనండి. సరేకాని కొన్ని జీవాత్మలున్నా యిగా! అవి వేటికి? మనుషులకేనా? అంతేనంటారు క్రిష్టియనులూ మహమ్మదీయులూ! ఐతే కొండమనుషులకి? మనుషులవంటి కోతులకి? ఇంకా దిగిపోతుంది స్కేల్! ఇదంతా ఎవడికీ అర్థంగాని విషయం. అర్థమౌతుందన్నవాణ్ణి, లనకి తెలుసునన్న వాణ్ణాల్లా ప్రశ్నలడిగి నోరు మూయించి మొహాన వుమ్మేసి, యీ మతాలగర్వం అణిస్తే బాగు పడుతుంది లోకం.

మితుృడు వైకుంఠరావు "ఏమిటి మనుషులకా ఆత్మ? అసలు వాళ్ళకే లేదు. ఏమిటి? ఈ మనుషు అందరికీ ఆత్మలున్నాయంటావా? చచ్చింతరవాత ఏమన్నా మిగులుతుందంటావా? ఏమీ భయంలేదు,

బూడిదతప్ప యింకేమీలేదు" అన్నాడు ఒకసారి. ఇప్పుడేమంటున్నాడో! ఆత్మలసంగతి మాట్లాడిన పంగనామాల పండితొవ్వడికి వుందా ఆత్మ!

ప్రాణం పోగానే ఆ కళేబరాన్ని భరించలేకపోయినాను. వికృతం, అసహ్యం, భయంకరం. జీవితానికీ మరణానికీ ఏమీ సంబంధంలేదు. ఆకాశాన యెగిరిన పక్షి కాదది. ఏదో భయంకరపదార్థం. ఇంత భేదాన్ని కలిగించిన సూత్రం యేమిటి? ఇదివరకున్నది ఇప్పుడు లేనిది? నాకన్నా మహామహులు ఎందరో తలబద్దలయ్యేట్టు యోచించారు. ఏం లాభం? సుఖంగా దాన్ని కూరవొండుకొనితినక యీ ప్రశ్నలన్నీ! చచ్చింది ఎట్లానూ చచ్చింది. ప్రాణం ఏ లోకానో వుంటేనేం లేకపోతేనేం? ఏడ్చి యోచించి నేనేమీ సహాయం చెయ్యలేను కదా! వేదాంతమంటే అదీ! నాలో లేదా యీ దేశపు హిందూరక్తం? కాని హిందువులకి వేదాంతం vasaline, నల్లమందు. ఏ బాధనించీ, వేదాంతంలోకివెళ్ళి మనస్సుని సమాధానపరుచుకొని, తమ కూౄరత్వంలో, స్వార్థంలో నిద్రపోతారు. కాని వేదాంతంలో ఎంత తిరిగినా నన్ను తృప్తిపరచదు. వేదాంతం జవాబుచెప్పలేని ప్రశ్నలు ఎన్నో తోస్తాయి. వేదాంతం ఎక్కడకీపోని గుడ్డి గల్లీ-

మళ్ళీ తుపాకిమోత, ఇంకా చావులు, యింకా అరుపులు, మళ్ళీ యింకా చావులు - కాలం గడిచింది. ఇదంతా చూస్తో ఏమీ చలించకండా సూర్యుడు నడుస్తున్నాడు. గాలి ఎప్పటంత సంతోషంగానూ వీస్తోంది. రక్తంతో యెర్రబడ్డ పువ్వులుకూడా ఏం సంబంధం లేదన్నట్టు నవ్వుతూనే వున్నాయి.

చాలాసార్లు అనుకుంటాను. నేను లేని రోజు అనే మొదటి రోజు సంగతి. లోకంలో ఏ మార్పూ వుండదు. ఒకమనిషి తక్కువైతే నలుగురు ఎక్కువవుతున్నారు. గడ్డి ఇట్లానే యెదుగుతుంది. ఎండ యిట్లానే మండుతుంది. గాలి యిట్లానే వీస్తుంది. మనుషులిట్లానే తిరుగుతారు. నేనుమాత్రం వుండను. అంటే, లోకమే వుండదు. ఎట్లా వుంటుంది? నేను లేకపోయింతరవాత! కాని వుంటుందే! మరి ఎట్లా వుంటుంది? ఇట్లా యోచించి యోచించి అర్థ

రాత్రులు, యీ సమస్య అంతంకాక మెదడు వేడెక్కి నిద్రరాక, మరిచిపోవాలంటే యీ సమస్య వదలక, పక్కమీద దొర్లుతాను. జీవితంమీద మనసుకి అంత ఆసక్తి ఉంది. అంత అనురాగం వుంది. అందువల్లనే "నేను లేకపోతే లోకం యేదీ!" అనే అహంభావం. ఈ లోకమంతా మనసు కల్పించిన పటమేమో అనిపిస్తుంది. ఈ పాడుమనసు యింతకన్న మంచిలోకాన్ని కల్పించకూడదూ, శేషాచార్లూ, బురదలూ, పంగనామాల పందికొక్కులూ, ముళ్ళకంచలూ, రోగాలూ లేని లోకాన్ని!

ఈ "నేను" జీవితానికంతా పునాదిగనకనే, యీ 'నేను' ని పట్టుకుని యిట్లా వేళ్ళాడతారు మనుషులు. ఆ 'నేను' లోనుంచి 'నాది' పుడుతుంది. పొట్టమీద పాకేపిల్ల "నాది" అనలేక మొదటిసారి "అది" అనేటప్పటికల్లా అవును ఆ 'నాది' నీదుఃఖాలకంతా 'అది' అనుకుంటాను. ఈ "నేను" యీ "నాది" అనుకునేవాటిని అన్నిటినీ విడిచిపోవాలి ఎప్పుడో ఒకప్పుడు. అందుకనే ఎట్లాగో లాగు ఆ "నేను" ని ఇక్కడే వుంచాలని వొదలాలని వెర్రిప్రయత్నాలు చేస్తారు. పుస్తకాలు వ్రాసి అవి శాశ్వతంగా వుంటాయని కవులకి భ్రమ. గీతాంజలి తెనిగించి సోమనాధరావుగారు, తన పేరుమీద రవీంద్రనాథ్ పేరుమీద శ్లేషవేసి "రవిసోములుండుదాకా!" అన్నారు. ఇప్పుడా తెలుగు పుస్తకం సంగతి తెలిసినవాడేలేడు. సత్రాలు, టాజ్ మహల్, అంకితాలు – యెన్ని వెర్రిప్రయత్నాలు పాపం!

పైపెచ్చు యీ పురాణగాథలు తోడుపడ్డాయి, కీర్తిని శ్లాఘించి శ్లాఘించి. ఇంత తెలిసిన వేదాంతులు ఆ కీర్తిని ముఖ్యంగా చచ్చినతరవాత కీర్తిని ఎందుకంత అవధిగా చూపారో అర్థం కాదు. పోనీ బతికి వున్నప్పటి కీర్తి ఏదో వుపయోగపడవచ్చు. మంచినీళ్ళబదులు ఎవరన్నా మజ్జిగ యివ్వవచ్చు. రైలుస్టేషనులో ఎవరో గుర్తుపట్టి సామాన్లు రైలులో ఎక్కించిపెట్టవచ్చు. కాని చచ్చినతరవాత ఆ రక్తంకోసం యీపురాణయోధులచేత ఘాతుకకార్యాలు చేయించారు, పుణ్యాలని పేరుపెట్టి. ఈ నాటికీ ఆ కీర్తి కాంత శుభ్రంగా యిందరి

మొగాళ్ళ పక్కల్లో మైలపడికూడా యింకా మనుషుల్ని ఆకర్షిస్తోనే వుంది, నవకవుల్నీ, దేశోద్ధారకుల్నీ, విశ్వదాతల్నీ!

నాలో మెల్లిగా మార్పు కలుగుతోంది. రాలిన తెచ్చిన పిట్టల్ని లెక్కపెట్టుతున్నాను. పొదల్లోదూరి పిట్టలు వాళ్ళకి చిక్కక తప్పించుకుంటోవుంటే బాధపడుతున్నాను. తుపాకి గురి తప్పితే అసహ్యించుకొంటున్నాను. ఎన్‌కరేజ్ మెంటు ఇస్తున్నాను. డిజప్పాయింటు అవుతున్నాను. దిగులు పోయింది, ఉత్సాహం ఎక్కువైంది "అవుగో! కొట్టు, కాల్చు, పట్టుకో, తీసుకురా! ఎన్ని? ఇంతేనా?" అంటున్నాను. ఆకాశంలేదు, పువ్వులులేవు, నీళ్లు కనబడవు పిట్టలు, తుపాకి దెబ్బలు, చావులు, పీనిగలు, రెక్కలు ఇంతే. గంటకింద బావురుమని ఏడవడానికి సిద్ధమైన నేను; అందమైన అనుభవాన్ని, సుందర లోకాన్ని ధ్వంసం చేస్తున్నాడని నా మిత్రుడిమీద ఆగ్రహించిన నేను—

చంపడమే ముఖ్యం. ఎన్నిచస్తే అంత సంతోషం ఆ పిట్టల్ని తినే కోర్కె లేదు. కాని అవి చస్తే నాకు తృప్తి. పడవనిండా కుప్పలు కుప్పలుగా అనేకరకాల పిట్టలు చచ్చినవి, చస్తున్నవి. మెడలు వేళ్ళాడేసి, కళ్ళమీద పొరలుకమ్మి యీకలన్నీ నీళ్ళలోతడిసి అసహ్యమేసే ఆ కళేబరాల్ని చూస్తే సంతోషం. విల్లువలె రెక్కలు వొంచి సునాయాసంగా గాలిలో తేలే పిట్టల్ని చూస్తే కోపం.

చివరికి ఇంకెందుకు, గంగ పాట్లని వర్ణిస్తాడే భర్తృహరి;- ఆ steps (స్టెప్సు) అన్నీ;- అంత అధోగతికి దిగాను. సరిగా గురి చూట్టంలేదని మిత్రుడి చేతులోంచి తుపాకి లాక్కొని కాల్చి ఓ కొంగ కాలు విరగేసి కారు కారుమని అరుస్తో పరిగెత్తితే అది చచ్చి కింద పడలేదని దుఃఖించాను.

ఇంక యీ ఉదంతాల్లోవుండే నీతి, అవినీతి, వ్రాయాలి. ప్రతి కథకీ పద్యాలకీ చివర నీతి వుండవొద్దూ! స్కూలు మాష్టర్లనీ, పిల్లల్నీ, ఇన్‌స్పెక్టర్లనీ అడగండి.

ఎందుకంటే నేను ఎప్పుడూ దుర్మార్గులకే వ్రాస్తాను. సన్మార్గులు యీ పత్రికల్ని పగలు చదవడం మానేశారు! వాళ్ళకి అప్పుడే

దీంట్లో అవినీతి స్పష్టమైవుంటుంది ఎవరి పడకగదిలో వాళ్లకి. ఇంక దుర్మార్గులకి—

మానుల్ని - మాట్లాడకూడదని వ్రతం పెట్టుకున్న వాళ్ళని చూస్తే నాకు చాలా గౌరవం హెచ్చుతోంది. నిజం మాట్లాడారా అర్థం కాదు మనుష్యులకి. అబద్ధం మాట్లాడ్డం ఇష్టం లేదు. అందుకని మానులౌతారు జ్ఞానులు. అందరూ అబద్ధాలలో యోచించి అబద్ధాలలో మెలగడం చేత ఒకరి అబద్ధం ఒకరికి అర్థమౌతుంది. నిజమౌతుంది. నిజమే అర్థంకాదు. అంతేకాదు, నిజం అబద్ధమవుతుంది. పిల్లికి వెలుతురు చీకటైనట్లు. నా మాటలు వింటున్న మనుషుల మొహాలు గమనించినప్పుడల్లా ఎందుకు మాట్లాడనా? మరీ యింత పశువునైనానే అని అసహ్యమేస్తుంది. (మరిచిపోయినాను. పశువుల్ని నిందిస్తున్నాను. అవి మాట్లాడవు.) ఇంక వ్రాతా! ఈ వ్రాతల 'వీక్నెస్' ఇంకా పోలేదు. ఎప్పుడు పోతుందో. హరీంద్రనాథ్ అన్నట్టు...... "అప్పుడు చెప్పవలసిందీ వుండదు. వ్రాయవలసిందీ వుండదు. ఒకరికి చెప్పగలమనుకోడం అహంభావం. ఒకరికి చెప్పాలనే కోర్కె మనోదుర్బలత్వం."

దీని అవినీతి యేమిటంటే, యిట్లాంటి కోర్కెలు వేట, జూదం వ్యభిచారం, యిట్లాంటివి అందరిలోపలా అణిగేవున్నాయని. వొప్పుకోరు. పోనీండి. ఒకరికీ యింకోరికీ, పుణ్యాత్ములకి, పాపాత్ములకి, ధర్మాత్ములకీ, రౌడీలకీ యేమీ భేదంలేదు. పనులు, ఘనులు పైపనులు దినచర్యలు, డాంబికాలు, వేషాలు, నిగ్రహాలు, ఆగ్రహాలు ఇంతే భేదం. అందరు మనుషులూ ఒకటే. ఈ పైపనులను లెఖ్ఖవేసి జమకట్టి ఫలితాల నిస్తాడు ఈశ్వరుడని నమ్మకం. కళ్లులేవు, బుద్ధిలేదు, యీ దేవుడికి యీ పుణ్యాత్ముల వ్యూహాలో. భయపడి, శ్రమపడి, వున్న కోర్కెల్ని అణుచుకుని సౌఖ్యాలు వొదులుకోడంవల్ల, అవన్నీ అనుభవించినవాళ్లకి శిక్షలు లేవంటే ధర్మపరులకి బాధ అందువల్లనే సంఘంపేర అంత క్రౌర్యం చూపుతారు మర్యాదస్థులు. మాటలు మాత్రం, సర్వజ్ఞానస్వరూపుడివి, సత్యస్వరూపుడివి, అంటారు. ఈ బ్రహ్మసమాజం వాళ్లు దేవుడికి ఇన్ని లక్షణాలూ వున్నాయని తెలిసి

కూడా రామ్మూర్తిని వెలేశారు వ్యభిచారానికి. మీలో ఎవరు వ్యభిచారి కాదని అడిగినందుకు నన్ను వెలేశారు. వ్యభిచారం చెయ్యని వారిలో కూడా వ్యభిచారం వుందంటే మండిపడతారు. పూర్వ పతివ్రతల కథల్లో యిట్లా గూఢ వ్యభిచారాల్ని యెత్తిచూపాలని యీనాడు ప్రయత్నించారా! ఏ పత్రికలూ అచ్చువెయ్యవు.

మనమీ లోకంలో యిచ్చే values న్నూ కొంచెం ఉన్నతాతరణలో (highor plane) వాటికి వుండే విలువలున్నూ భేదిస్తాయని చూప ప్రయత్నించినందుకే నా 'మృత్యువు' చాలామంది మంచి మిత్రులకి అర్థం కాలేదు.

ఇవన్నీ మానసికమైన అలవాట్లు, మన సుగుణాలూ, దుర్గుణాలూ. అంతకన్న ఎక్కువ విలువలేదు వీటికి. ఒక్కటే నిశ్చయం. ఇదంతా యీ భేదాలన్నీ మనసే కల్పిస్తోంది. కొంచెం training (ట్రెయినింగు) తో అనేకమార్పులు తెచ్చుకోవచ్చు, ప్రయత్నించరుగాని. చూడండి, ఇప్పుడు నేను ఎనిమిది మైళ్లు బస్సుమీద పోవాలి. తరవాత మూడు మైళ్లు సైకిలుమీద, తరవాత రెండుమైళ్లు కాలి నడక, తరవాత బడి తనిఖీ మూడుగంటలు. పిల్లలూ, టీచర్లూ. తల్చుకుంటే ఇదంతా విసుకు, చీకారం. మనసుని పిలిచి ముందు కూచోబెట్టుకుంటాను.

"బస్సు ప్రయాణమంటే ఎందుకు నీకు విసుకు? ఎదురుగా వీచే గాలీ, చుట్టూ పొలాలమీద మెరిసే యెండా, బస్సులో వాళ్లు మాట్లాడుకునే మాటలూ. తరవాత తమాషాగా సైకిలెక్కి గట్లమీద, అంచు కుపొర్లే కాలవనీటి పక్కనే, నేరేడుచెట్ల నీడల్లోంచి, అట్లా అట్లా పోయి, తరవాత దిక్కులు చూచుకుంటో యెదురుగా వచ్చేమనుషుల్ని పరీక్షించుకొంటో, నీలం ఆకాశంకేసి చూస్తో, జెముడుకాకి మూలుగు వింటో, వూరు - బడి-...."

అక్కడదాకా సగం సందేహంతో వినే మనసు చప్పున కురాళ్ళిడిమల్లే యెదురు తిరుగుతుంది. ఆ బడిపిల్లలు అన్నా కొంచెం వూరుకుంటుందిగాని ఆ రిజష్టర్లు, లెక్కలు, అనేటప్పటికి లేచినుంచుని 'ఏడిశావులే, నోరుముయ్యి ఆ అఘోరం నాకు తెలీకపోలేదం'టుంది.

కాని ఎన్నడో ఏనాడో ఆ రిజష్టర్లనికూడా ఆకర్షకంగా చెయ్యలేక పోతానా అని ఆశ.

ఏమైతేనేం, మన మనసులో వంకర్లు తీశామా, లోకంలో వంకర్లన్నీ మాయమౌతాయి. ఈనాడు కొత్తగా అక్షరాలు వ్రాసిన పిల్లాడు తండ్రికి గొప్పగా చూపినట్టు. ఈ మాటలు బడాయిగా వ్రాస్తున్నానేగాని యీ సంగతి లక్షల మంది యిదివరకే చెప్పారను కుంటాను లోకానికి.

నాతో మాట్లాడతారు కొందరు.

"నేనండీ ఎన్నడూ ఇంకో స్త్రీ—"

"నాకండీ ఎప్పుడూ పరోపకారం చెయ్యాలనే తప్ప—"

"మా వంశములోనే లేదండి అట్లాంటి..."

"నా భార్య పోయిందీ ఆ విచారంలో—"

నేను నిజం మాట్లాడితే వాళ్లు ఏ గుణాలు గొప్పగా చెప్పు కుంటున్నారో అవే నా దృష్టిలో క్షుద్రంగా తోస్తున్నాయంటే!—

ఇప్పటికే ఏకాకిని. ఇంక యీ మాత్రం మనుష్య సంబంధం కూడా పోతుందని భయం.

మౌనమే వుత్తమం.

కొందరు వొదలరు.

"మీ అభిప్రాయమేదో చెప్పండి."

ఏం చెప్పను? అందుకనే అబద్ధం చెప్పకూడదనే బ్రిహ్మ సమాజపునాటి నియమం వొదులుకుంటున్నాను మెల్లిగా! నిజం చెపితే అబద్ధమంత హానీ చేస్తోంది.

"నిజం చాలా విలువైన వస్తువు. ఈ పశువుల ముందు చల్ల బోకు" అనిపించాడు అస్కార్ వైల్డు.

ముఖ్యంగా యీ దేశంలో యీ భూతదయగాళ్లు కులకుల లాడుతున్నారు. అందరి హృదయాలలోకూడా యీ ఘాతుకం వుండనే వుంది. అంటే వాళ్ళ చూపులే వేటచూపులంటే, యీగల్ని తోలడంలో మాటల్ని కొరకడంలో యిడ్డెనని మింగడంలో వాళ్ళ గేధ వడకల్లో అన్నిట్లో నాకు కనబడుతోనే వుండంటే, ముఖ్యం

యీ గోరక్షణవాళ్లూ, బలుల్ని ఆపడానికి ప్రాయోపవేశం చేసే వాళ్లూ, యజ్ఞాలకి అడ్డపడేవాళ్ళూ, దయాపరులూ, వీళ్ళందరి sub-conscious motive అంతరాంతర ప్రోద్బలం మారణోత్సాహమే అని తెలియజేస్తే!

చివరికి లోతుగా, వెనకగా పరిశీలిస్తే, ఒకటే సంగతి తేలుతుంది ఎవరికైనా. మనుషుల మనసులో వుండే ప్రోద్బలాలన్నీ తరిచి చూడగా చూడగా అంతా sex ప్రోద్బలమని తేలిందిfrwedకి. ఇంకా తరిస్తే యీ sex ప్రోద్బలమూ అసలు జీవనానికంతా మూలసూత్రమూ ఒక్కటేనని కనుక్కుంటారు. మనిషి మనసులకే కాదు యీ జంతువుల్కు ప్రాణులు చరాచరా లన్నింటికికూడా.

పశ్చిమ ఖండవాసులు యీ material భౌతికమైన ప్లేన్‌లో అన్వేషణ ప్రారంభించి మొన్న మొన్ననే సైకాలజీని అందుకొన్నారు. హిందూదేశంలో డెకార్డువలె 'నేను' అనే మనోమాత్రతో ప్రారంభించి భౌతికానికి దిగారు. Betrand Russel వ్రాశాడు. యూరోపియన్ శాస్త్రజ్ఞులు physics తోగాక సైకాలజీతో వారి శాస్త్రవిజ్ఞానాన్ని ప్రారంభించినట్లయితే ఇంతకన్న చాలా ఎక్కువదూరం వెళ్ళగలిగి వుండేవారని. ఈన్‌స్టిన్ రెలెటివిటీ సిద్ధాంతాన్ని యింకా యెక్కువ అన్వయం చేసిన జర్మన్ శాస్త్రజ్ఞుడు Platt యిప్పటికీ యీ అణువుల తత్వాన్ని మనుష్య ప్రోద్బలాలకి సమన్వయించాలని చూస్తున్నాడు. అణువు ప్రవర్తననించి మనిషి ప్రవర్తనని నిర్ణయించాలని వాళ్లూ, మనిషి ప్రవర్తననించి అణువు ప్రవర్తనని నిర్ణయించాలని వీళ్లూ.

మనిషిలో అతనికీ తెలియక అణిగివుండే శత్రువుల సంగతి మాట్లాడుతో టీ బల్లదగ్గిర పెద్దమ్మాయిగారితో చెప్పాను కొల్లేరు మీది వేటసంగతి. ఏదయినా ఆమెతో చెప్పడం చాలా సరదా. ఆమె ఎంత శాంతంగా మాట్లాడతారో అంత శాంతంగానూ వింటారు అది ఆమె స్వభావం. చాలామందిలో అది Art (ఆర్టు). చక్కగా, తెలివిగా, ధైర్యంగా, ఏ అభిప్రాయాన్నైనా విని చర్చించి 'డైజెస్టు' చేసుకోడానికి ప్రయత్నించే సామర్థ్యంగల కొద్ది

మంది స్త్రీలలో ఆమె ఒకరు. నా మాటలు విని కొంచెం ఆలో చించేశారామె.

"చూడండి. ఆ వేటవుత్సాహం ఆ చంపేదాహం నాలో వున్నదని ఎన్నడూ అనుకోలేదు. ఉన్నదని ఎవరన్నా అంటే మండి పడి వుంటాను - నీళ్ళలో కొట్టుకుపోయ్యే చీమల్ని కష్టపడి పైకితీసే నేను! కాని ఆనాడు తెలిసింది. మరి ఎన్ని పొరలకింద, ఎన్ని తరాల నించి, ఏ పురాతన పూర్వులనించి నా రక్తంలో అణిగివున్నదో, నన్ను నేను controle కన్ట్రోలు చేసుకోలేక పోయినాను. sex ఎంత inevitable ఇనెవిటబుల్ గా పోత్సహిస్తుందో అంత ప్రళయం మళ్లేనే నన్ను ఆడించేసింది ఆ వేటశక్తి. నాకు తెలుసు. నన్ను చూసి నేనే ఆశ్చర్యపడుతున్నాను. కాని ఆ కోర్కెని అణుచుకో లేకపోయినాను. ఆ రక్తదాహాన్ని!" అన్నాను.

మల్లిక్ మామయ్యా చిరతపులి పిల్లని పెంచుతున్నాడు. అంత సాధువుగావుండే ఆ పులిపిల్ల రక్తాన్ని చూసిందా కొట్టేస్తుందిట పంజా లతో. మానవుడూ అంతే. అంతమాత్రం గట్టి ప్రోద్బలాలు instincts లేని మానవుడు శవమాత్రుడు

"నాకు కోపం లేదండి."

"ఏదో నా సంగతి నాకేకాని..."

"నేను ఏక పత్నీవ్రతుణ్ణి."

"నా కోర్కెల్ని నేను అణుచుకోగలను."

"దెబ్బలాటంటే భయం."

ఇట్లాంటివి గొప్ప బడాయిగా చెప్పుకుంటో వుంటారు. వెంటనే అంత చచ్చు పీనిగలా అనిపిస్తుంది. కులాలలో కులాల ఇంటర్ బ్రీడింగ్ inter breeding చేసి ఇట్లాంటి చచ్చు పైప్పుని సిద్ధంచేసి పెట్టారు మనదేశానికి— అనుకుంటాను.

కోపం, కామం, వాంఛ, (ambition) చురుకుతనం ఇవన్నీ వుండాలి. పాలించుకుని కట్టేసుకోగల శక్తి వుండాలి. శాపం యివ్వగల శక్తీ, దాన్ని అనుగ్రహించగల శక్తీ వుండేది అంటారు రుషులకి. చచ్చుపీనిగల శుష్కవేదాంత బారెడు మొద్దులుకాదు వాళ్లు.

"రక్తం చూస్తే నా కళ్లు తిరుగుతాయండి."

"ఎవరన్నా ఏడిస్తే చూడలేను."

"చాలా జాలిగుండె నాది."

పోయి చావరాదూ?

బలహీనత్వాలూ, నెప్పులూ, రోగాలూ, చికాకులూ, దుఖ్ఖాలూ అన్నీ గొప్ప సుగుణాల్లాగ యితరుల సానుభూతికి Exhibit చేసి పైకి చూపుకోడం బడాయిగా అలవాటయింది యీ దేశం ప్రజలకి. సంతోషంగా, వుత్సాహంగా ఉన్నవాణ్ణి, గట్టిగా నిర్లక్ష్యంగా నడిచేవాణ్ణి, ఎంత అయిష్టంగా వున్న పనినైనా చేసేసి దులుపుకు తిరిగేవాణ్ణి భరించలేరు ప్రజలు. నన్ను ద్వేషించి నామీద రిపోర్టులు చేసిన అధికారులు జ్ఞాపకం వొస్తున్నారు. ఎంత యేడిస్తే అంత ఇష్టం యీ లోకానికి.

"ఎట్లావున్నారు? అంతా క్షేమమా?" అని అడుగుకుంటారు ఒకరి నొకరు.

ఎవరో వకరుగాని "అంతా క్షేమమే మీ దయవల్ల" అనరు. ఏదో ఒక రోదన పెడుతోనే వుంటారు.

ఒకవేళ క్షేమంగా ఉన్నామంటే అర్థమేమిటంటే బతికే వున్నామన్నమాట. కాని కంఠస్వరంమాత్రం "చచ్చామండి" అన్నట్టుంటుంది. భాష తెలీనివాడు వింటే, "నాశనమైనామండి" అన్నట్టు వినపడుతుంది. రోడ్డుమీదపొయ్యే మొహాలు చూస్తోవుంటే అంతా నిర్జీవమే అంతా విచారమే, జడత్వమే. ఈ దేశమే యిట్లాసా? ఈ నిరంతర రాజకీయ సాంఘిక ఆర్థిక పారతంత్రం యిట్లా చేసిందా మనుషుల్ని!

"ఈ దయాపరులు, రక్తం చూస్తే భరించలేని బ్రాహ్మలు వీళ్ళందరిలోనూ, యెంతెంత క్రూరత్వం దాక్కొని వుందంటారు? ఆ వేటకోర్కెని తీర్చుకోక, దాచుకొని, ఉన్నదనికూడా తెలీక, పిట్టలమీద, మృగాలమీద చూపని ఆ క్రౌర్యాన్ని, మనుషులమీదా, కోర్టులలో, ఆఫీసుల్లో, యిళ్ళలో తీర్చుకుంటారు కక్షలుకట్టి. మృగాల బదులు మనుషుల్ని, ధనాన్ని, పదవుల్ని వేటాడుతున్నారు.

పిల్లలమీద, భార్యమీద, నౌకర్లమీద చూపుతారు కసి. వీళ్ళందరూ శాకాహారులే, భూతదయాపరులే!" అన్నాను.

ఆమె అంగీకరించని విషయాన్నికూడా సావధానంగా విని, నిదానంగా ఆలోచించి, విలువ కడతారు.

"ఏమంటావు అహోబలం?" అని పక్కన కూచున్న డాక్టరు గారిని అడిగారు.

నేను ఇంకా వుత్సాహంతో—

"ఈ డాక్టర్లు, ముందు రక్తాన్ని చూడలేనివాళ్ళు చివరికి ఏమౌతారు?" అన్నాను అప్రస్తుతంగా.

ఆయన తలవూయించారు, ఆయన serious సీరియస్‌గా. విషయాలు హృదయానికి దగ్గిరవి, ఆయన మనస్సుని గట్టిగా కదిలించినవి ఆయన మాటలాడరు. హృదయ సుకుమారత్వాన్ని, దయని, గొప్ప స్నేహబంధాన్ని హేళనలో ఆటలో కప్పేస్తారు. నవ్వులో, గొప్ప నవ్వులో వున్న ఔన్నత్యం దేంట్లోవుంటుంది? అందువల్లనే షేక్‌స్పియర్, కాళిదాసూ గొప్ప వేదాంతాన్ని court fools కోర్టు ఫూల్స్ చేతా విదూషకులచేతా మాట్లాడిస్తారు. పి జి. ఉడ్ హౌస్ నవ్వులో, డికెన్సు caricatures కారికేచర్లలో, చార్లీచాప్లిన్ చిత్రాలలో ఎన్ని కన్నీళ్ళు? ఎంత వేదాంతం? ఎప్పుడో పెద్దన్నగారు పరిసంగంలో చాలా హృదయాన్ని కదల్చినప్పుడుతప్ప ఆయన హృదయాన్ని ఎన్నడూ చవకగా విప్పరు అందరికీ అర్థంకాదని సహజంగా గ్రహించిన సంస్కారి.

"కాదూ" అని నవ్వుతూనే మాట్లాడతారు.

"కాదూ మరి! ఈ యుద్ధంలో యోధులందరూ యెవరంటారు? ఇంటిదగ్గిర పిరికివాళ్ళే. తీరా అక్కడికి వెళితే ఆ కోలాహలమూ రక్తస్రావమూ చూసేప్పటికి స్వరక్షణార్థం ప్రతివాడికీ శౌర్యం పుట్టుకొస్తుంది." అని నాలుగు మాటల్లో గంపెడు వేదాంతం మాటలాడారు.

ఆమె ఆ మాటల్ని యోచిస్తో కూచున్నారు. ఆ మధ్యాహ్నం ఆ టీ టేబిలు ముందు.

వాళ్లిద్దరితో నేను గడిపిన మధ్యాన్నాలు, సాయంత్రాల్లూ మనసులో ఎంతో పదిలంగా దాచుకుంటాను.

నేను యీ జీవితంలో నా స్వల్పఅనుభవంలో ముగ్గుర్ని అమితంగా గౌరవించాను. వారిలో వొకరు అహోబలరావుగారు. ఎంత గౌరవమంటే—

నేను కాన్వకేషన్ హాల్లోంచి వొస్తున్నాను. సెనెటర్ల వరసలో నా కళ్లని చెదరకొట్టింది రామలింగారెడ్డిగారు. బైటకిరాగానే నాతలెనే ఆయన రూపానికి వశ్యుడైన సహోధ్యాయుడు రెడ్డిగార్ని గురించి స్త్రీలూ వ్యభిచారమూ మాట్లాడుతున్నాడు. అతని మనసుమీద అల్లాంటి re-action రియాక్షన్ కలిగింది. ఏంచేస్తాం?

"విచిత్రమేముంది? నేను స్త్రీనైతే సంసారాన్ని వొదిలి, ఆయనకోసం వెళ్ళివుండనా?" అన్నాను. పర్యవసానం వూహాకే వొదిలేస్తా ఎవరిమీదన్నా గౌరవం కలగగానే ఆ వ్యక్తిమీద బురదపేడ చిమ్మాలనే ఆసక్తి యీ అరవదేశంలో, తెలుగుదేశంలో అమితంగా చూశాను. ఒకర్ని పూజించడమనేది భరించలేరు తమలోగాని యితరులలోకాని.

అంతకన్న యెక్కువ గౌరవం డాక్టరుగారిమీద నాకు. నేను చూసిన complete man సంపూర్ణవ్యక్తి ఆయన ఒక్కడే.

మొన్న పెద్దమ్మాయిగారిని చూడడానికి వెడితే—

"డాక్టరుపోయి అప్పుడే యేడేళ్లయింది"

అన్నారు. దృష్టి యెక్కడో పెట్టి

"ఇంకా బందరు జీవించేవుంది" అనుకున్నాను మనసులో నేను.

ఆమె ఇంకా "ఏమంటావు అబ్బాయీ" అని అడుగుతున్నట్టు పక్కకి తిరుగుతోనే వున్నారు శూన్యంవేపు.

రామ్మూర్తి చచ్చిపోయినాడని టెలిగ్రాం రాగానే నా మనసు మొదటి తలపు—

"ఈ సంగతి రామ్మూర్తితో చెప్పాలి" అని. అట్లానే ఎథెల్ మానిన్ తన మిత్రుడి ఆత్మహత్యమీద పంచాయతీ జరిగినపుడు అక్కడి మనుషుల్ని పరిశీస్తో ఆయన శవముందే " ఈ సంగతులు

అతనితో వర్ణిస్తే ఎంత నవ్వుతారు ?" అనుకున్నానని వ్రాస్తోంది. ఎథెల్ మానిక్ — ఎన్ని మైళ్ళ దూరాన — ఎంత సంబంధం మనసులో!

చాలారోజులు ర — చచ్చిపోయింతరవాత కొత్తకథ వ్రాయగానే ర—కి వినిపించాలని అనుకునేవాణ్ణి!! ఇప్పుడెవ్వరూ లేరు వినడానికి. ఎందుకు వ్రాస్తాను? మానిక్ వ్రాసినట్లు 'Life is a habit' అన్నాట్ట Betrand Russel. అందువల్ల విధి కొట్టే ఒక్కొక్క దెబ్బతో కింద బోర్లపడీకూడా లేచి నడుస్తో వుంటాము. గతాన్ని వెంట యీడ్చుకుంటూ సగం నలిగిపోయిన నల్లులలాగు.

చచ్చిపోయినవాళ్ల జ్ఞాపకాలని ఆపాలని ఎన్ని ప్రయత్నాలు లోకంలో. గోరీలమీద వ్రాతలు చూడండి. వెర్రిహృదయాలు. ఆంధ్ర రచయితలలో ఒకరు చచ్చిపోయిన కొడుకు బొమ్మని పుస్తకం మీద అచ్చువేయించారు. చూడగానే పెద్దదిగులు వేస్తుంది నాకు. వెర్రితనం! ఆ ప్రేమబంధం మనసులోనే దానికి వెలుగు. బైటికి తీశామా అది వుత్త తాడు

రామ్మూర్తి చచ్చిపోగానే మద్దుకృష్ణ, "రామ్మూర్తి జీవిత చరిత్ర వ్రాద్దామా?" అన్నాడు

"మీరూ నేనూ చదువుకోవాలి. రామ్మూర్తి ఎవరికి గొప్ప" అన్నాను.

చావు - చచ్చిపోయినవాళ్లు, మన రహస్యాలు మన స్వాంతం, మన ఆస్తి, ఇంకొకరికిచ్చామా, లోకంముందు పంచామా? ఎందుకూ పనికిరాని దుమ్ము!

చచ్చిపోయినవాళ్లు మనవాళ్లు. మననించి వాళ్ళనెవ్వరూ తీసుకోలేరు. టాగూరు "నువ్వు యీ బైటలోకంలో చచ్చిపోయి నా అంతరాత్మలో పునర్జన్మనిపొంది నివసిస్తున్నావు." అన్నారు. బతికివున్నవాళ్లు మనతో తగాదాలాడి విరోధులు కావచ్చు. పెళ్లిళ్లు చేసుకుని మర్యాదస్థులై మనకి దూరంకావచ్చు. కాని మనము ప్రేమించిన వాళ్లు మృతిపొంది మనస్వాంతమైపోతారు. జ్ఞాపకం వుంచుకో తలుచుకున్నన్నాళ్లు వాళ్లు మనవాళ్లు. బ్రతికివున్నవాళ్లకన్న సన్ని

హితులు. ఈ బ్రతికివున్న వాళ్ల నీడలన్నీ మనం నిజమనుకోటంలేదా?, అంతకన్నా తీసిపోయినారా చచ్చినవాళ్లు, మన ప్రేమాస్పదులు?

పెద్దమ్మాయి.గారు తనకి అంగీకారంలేని విషయాల్లోకూడా ఎంతో insight ఇన్ సైట్ చూపగలరు.

ఒకసారి వేదాంతం మాట్లాడుతున్నాము.

"నిన్న రాత్రి మీ చెల్లెలుగారూ నేనూ చాలాసేపు అద్వైతం చర్చించాము."

'ఈ లోకం దుఖ్ఖమయం. దీంట్లోంచి ఎంతత్వరగా తప్పించుకొంటే అంత నయమం'టారు ఆమె.

"ఈ జీవితం చాలా సుఖంగా ఆనందమయంగా వుందినాకు. ఏమాత్రమూ తప్పించుకోవాలని లేదు." అన్నాను నేను.

'అందరికీ అట్లావుందా?' అని ఆమె.

"ఆ దౌర్భాగ్యుల్ని తప్పించుకోమనండి. తప్పించుకోవాలంటే వైరాగ్యందాకా పోనక్కరలేదు. రైలుపట్టాలు సిద్ధంగానే వున్నాయి" అని నేను అన్నాను.

పెద్దమ్మాయిగారు పకపకా నవ్వారు. కాని కళ్ళల్లో వెంటనే సీరియస్ నెస్ వొచ్చింది. ఆమె చెల్లెలి వేదాంత పాఠాలతో ఆమెకి యెక్కువ 'సింపతీ' లేదని నాకు తెలుసు. కాని—

"ఇప్పుడట్లానే అంటారు మీరు. అట్లానే అనిపిస్తుంది కూడాను. కాని కాలం గడిచినకొద్దీ స్నేహితులు, బంధువులు, ఎంతో మనం నమ్మినవాళ్ళు మోసంచేసి ఆశలూ, కలలూ, విశ్వాసాలూ అన్నీ దుమ్మైపోయినప్పుడు ముందు ముందు ఏమంటారో మీరే?" అన్నారు ఆమె.

ఇది పది పదిహేనేళ్ళకిందట.

హృదయ భేదకమైనవీ అర్థంకానివీ ఐన రెండు మూడు మరణాలూ, అంతకన్నా దారుణంగా కలతపెట్టిన రెండు మూడు వియోగాలూ అవసరమైనాయి, నాకీలోకం చాలా సౌఖ్యంగా వుందనే నామాటల్ని నా మొహానే విసిరికొట్టేందుకు.

ఇతరులు కష్టంలో వున్నారంటే సానుభూతి వుండేదికాదు.

"మూర్ఖం. వినరు. జీవితాల్ని బాగుచేసుకోరు, అనుభవించనీ" అనేవాణ్ణి. దరిద్రమూ, రోగమూ, దిగులూ, మరణాలూ, అన్నీ మానవులు స్వయంగా కల్పించుకున్నట్టు తోచేవి. అజ్ఞానమూ, భీరుత్వమూ, అన్ని కష్టాలకీ కారణాలుగా కనపడేవి. వివేకవంతులై సయిన్సును నమ్మి సంస్కరించుకుంటే యీ లోకం ఆనందమయం కాదా అనిపించేది. కాని యీ నాడు అంతా సందేహమే. check pessarics, చెక్ పెసరీలు, potassium permangonate, సోపులిజములు, రేషనలిజములు, శాకాహారాలు, యివన్ని ఎంతవరకు సౌఖ్యాన్ని తీసుకురాగలవు ప్రజలకి; అజ్ఞానము, భీరుత్వమూ, మనస్సులోంచి, నాశనమైతేనే్ప. కాని అవి నాశనం కావటం ఎట్లా!

అజ్ఞానం, చెడ్డతనం. క్రూరత్వం - అవి ఏవో చాలా సులభంగా గోడలమీది రంగులమల్లే కడిగివేసేట్టు మాట్లాడతారు నీతివంతులు—

దేవుడు దయామయుడే, మానవులే యీ కష్టాలూ దుఃఖాలూ తెచ్చుకుంటారు, అంటారు మతస్థులు. మరణాల్నీ, వరదల్నీ, ఉప్పెనలనీ, చూస్తోకూడా, యింకా మాట్లాడితే అవికూడా ప్రజలమూర్ఖం మీద కోపంవల్ల దేవుడు కల్పించాడు అంటారు.

కాని యీ అజ్ఞానాన్నీ, భీరుత్వాన్నీ, బలహీనత్వాన్నీ, మనుషులు తెచ్చుకున్నవీ కావు, వదలగలవీ కావు-

ప్రజలు తప్పించుకోలేనివి. ఎంతప్రయత్నించినా ఉపవాసాలవల్ల, పశ్చాత్తాపాలవల్ల, విద్యవల్ల, కఠోరమైన దీక్షవల్ల, దేనివల్లా వదలనివి. ఇవి పైపూతలుకాదు, నేర్చుకున్నవికావు, ఇవి రక్తంలో, ఎముకల్లో నరాలలో, వ్యక్తిత్వంలో, జీవంలో, ఉనికిలో, కలిసి ఏర్పడ్డవి. ఎంతప్రయత్నించినా వాటి రూపాలు మారతాయి కాని, అవి పోవు.

"క్షయతో ఎందుకు బాధపడతావు? క్షయను వొదిలెయ్యి" అన్నా,

"ఈ డబ్బుమీది కాపీనమేమిటి? మానుకో" అన్నా ఒకటే అర్థం.

రాజ్యాంగాల్ని, కుటుంబపద్ధతుల్ని, విద్యావిధానాల్ని మార్చం గలం. కాని ఆత్మలోని రోగాన్ని పోగొట్టలేము.

ఎట్లాగో ఎప్పటికో మనుషులు మారతారనీ క్రమంగా అభివృద్ధిపొందుతున్నారనీ నమ్మకం.

ఈ లోకపు బాధల్ని భరించలేక, ఆకాశంలో స్వర్గాలు కల్పించుకున్న బలహీనత్వం.

ఆ స్వర్గంలో నమ్మకంపోయి, ఆ స్వర్గాన్ని క్రిందికి దింపి, కొన్నేళ్ళల్లో, యీ భూమే స్వర్గతుల్యం కాబోతుందని ఆశ.

ఈశ్వరునిలో ఇంకా గట్టి విశ్వాసం కుదిరితేసరి మనం దేవతల మౌతామని కొందరూ, ఈశ్వరుడిలో నమ్మకం పూర్తిగా నశిస్తే, యీ లోకం స్వర్గంగా చేసుకోగలమని కొందరు;

"ఈశ్వరుణ్ణి యీ లోకంలోంచి తరిమేస్తే" అన్నారు.

"దోమల్ని నాశనంచేయలేకపోయినాము ఇన్నేళ్ళనించి" అన్నాను నేను-

"ఎన్ని రోగాల్ని సాధించాము ?"

"ఎన్ని కొత్తరోగాలు పుడుతున్నాయి"

"సృష్టిశక్తుల్ని ఎన్నిటిని స్వాధీనంచేసుకున్నాము"

"సృష్టిశక్తులు ఎంతస్వాధీనం చేసుకుంటున్నాయి మనుషుల్ని క్రమంగా"

"ఎన్ని కొత్త సౌఖ్యాలు"

"ఎన్ని కొత్తదుఃఖాలు !"

ఏదో ఒకటి 'దీంతో మీకు కొత్త ఆశల్ని కలిగిస్తున్నాను. దీంతో మీ సంసార సమస్యలు తీరుతాయి' అని ఏదో ఓపద్ధతిని చూపలేనివాణ్ణి "Destructive" అంటారు.

లేతకొమ్మల్ని పట్టుకొని, కళ్ళుమూసుకు ఊళ్ళాడే, కవులూ, ఎండుకొమ్మల్ని పట్టుకుని వూగులాడే సంస్కర్తలూ

——